# తెలుగు పరిశోధన

ఆచార్య వెలుదండ నిత్యానందరావు

నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతికశాఖ, సాంస్కృతిక మండలి
తెలుగు అకాడమి, హైదరాబాదు

Blank Page

తెలుగు అకాదమి ప్రచురణ

లఘు గ్రంథం (మోనోగ్రాఫ్)

# తెలుగు పరిశోధన

రచయిత

**ఆచార్య వెలుదండ నిత్యానందరావు**

ప్రొఫెసర్, తెలుగు శాఖ

ఉస్మానియా విశ్వవిద్యాలయం

హైదరాబాదు

**4వ ప్రపంచ తెలుగు మహాసభలు**

**27,28,29 డిశంబరు, 2012**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

---

తెలుగు అకాదమి, హైదరాబాదు

***telugu pariSoodhana***

*a monograph published on the occasion of 4th World Telugu Conference*

***Author***

Prof. Veludanda Nityananda Rao

First Edition : 2012

Pages : Pp. xiv + 122 + iv

©
Telugu Akademi, Hyderabad

Copies : 5000

Price : Rs. 30/-

Published by TELUGU AKADEMI, Hyderabad- 500 029 (Andhra Pradesh) under the Centrally Sponsored Scheme of Production of Books and Literature in Regional Languages at the University level of the Goverment of India in the Ministry of Human Resource Development, New Delhi.

*All rights whatsoever in this book are strictly reserved and no portion of it may be reproduced by any process for any purpose without the written permission of the copyright owners.*

***Published, Printed & Distributed by***

**Telugu Akademi**
**Hyderabad**

***Laser Typeset at***

Telugu Akademi, Hyderabad

***Printed in India***

Printed at M/s. Anu Printers, Hyderabad

యస్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

# ముఖ్యమంత్రి
## ఆంధ్రప్రదేశ్

---

## సందేశం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒక్క వేదికపైకి తీసుకువచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిశంబరు 27 నుంచి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్యక్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగువారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకొంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికీ ఈ మహాసభలు ఎంతోగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ప్రపంచ సభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాల్ని ఎలా మెరుగుపరచాలీ తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలి అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవవైవిధ్యసదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవలి కాలంలో ప్రపంచవాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారతదేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన

విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని పలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశవిదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు సమాయత్తమైంది. ఈ సభలలో సదస్సులు, తెలుగువారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితకళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు మొదలైన ఎన్నో అంశాలతో పాటు, పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతున్నది.

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమావేశాల సందర్భంగా ప్రచురించే లఘుగ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాము.

కిరణ్ రెడ్డి

(యన్. కిరణ్ కుమార్ రెడ్డి)

సి. దామోదర రాజనరసింహ

# ఉపముఖ్యమంత్రి
## ఆంధ్రప్రదేశ్

---

# అభినందన

**ఏ దేశమేగినా, ఎందుకాలిడినా**
**పొగడరా నీతల్లి భూమి భారతిని**
**నిలపరా నీజాతి నిండు గౌరవము**

అన్న మహాకవి రాయప్రోలు వాక్కులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు నిత్యం స్మరించుకోతగినవి. దేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ, ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ తెలుగు ప్రజలు తమ ప్రతిభా పాటవాలను నిరూపించుకుంటూ ప్రశంసలు పొందుతున్న ఈ సమయంలో నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో మన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నది. ఇది తెలుగు భాషాభిమానులకూ, కళా సాంస్కృతిక రంగాలలో కృషి చేస్తున్నవారికీ ఒక పండగ.

ప్రపంచీకరణ నేపథ్యంలో మాతృభాషలను, మాతృసంస్కృతిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత. ఈ సందర్భంలో తెలుగు భాష, జాతి వికాసం కోసం నిరంతరంగా కృషిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా సంస్థ అయిన తెలుగు అకాడమికి 150 లఘుగ్రంథాలను(మోనోగ్రాఫ్‌లను) రాయించి పుస్తకాలుగా తెచ్చే అవకాశం కల్పించాం. తెలుగు భాష, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, తెలుగుభాషోద్యమాలు, సాహిత్యకారులు, సంఘసంస్కర్తలు, కథ, నవల, వ్యాసం, కవిత్వం లాంటి వివిధ సాహిత్య ప్రక్రియలు, ఛందస్సు, ప్రకృతివైద్యం, ప్రాచీన ఆధునిక సాహిత్య సాంస్కృతిక విషయా లన్నింటిపై, సాహిత్యచరిత్రలపై పుస్తకాలు రాయించి ముద్రిస్తున్న తెలుగు అకాడమిని అభినందిస్తున్నాను. కొద్ది సమయంలో పుస్తకాలు రాయించి ముద్రించడం అనేది ఓయజ్ఞంగా భావించి చేస్తేనే తప్ప ఈ పని పూర్తి కాదు. ఆ పనిని తెలుగు అకాడమి విజయవంతంగా నిర్వహిస్తున్నది.

ఇప్పుడు నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభలు, ఈ సందర్భంగా ప్రచురిస్తున్న పుస్తకాలు మన భాషను, జాతిని, సంస్కృతిని, చరిత్రను సమున్నతంగా నిలబెట్టే యజ్ఞంలో, తెలుగు భాషా పరిరక్షణలో ఎంతో ఉపయోగపడతాయని ఆశిస్తున్నాను. తెలుగు భాష పరిరక్షణకోసం, ఔన్నత్యం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జరుగుతున్న ఈ ప్రపంచ తెలుగు మహాసభలను ఆహ్వానిస్తూ, ఇన్ని పుస్తకాలు ముద్రిస్తున్న తెలుగు అకాడమి సంచాలకులకు, రచయితలకు మరియు అకాడమి సిబ్బందికి అభినందనలు తెలుపుతూ ప్రపంచంలో ఉన్న 18 కోట్ల మంది తెలుగు ప్రజల అభ్యున్నతి కోరుతూ.. మరోసారి అందరికీ నాహృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాను. .

"తల్లి నుడికంటె పరమామృతంబుకలదె"

(సి. దామోదర రాజనరసింహ)

**V. VASANT KUMAR,** B.Sc.(Ag.), M.B.A
Minister for Tourism & Culture,
Archgology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat
Hyderabad - 500 022
Phone : 040-23454168,
23450541
Fax :040-23450899

# ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తరవాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు, మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింపజేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచుకునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు, తెలుగు వారి సంస్కృతి బహుముఖీయమైంది. అందులో భాష, సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకొని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే 'ప్రపంచ తెలుగు మహాసభల' నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల పునశ్చరణ, వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి, అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటికప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే"ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వసిస్తున్నాను.

**వట్టి వసంతకుమార్**

# భూమిక

1968లో ప్రభుత్వం అప్పటి విద్యాశాఖమంత్రి మాన్యశ్రీ పి.వి. నరసింహారావు గారు తొలి అధ్యక్షులుగా స్థాపించిన తెలుగు అకాడమి తెలుగు భాషా వికాసం కోసం చేస్తున్న కృషి అపరిమితం. పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, మోనోగ్రాఫ్‌లు, నిఘంటువులు, మాండలిక పదకోశాలతో పాటు భాష, సాహిత్యం, సంస్కృతికి సంబంధించిన అనేక పుస్తకాలు ప్రచురిస్తూ తెలుగుభాషకోసం అకాడమి చేస్తున్న సేవలు అద్వితీయం. తెలుగు భాష, జాతి, సంస్కృతి ప్రేమికుడయిన మాన్యశ్రీ సి. దామోదర రాజనరసింహ గారు అధ్యక్షులుగా తెలుగు అకాడమి తన పరిధిని మరింత విస్తరించుకొని తెలుగు భాషలో శాశ్వతంగా మిగిలిపోగల అనేక పుస్తకాలను తీసుకువస్తున్నది. మహాకవి గుర్రం జాషువా పరిశోధన కేంద్రం నెలకొల్పి తద్వారా ప్రతి ఏటా సాహిత్యరంగంలో విశిష్టసేవ చేసిన ముగ్గురిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున నగదు పురస్కారాలు ఇవ్వడం సాహిత్యవేత్తలకు, తెలుగు భాషకు చేస్తున్న సేవకు నిదర్శనం. తెలుగు వారి చరిత్రలోనే ఇది ప్రథమం. అకాడమి ప్రచురించే పుస్తకాలతో పాటు ఇటీవలి కాలంలో గురజాడ సాహిత్యసర్వస్వం, జాషువా పరిశోధన కేంద్రం తరఫున పుస్తకాలు ప్రచురించింది. తన 45 సంవత్సరాల చరిత్రలో దాదాపు 3500 శీర్షికలతో వివిధ గ్రంథాలను ప్రచురించి భారతదేశంలోని అకాడమిలన్నింటిలో తెలుగు అకాడమి అగ్రస్థానంలో నిలబడటం తెలుగు వారి కృషికి గర్వకారణం. రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు, సభలు, చర్చాగోష్ఠులు నిర్వహించడంతో పాటు ఇటీవల జాషువా జయంతి సందర్భంగా "శతకవితావసంతం" నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా కవితాచైతన్యానికి, కవులకు ప్రోత్సాహాన్నిచ్చింది తెలుగు అకాడమి.

2012 డిశంబర్ 27,28,29 తేదీల్లో తిరుపతిలో జరగనున్న నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రభుత్వం అకాడమి పై ఉన్న నమ్మకంతో 150లఘు గ్రంథాలను (మోనోగ్రాఫ్‌లను)రాయించి ప్రచురించే బాధ్యతను అప్పగించింది. తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సామాజిక శాస్త్రాలు, విజ్ఞాన శాస్త్రాలు, జాతి, సంస్కృతి ఒక్కటేమిటి తెలుగుకు సంబంధించిన వివిధ అంశాలను తీసుకొని పుస్తకాలు రాయించడం జరిగింది. తెలుగు భాషా, సాహిత్యాలలో లబ్ధ ప్రతిష్ఠులైనవారితో పాటు ఆయారంగాల్లో నిపుణులైన వాళ్ళతో పుస్తకాలు తయారు

చేయించి ప్రచురిస్తున్నాం. తెలుగు భాషను, సాహిత్య సంస్కృతులను, సమస్త విషయాలను సమున్నతంగా నిలబెట్టగలమన్న నమ్మకంతోనే ఈ కృషి చేస్తున్నాం. తెలుగు సాహిత్యంలో అనర్ఘరత్నాలనదగిన, జాతి సంపదనదగిన పుస్తకాలను ప్రచురించే ఈ సువర్ణ అవకాశం మాకు కల్పించడమేగాక ఆర్థిక వనరులను అందించి ప్రోత్సహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారికి, సాంస్కృతిక శాఖ, సాంస్కృతికమండలివారికి కృతజ్ఞతలు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి **మాన్యశ్రీ యస్. కిరణ్ కుమార్ రెడ్డి** గారికి; ఉపముఖ్యమంత్రి, ఉన్నత విద్యాశాఖా మంత్రి తెలుగు అకాడమి అధ్యక్షులు **మాన్యశ్రీ దామోదర రాజనరసింహ గారికి;** సాంస్కృతిక శాఖామాత్యులు **మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి** కృతజ్ఞతాభివందనాలు.

4వ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకుగాను ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి సంఘం సభ్యులు :

**శ్రీ ఆర్. వి. రమణమూర్తి,** అధ్యక్షులు, సాంస్కృతిక మండలి

**శ్రీ మండలి బుద్ధప్రసాద్,** రాష్ట్ర అధికారభాషా సంఘం అధ్యక్షులు

**డా. జె. బాపురెడ్డి,** ఐ.ఎ.ఎస్.,(రి)

**శ్రీ కె.వి. రమణాచారి,** ఐ.ఎ.ఎస్.,(రి) సాంస్కృతిక శాఖ, సలహాదారులు

**శ్రీ వి. భాస్కర్,** ఐ.ఎ.ఎస్. ముఖ్య కార్యదర్శి, ఆర్థిక శాఖ, ఆం.ప్ర.

**శ్రీ ఎల్. వి. సుబ్రహ్మణ్యం,** ఐ.ఎ.ఎస్. కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానం

**శ్రీమతి చిత్రా రామచంద్రన్,** ఐ.ఎ.ఎస్., ముఖ్య కార్యదర్శి, రెవెన్యూ శాఖ (దేవదాయ)

**ఆచార్య ఎల్లూరి శివారెడ్డి,** ఉపాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

**శ్రీ జి. బలరామయ్య,** ఐ.ఎ.ఎస్., ప్రభుత్వ కార్యదర్శి, సాంస్కృతిక శాఖ

**శ్రీ జి. ఎన్. రావు,** ఐ.ఎ.ఎస్.(రి) ప్రత్యేకాధికారి, శిల్పారామం

**ఆచార్య కె. యాదగిరి,** సంచాలకులు, తెలుగు అకాడమి

**డా. రాళ్లబండి కవితా ప్రసాద్,** సంచాలకులు, సాంస్కృతిక శాఖ

ప్రపంచ తెలుగు మహాసభల రూపకల్పనతో పాటు లఘుగ్రంథాల తయారీలో తమ సహాయ సహకారాలు అందించినందుకు ఈ కమిటీ వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాం.

4వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురిస్తున్న ఈ మోనోగ్రాఫ్‌లను అత్యంత స్వల్ప వ్యవధిలో తయారుచేయించడం జరిగింది. ఈ గ్రంథాల్లో ఏవైనా దోషాలు, పొరపాట్లు దొర్లినట్లు పాఠకులు గమనిస్తే సహృదయంతో వాటిని మా దృష్టికి తీసుకొని వస్తే మలి ముద్రణలో సవరించగలమని తెలియజేస్తున్నాం.

**ధర్మమనుడు, తత్త్వమనుడు, యోగమనుడు**
**ప్రాణిసాధింపగల సకలపరమార్థములకు**
**తల్లిభాషప్రధాన సూత్రంబయగుట**
**భాషకంటె నవ్యులకు తపస్సులేదు**

**ఆచార్య కె. యాదగిరి**
సంచాలకులు

# తెలుగు అకాడమి సమన్వయ సంఘం

ఆచార్య కె. యాదగిరి
సంచాలకులు

డా॥ ఎం. మాణిక్యలక్ష్మి
ఉపసంచాలకులు

డా॥ ఎన్. యోగిబాబు

డా॥ టి. అరవింద

శ్రీ టి. రాజేందర్ కుమార్

శ్రీ ఎం. వెంకటేశం

శ్రీమతి సి. శ్రీవిద్య

శ్రీ ఎస్. భూపాల్‌రెడ్డి

శ్రీమతి కె. గీతాంజలి

డా॥ ఎం. శైలజ

డా॥ ఎస్.ఎ.టి. రాజ్యలక్ష్మి

శ్రీమతి వి. అరుంధతి

శ్రీ ఎస్. వేదవ్యాస్

---

* *ఈ గ్రంథంలో ప్రచురితమైన విషయాలకు, వివరాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలు/రచయిత్రులే బాధ్యులు.*

# ప్రవేశిక

'తెలుగు పరిశోధన'తో వృత్తిరీత్యా, ప్రవృత్తి రీత్యా నా జీవితం ముడిపడి రెండున్నర దశాబ్దాలయింది. నేను రాసిన అనేక వ్యాసాల్లో నూతన పరిశోధనాంశాలను సూచించడం పరిపాటి అయింది. అవన్నీ ఏదో ఒక విశ్వవిద్యాలయంలో పరిశోధనాంశాలు కావడం నాకు ఆనందాన్ని కలిగించే సంగతి.

వివిధ విశ్వవిద్యాలయాల తెలుగుశాఖల్లో, తులనాత్మక కేంద్రాల్లో, భాషా, జానపద పీఠాల్లో, హిందీ, ఇంగ్లీషుశాఖల్లో తెలుగుభాషా సాహిత్యాల మీద నేటి దాక 5200 ఎం.ఫిల్, పిహెచ్.డీలు వచ్చినట్లు ఒక అంచనా. పరిశోధక విద్యార్థులకు స్ఫూర్తి ప్రదంగాను, పర్యవేక్షకులకు సూచనాత్మకంగాను ఉండేలా ఈ గ్రంథం రూపొందించనైంది. ఇందులో విశ్వవిద్యాలయ పరిశోధనలకు నేపథ్యప్రాయంగా నిలిచిన స్ఫూర్తిదాతలను స్మరించడం, పరిశోధకుల ప్రవృత్తి, పరిశోధనాంశ ఎన్నికలో ఉండే సాధక బాధకాలను, వదులుకోవాల్సిన జాడ్యాలను, అనుసరించవలసిన పద్ధతులను చర్చించనైంది.

తెలుగుభాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణ గమ్యంగా జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు అకాడమీ సంచాలకులు ఆచార్య కె. యాదగిరి గారు యువతరానికి ముఖ్యంగా తెలుగు పరిశోధకవిద్యార్థులకు ఉత్తేజంకలిగేలా 'తెలుగు పరిశోధన' మీద గ్రంథం రాయాల్సిందిగా ఆదేశించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఆచార్యునిగా, పర్యవేక్షకునిగా వివిధ విశ్వవిద్యాలయాల సిద్ధాంత గ్రంథాలకు పరీక్షకునిగా వ్యవహరిస్తున్న నాకు ఇంతకన్నా మంచి అంశమేమి ఉండదని అనిపించింది.

ఎంతో ఔచిత్యంతో నాకీ అంశాన్ని కేటాయించిన ఆచార్య కె. యాదగిరిగారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. పరిశోధక విద్యార్థులకు, పర్యవేక్షకులకు, జిజ్ఞాసువులకు ఈ గ్రంథం ఆదర పాత్రమవుతుందని ఆశిస్తున్నాను.

**వెలుదండ నిత్యానందరావు**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఉపోద్ఘాతం | 1 |
| 2. | పరిశోధన రత్న ఆకరాలకు అభివందనం | 10 |
| 3. | తెలుగు శాఖల్లో పరిశోధన | 37 |
| 4. | పరిశోధకులు | 59 |
| 5. | పరిశోధనాంశ నిర్ణయం | 71 |
| 6. | నూతన పరిశోధనాంశాలు | 79 |
| 7. | సంప్రదించాల్సిన గ్రంథాలు | 94 |
| 8. | వదులుకోవాల్సిన జాడ్యాలు | 100 |
| 9. | పరిశోధన గ్రంథ రచన | 107 |
| 10. | పర్యవేక్షకులు | 113 |
| 11. | పరీక్షకులు | 118 |

# 1

# ఉపోద్ఘాతం

ఉన్నవానిని ఉన్నట్లుగా విచారించుట వేఱు. అట్లెందుకున్నావని విచారించుట వేఱు. అట్లెందుకున్నావని విచారించుట తత్త్వవిచారణ.[1] సత్యాన్వేషణశీలంతో తార్కిక బుద్ధితో, శాస్త్రీయ పద్ధతులతో చేసే సాహిత్య వ్యాసంగమే పరిశోధన. 'అపూర్వ'మైన 'అనిర్ధారిత'మైన సాహిత్యంశాలను వెల్లడి చేయడం, నిర్మాణసూత్రాలను విశ్లేషించడం, కొత్త సమన్వయాలను ప్రతిపాదించడం 'పరిశోధన' ప్రయోజనం. శ్రద్ధ, ఆసక్తి, నేపథ్య పరిజ్ఞానం, అన్వయ సామర్థ్యం, వ్యుత్పన్నశీలత పరిశోధనకు ఉండవలసిన అర్హతలు. దానికి సంబంధించిన అవసరమైన ఆకరాలు కావలసిన సామాగ్రి.

Research అన్న ఆంగ్లపదానికి సమానార్థకంగా పరిశోధన అన్న పదం స్థిరపడింది. ఇది భావార్థకమైన అనువాదమే. పునశ్శోధనం, పునరన్వేషణం అని కొందరి భావం. కాని అది సరియైన అనువాదం కాదు. మనకు Research చేయడం ఆంగ్ల సమాజ సంస్పర్శనం వల్ల సిద్ధించిందేమో కానీ 'పరిశోధన' చేయడం మాత్రం లేకపోలేదు. 'పరిశోధించు' అంటే వెతుకుట అన్న అర్థంలో మొదటినుండి వాడుతున్నదే. 'శోధించు' క్రియముందు 'పరి' ఉపసర్గగా చేరింది. మామిడి వేంకటార్యుని నిఘంటువులో శోధన పదానికి రెండు అర్థాలున్నాయి. 1. ధాతూనామ్ నిర్దోషీకరణే - తామ్రాది ధాతువుల్ని శుద్ధి చేయడం అని ఉంది. ఈ అర్థం మన రంగానికి

---

1. పద్యవిద్య, మహాభారతం ఆదిపర్వపీఠిక (1970) విశ్వనాథ సత్యనారాయణ - పుటలు XXVI

సంబంధించింది కాదు. ఆయుర్వేద సంబంధి. 2. లిఖితపత్రాదేః ప్రమాణీకరణే అంటే వ్రాతలోని తప్పుల్ని సవరించటం, పరిష్కరించటం అన్నమాట. ఇది Research లో ఒక ముఖ్యభాగమైన Textual Criticism ను ప్రతిఫలిస్తుంది.

మోనియర్ విలియమ్స్‌లో 'శోధ' 'శోధన'లకు వైద్యానికి సంబంధించిన Purification తో పాటు Correction, Setting Right అని అర్థాలు ఉన్నాయి. Detailed and Careful investigation into some subject or area of study with the aims of discovering and applying new facts or information అని 21వ శతాబ్ది చాంబర్స్ డిక్షనరీ నిర్వచిస్తుంది. ఆక్స్‌ఫర్డ్ థెసారస్ రిసర్చిలో ఉండే వివిధ దశలను పేర్కొంది. 1. Investigation 2. Experimentation 3. Factfinding 4. Testing 5. Exploration 5. Analysis 6. Examination 7. Scrutiny 8. Assessment 9. Study 10. **Review . ఏ సిద్ధాంత గ్రంథంలో నైనా ఇవన్నీ ఉండాల్సిందే. 'శోధన' అన్న** నామవాచకం కన్నా 'శోధించు' అన్న క్రియ ఎక్కువగా కవుల వాడుకలో ఉన్నట్లు బొడ్డుపల్లి పురుషోత్తంగారి క్రోడీకరణంలో తేలుతుంది.

ఎ) మానుగ **శోధింప** వలయు మానవపతికిన్ (భారతం, ఆదిపర్వం VI-108)

బి) దాని నిమ్మగ **శోధించి** యెఱింగి యుండునంత (ఆదిపర్వం VI-158)

సి) గణాధీశ్వరుల నెల్ల కడలను **శోధించి** (కుమార సంభవం 11-76)

డి) బహుళ క్రియ **శోధించిరి** (శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యం 1-10)

ఇక్కడ అంతా వెతికి అన్న అర్థంలో ప్రయుక్తమయింది.

**శోధించి** యేమేమి సంవేద్యాంశంబులు చెప్పిరో (భాగవతం 8-163)

**శోధింపంబడె** సర్వ శాస్త్రములు (భాగవతం 7-183)

శాస్త్ర అధ్యయన శీలతను, పాండిత్యాన్ని ఈ భాగవత ప్రయోగద్వయం తెలుపుతుంది.[1]

---

1. పరిశోధన - ప్రామాణిక నిర్వచనం. ముదివేడు ప్రభాకరరావు తెలుగు పరిశోధన 6 ఫిబ్రవరి - ఏప్రిల్ 1989 (ఈ వ్యాసంలోని కొన్ని అంశాలు అనివార్యంగా పునరుక్తం చేయక తప్పనందుకు ప్రభాకరరావుగారికి కృతజ్ఞతలు).

పశ్చిమ దిగ్భాగంబు **పరిశోధించు** అని సూర్యారాయాంధ్ర నిఘంటువు ఒక ప్రయోగాన్ని ఇచ్చింది. ఇక్కడ పరి ఉపసర్గపూర్వకమైన శోధించు ప్రయోగాన్ని గమనించవచ్చు.

గాథలు త్రవ్వక మిక్కిలి
మాధురిగన్ బూర్వ సుకవి మతములు పెక్కుల్
**శోధించి** తెలియ జెప్పిన
సాధనముగ సకలయతులు సంజ్ఞలు కృష్ణా.

'లక్షణశిరోమణి'లో పొత్తపి వెంకటరమణకవి (క్రీ.శ. 1700) అన్న మాటల్లో పరిశోధకుని కర్తవ్యం బోధపడుతుంది గదా! పరిశోధక విద్యార్థులకు స్వీకృత అంశానికి సంబంధించిన పూర్వకృషి వివరాలను సేకరించమని పర్యవేక్షకులు పురమాయిస్తుంటారు. విద్యార్థులు వెళ్ళి భారతిలాంటి పాత పత్రికలు గాలిస్తుంటారు. ఇదంతా 'పూర్వ సుకవి మతముల్ పెక్కుల్ శోధించడమే'. తర్క అలంకారశాస్త్రాదుల్లో కనిపించే పూర్వ పక్షం చేయడం, స్వమతస్థాపనం చేయడం లాంటివి విమర్శ నైజాన్ని ప్రకటించేవే.

ఆంధ్ర గీర్వాణ కావ్యంబు లందు నధిక
**శోధకుండవు** సకలార్థ సాధకుడవు
నీవు చెప్పెడి భల్లాణ నృపుని కథ మ
హేశ్వరాంకితముగ రచియింపవలయు

నని భల్లాణచరిత్రను రాసిన పోచిరాజు వీరన (1770-1840)ను అతని మిత్రుడన్నట్లు నిడుదవోలు వెంకటరావుగారు రాశారు. అంటే పోచిరాజు వీరన ప్రప్రథమ **అధికశోధకుడు** అన్నమాట. ఈ విశేషణం కవులకు మృగ్యం. నిడుదవోలు వారింకా ఎలా వివరించారో చూడండి.

'అధిక శోధన యనగా పరిశోధన. ఇదియే ఈనాడు విశ్వవిద్యాలయములో రిసెర్చి, తొలుత తెలుగువారిలో (ప్రథమ) చారిత్రక పరిశోధకుడు కావలి వెంకటబొర్రయ్య కాగా, వీరన ప్రథమ సాహిత్య

పరిశోధకుడు అని చెప్పవచ్చును. వీరిరువురు సమకాలీనులు'[1] అధికశోధకుడు అంటే బహుగ్రంథ పఠనశీలుడు, వ్రాయసగాడు, కావ్యాల ప్రతులు రాసి ఇచ్చినవాడు అనే అర్థంలోనే కవి ప్రయోగించినట్లుగా తోస్తుంది. నిడుదవోలువారు అవసరాన్ని మించి ఊహాలు చేసి 'విశ్వవిద్యాలయములలో రెసెర్చి' కి ముడిపెట్టారనిపిస్తుంది.

'పరిశోధన' తదంతర్భాగమైన 'శోధ' శబ్దం తెలుగులోనే కాదు, హిందీలో 'శోధ్‌ప్రబంధ్' అనీ, కన్నడంలో 'సంశోధన' అనీ వాడుతున్నారు. సంస్కృతగ్రంథాల మీద 'పరిశోధితమ్' అని ఉంటే తమిళగ్రంథాల మీద 'పరిశోధిత్తు', 'పరిశోధిక్కప్పట్టు' అని గోచరిస్తుంది. తెలుగులో 'సిద్ధాంత గ్రంథా'లన్న వాడుక స్థిరపడింది.

**విషయో విశయ శ్చైవ పూర్వపక్షస్తథోత్తరమ్**
**సంగతిశ్చేతి పంచాంగం శాస్త్రే ఉ ధికరణం విదుః**

అనే ఓ శ్లోకం ఎక్కడిదో కాని పరిశోధనలో జరిగే తతంగమంతా వివరిస్తుంది.

1. **విషయం:** ఏదైనా ఒక అంశాన్ని ప్రతిపాదించటం
2. **విశయం:** విశయం అంటే సంశయం అని అర్థం: (వి,సం ఉపసర్గలు) విషయప్రతిపాదనలోని శంకలు 'విశయం'.
3. **పూర్వపక్షం:** సంశయం (విశయం) ఆధారంగా ప్రతిపాదిత 'విషయాన్ని' సోపపత్తికంగా ఖండించటం, పూర్వపక్షం చేయడం.
4. **ఉత్తరం:** పూర్వపక్షాన్ని వివేచించడం, ఫలితాల ఆధారంగా సహేతుకంగా ఖండించడం. ఖండిస్తే అది నిలువలేదన్న సంగతి తెలుస్తుంది. దానివల్ల కొత్త విషయానికి దారి దొరుకుతుంది. ఖండించడానికి, వ్యతిరేకించడానికి వీలులేనిది అయితే సక్రమమైనదన్న నిర్ధారణ అవుతుంది.

---
1. భారతి, డిసెంబర్, 1963

5. సంగతి: ప్రతిపాదనలోని పూర్వ పక్షాలన్నీ తొలగిపోయి ప్రతిపాదితాంశం నిర్దుష్టమైన సిద్ధాంతంగా రూపొందుతుంది. 'సిద్ధాంతగ్రంథం' అని తెలుగు పరిశోధన గ్రంథాలపై రాస్తుంటాం కదా. సిద్ధాంత మంటే పై ఐదు లక్షణాలతో కూడినదని, ఆ లక్షణాలున్న గ్రంథం కనుక సిద్ధాంత గ్రంథమని వ్యవహారం.

**ఇది చదివిన పిమ్మట మతి**
**యెది యేనియుఁ జదువు బుద్ధి యేలా వొదమున్**
**బదపడి గ్రంథము లన్నియు**
**వెదకి వెదకి సారమెల్ల వివరింపంగన్** (1-7)

అని శపథం చేసిన కాకునూరు అప్పకవి 'అప్పకవీయం' (1656)లో ఉపయుక్త గ్రంథసూచికతో సహా పరిశోధన లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. పోతన లాంటి ప్రసిద్ధకవినే తిరస్కరించాడు.

కీ॥శే॥ కోవెల సంపత్కుమారాచార్యుల మాటల్లోనే చెప్పాలంటే 'అప్పకవి అనేక గ్రంథాల నుంచి అనేకాంశాలను ఉటంకించాడు. ఉదాహరించాడు. తన అభిప్రాయాలకు ప్రమాణాలను ప్రదర్శించాడు. పూర్వుల అభిప్రాయాలను స్వీకరించాడు. కొన్నింటిని హేతుబద్ధంగా నిరాకరించాడు. విషయాన్ని శాస్త్రీయంగా విశ్లేషించాడు. వివిధాంశాలను వర్గీకరించాడు. మూలగ్రంథానికి సంబంధించిన మూలాలను తన ఆధారాలతో ప్రదర్శించాడు. చర్చలు నిర్వహించాడు. అయితే ఆయన అభిప్రాయాలు మొదలయిన వాటితో అనంతర లాక్షణికులు గానీ ఈనాడు మనం గానీ అన్ని సందర్భాల్లోను ఏకీభవించలేకపోవచ్చు. ఎవరి యుక్తులు వారికి ఉండవచ్చు. అయినా ఆయన పరిశోధన విధానాన్ని కాదనలేం'[1] పరిశోధనలో జరిగే తతంగమంతా అప్పకవి సమర్థంగా నిర్వహించినట్లేగదా!

1. తెలుగు పరిశోధన: ఆత్మావలోకనం - తెలుగు ద్విదశాబ్ది ఉత్సవ సంచిక (1988)

జ్ఞానము కేవల కృప నజ్ఞానికి నుపదేశ విధి బ్రకాశము సేయం
గా నది సకల ధరిత్రీ దానంబున కంటె నధిక తర ఫలదమగున్

అని తిక్కన శాంతిపర్వంలో(4-255) ఒకే ఒక చోట చేసిన యతి ప్రయోగాన్ని అప్పకవి ఉదాహరించడం గమనిస్తే ఆయన మహాభారతాన్ని ఎంత నిశితంగా పరిశీలించి ప్రయోగాలు గుర్తుంచుకొన్నాడో తెలుస్తుంది. ఆయన పరిశోధన దక్షతకు తార్కాణం ఇది. తాళపత్రగ్రంథాలు పోయి ప్రచురిత గ్రంథాలు ఇంటింటికీ వచ్చిన ఈ రోజుల్లో తెలుగు లెక్చరర్లుగా జీతభత్యాలు తీసుకొంటున్న వారు పదవీ విరమణ చేసేలోగా ఒక్కసారైనా మహాభారతాన్ని ఆమూలాగ్రం చదువుతారా అన్నది సంశయమే.

## పరిశోధన స్వరూపం

'పరిశోధన తత్వం' అనేది మనకు ఉన్నప్పటికీ పరిశోధన ఒక ప్రక్రియగా ఆకృతి దాల్చి తెలుగులోకి ప్రవేశించడం ఆధునిక కాలంలోనే అంటే విశ్వవిద్యాలయాల ఆవిర్భావంతోనే జరిగింది. కొందరు విద్యార్థులకు కేవలం ఒక డిగ్రీ రావడంతో పరిశోధన ముగియవచ్చు. యూనివర్శిటీ లెక్చరర్లకు జీవనోపాధిమార్గంగా, పదోన్నతికి నిచ్చెనగా ఉపయోగపడవచ్చు. కానీ సాహితీవేత్తలకు, ఆలోచనాపరులకు, మేధావులకు వస్తుతత్వ విశేషాలను వెలికితీసే సాధనంగా, నూత్నసిద్ధాంతాలను, సూత్రీకరణలను ప్రతిపాదించే సాధనంగా పరిశోధన గోచరిస్తుంది. మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, నిడుదవోలు వెంకటరావు ప్రభృతులు గ్రంథపరిష్కరణం, పరిశోధనం జీవన వ్యసనంగా-అది తప్ప అన్యంలేదు- అన్నంత స్థాయిలో జీవించారు. ఇప్పుడు మేధావులుగా, పరిశోధకులుగా గణతికెక్కినవారు అధ్యాపకత్వాన్ని జీవికగా చేసుకుని సాహిత్యాన్ని గురించి ఆలోచిస్తున్నారు. పత్రికల్లో తరచు వ్యాసాలు రాస్తున్నారు. ఇతర పుస్తకాలు ప్రచురిస్తున్నారు. ఈ గ్రంథంలో ఐదువేలమంది పరిశోధకులుగా రికార్డ్ చేయబడితే వారిలో ముప్పావుశాతం మంది కేవలం డిగ్రీ రావడంతో పరిశోధన జీవితానికి, సాహిత్యవ్యాసంగానికి స్వస్తి చెప్పినవారే.

తెలిసిన స్వల్ప ఆధారాలతో తెలియని దాని అంతర్బహిస్తత్వాలను అన్వేషిస్తు క్రమపద్ధతిలో సాగడమే పరిశోధన అని స్థూలంగా సూత్రీకరించుకొంటే ఆ చిన్ని సూత్రంలో అతి విస్తృతకార్యకలాపాలు అంతర్భూతంగా ఉన్నాయని చెప్పవచ్చు. మనమనుకున్నది మనం తెలుసుకొనేది ఒక స్పష్టమైన రీతిలో దేశకాల సాహిత్యస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని ఒక క్రమపద్ధతిలో ఏవి? ఏమిటి? ఎందుకు? అన్న ప్రశ్నలకు తర్కసహంగా శాస్త్రీయంగా సమాధానాలు వెతకడమే **పరిశోధన** పరమార్థం. పరిశోధన ఒక విమర్శ దృష్టితో చేసే (సాహితీ) బౌద్ధికప్రక్రియ తప్ప సమాజంలో ఉన్న సమస్యలను పరిష్కరించడం గమ్యమైంది కాదు. పరిశోధన సముద్రంలో గజ ఈతగాళ్ళుగా దూసుకొని పోవడానికీ, ఆణిముత్యాల్లాంటి నూతనాంశాల్ని వెలికి తీయడానికీ పిహెచ్.డి. బాగా శిక్షణ నిచ్చే సోపానం. ఆ ప్రత్యేకాంశాన్ని గురించి అవసరం వస్తే మరింత విస్తారంగా పరిశోధనలు జరపడానికి తగిన తెలివితేటలు సామర్థ్యం ఉన్నాయని గుర్తింపు తెచ్చు కోవడానికి పిహెచ్.డి. ముద్ర ఉపయోగపడుతుంది.

## పరిశోధన, విమర్శ, సమీక్ష

పరిశోధన, విమర్శ, సమీక్ష ఒక్కోదశలో విడదీయరానంత సన్నిహితంగా ఉన్నట్లు కనిపిస్తాయి. కలిసిపోతాయి కూడా. ఒక సిద్ధాంత గ్రంథంలోనే పరిశోధకత్వం, విశ్లేషకత్వం, సమీక్షత్వం చోటు చేసుకోవచ్చు. సత్యనిష్ఠ, తాటస్థ్యం, లభ్య ఉపపత్తుల సహాయంతో సిద్ధాంత ప్రతిపాదనం చేసుకుంటూ పరిశోధన వస్తునిష్ఠంగా సాగిపోతుంది. తర్వాతి సోపానం విమర్శ. పరిశోధితాంశం లేదా ఒక అంశం పఠితలో కలిగించే అనుభూతి విశేషాన్ని గుర్తించడం, గుణాగుణ వివేచనం చేయడం విమర్శలో ప్రధానంగా జరిగే వ్యాపారం. శాస్త్రీయతతో పాటు విమర్శకుని అభిరుచి కూడా కావ్య విశ్లేషణలో ముఖ్యపాత్ర వహిస్తుంది. శబ్దం, అర్థం, వ్యాకరణం తెలిసినంతమాత్రాన కావ్యార్థతత్వం బోధపడదు. ఎలాంటి పూర్వ నిశ్చితాభిప్రాయాలు (Pre occupied Openions) లేకుండా నిర్మలాంతః

కరణంతో కవిభావనను స్వీకరించగలిగిన వానికే అంతరార్థాలు అవగతమవుతాయి. కావ్య బాహిరరూపమైన సాభిప్రాయం పదప్రయోగచాతుర్యం, సమాసనిర్మాణ కౌశలం, శబ్దాలంకారిక రీతి. ఆకర్షణీయ వాక్యవిన్యాసం అంతేగాక ఆంతర తత్త్వానికి చెందిన విశేషార్థస్ఫూర్తి మత్త్వం, హృదయాహ్లాదకరత్వం, ఆలోచ నాత్మకం, చైతన్య ప్రచోదనం, గుణ ఔచిత్య రసపోషణాదులను పరిశోధకుడు విశ్లేషించుకునే సామర్థ్యాన్ని సంపాదించు కోవాలి. దీనికి బహుపర్యాయపఠనం, నిరంతర మననం, సాహిత్య దీక్ష, ప్రతిభా పాండిత్యాలు, శ్రద్ధాభక్తులు, లేఖన నైపుణ్యం అవసరం. సాధారణ రచయితల లౌకిక రచనల మీద చేసే పరిశోధకులకు ఈ మాత్రం ఉంటే సరిపోవచ్చు. మంత్ర తంత్ర యౌగిక పారమార్థికాంశాలను భిన్నస్తరాలలో లౌకిక ఇతివృత్తంతో పొదిగిన ప్రాచీన సంస్కృత ఆంధ్ర మహాకవుల రచనలు (అందరు కారు సుమా! అరవిందుని సావిత్రి, మేడం బ్లావట్స్కీ సీక్రెట్ డాక్ట్రిన్ లాంటి రచనలు సరిగ్గా బోధపడాలంటే దైవానుగ్రహం, పరమ గురువుల ఆశీస్సులుండవలసిందే. దీనినే 'పురాకృతపుణ్యం' అని వ్యవహరిస్తాం. ఇది లేకపోతే అసమగ్రంగా బోధపడి అశాంతి కలిగించడమో వికృతంగా బోధపడి అపఖ్యాతి తేవడమో జరగవచ్చు. పరిశోధనలో పలువురి దృష్టిపడని 'అంశాన్ని' దొరికించుకోగలిగే నిశితత్వానికి ప్రాముఖ్యం ఉంటే, విమర్శలో పొరలు పొరలుగా విప్పి చెప్పగలిగే సామర్థ్యానికి అగ్రతాంబూలం ఉంటుంది.

'పరిశోధన కాధారము సత్యాన్వేషణమే. ఇందుపక్షపాతమున కిసుమంతయు తావు లేదు. విమర్శకుడు వకీలు వలె పక్షపాతము చూపెట్టవచ్చును. కాని పరిశోధకుడు న్యాయనిర్ణేతవలె సత్యాన్వేషణమునకు ప్రాధాన్యమిచ్చును.[1] అని ప్రముఖ హిందీ విద్వాంసుడు ఆచార్య కర్ణ రాజశేషగిరిరావు గారి మాటలు స్మరణీయాలు.

---

1. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారి 'నాథయోగి మనవేమన' (1987)కు రాసిన పీఠికలో

Research may be defined as the systematic and objective analysis and recording of controlled observations that may lead to the development of generalizations, principles or theories, resulting in prediction and possible ultimate control of events అని చెప్పిన John W. Best. మాటలను కూడ[1] మనం చెప్పుకోవచ్చు.

సమీక్షా పరిధి మరింత చిన్నది. గ్రంథస్థ విషయ నివేదన మాత్రమైంది. గ్రంథపరిచయం పరమావధిగా కొనసాగేది.

ఒక సిద్ధాంత గ్రంథంలో పరిశోధనాత్మకత, విమర్శనాత్మకత సమపాళ్ళలో ఉంటే విజ్ఞులు ఆదరిస్తారు. విషయాన్ని బట్టి, ఆవశ్యకతను బట్టి కొన్నింట్లో పరిశోధనాత్మకత ఎక్కువగా ఉంటే, మరికొన్నింట్లో విమర్శకు అధికస్థానం లభిస్తుంది. సాధారణంగా ప్రాచీన సాహిత్యాన్ని పరిశీలించే సిద్ధాంత గ్రంథాల్లో ప్రథమాధ్యాయంలో పరిశోధనాత్మకత అధికంగా గోచరిస్తే తక్కిన అధ్యాయాల్లో విశ్లేషణ రూపంలో విమర్శ ఎక్కువగా కనిపిస్తుంది. ఈ రెంటిని వదిలేసి కేవలం సమీక్ష మాత్రంగానో గ్రంథసారాంశ లేఖనంగా ఉంటే ఆ సిద్ధాంత గ్రంథం తేలిపోతుంది.

'1. నూత్న సిద్ధాంతాలను గాని, వాదాలను గాని రూపొందించ ...నికి తోడ్పడటం. 2. పూర్వ సిద్ధాంతాలను గాని, వాదాలను గాని సవరించి ...రిష్కరించి అభినవదృక్పథంతో సాహిత్యాన్ని గాని, ప్రక్రియలను గాని అనుశీలించడానికి మార్గాలను ఏర్పరచడం 3. కావ్యాల విలువలను వినూత్న దృక్కోణాలతో నిర్ధారించే పద్ధతులను ప్రతిపాదించడం, 4. సాహిత్యంలోని ప్రయోగాలను ప్రక్రియలను వివిధ సాహిత్యాంశాలను విశ్లేషణాత్మకంగా వివేచించడానికి వివరించడానికి సహాయకారి కావటం. 5. పరిశోధనలో వివిధశాఖలను ఆవిష్కరించడం'[2] అని జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిశోధనలు సాధించే ప్రయోజనాలను సోదాహరణంగా వింగడించి చూపారు.

---

1. రిసర్చి మెథడాలజీ - డా॥ యస్. జయప్రకాశ్ (1992) పుట. 41.
2. తెలుగులో పరిశోధన: తీరుతెన్నులు - తెలుగులో పరిశోధన రజతోత్సవ సంచిక, పుట XXI.

# 2

# పరిశోధన రత్న ఆకరాలకు అభివందనం

తెలుగువారి భాషాసాహిత్యాలకు, భావసంస్కారాలకు, రాజకీయ ఆర్థిక గమనాలకు 19వశతాబ్ది నూతనద్వారాలను తెరిచింది. సరికొత్త పవనాలను ఆహ్వానించింది. పాతదుమ్మును తొలగదోసింది. కొత్త వ్యవస్థకు రూపకల్పన చేసింది. 'అపూర్వ' ప్రక్రియలకు నారుపోసింది. దీనికి ప్రధానహేతువు ఆంగ్లభాషా సాహిత్య సంస్కారాల సాహచర్యమే నని చెప్పడానికి పెద్దగా ఆలోచించవలసిన పనిలేదు. కూపస్థ మండూకోపనిషత్తులు చదువుకుంటున్న భారతీయులకు/ తెలుగువారికి ప్రపంచమెంత విశాలమైందో, సమాజమెంత వైవిధ్యభరితమైందో, లోకగమనమే దిశలో సాగుతుందో, మనిషి విలువ ఏమిటో, వైజ్ఞానిక యాంత్రిక ఆవిష్కరణల ప్రయోజనమేమిటో ఆంగ్ల విద్యవల్ల తెలిసి వచ్చింది.

భాషల సాజాత్య సాదృశ్య సారూప్యాలను వివేచించార నిఘంటువులను నిర్మించారు. భిన్నభిన్న ప్రతులతో పోల్చి సాధుపాఠాల గవేషించి పరిష్కృత ప్రచురణల నందించారు. గ్రాంథిక భాషాపంజరాలను బద్దలు కొట్టి భాషాభిషక్కుల భేషజాలను అణిచివేశారు. పత్రికలను పెట్టి నలుచెరుగుల వృత్తాంతాలనందించడంతో పాటు నూతనభావాలను వ్యాప్తి చేశారు. సాహిత్య సాంస్కృతిక సంస్థలను, సమ్మేళనాలను నిర్వహింప సాగారు. బట్టలుతకడానికి పనికివచ్చిన బండలే చరిత్ర పునర్నిర్మాణానికి, ఆధారశిలలుగా మారగలవని గుర్తించారు. రాచరిక వ్యవస్థ, వర్ణవ్యవస్థ, విదేశీపాలన పట్ల వైముఖ్యం పెరిగింది. ప్రతిదాన్ని ప్రశ్నించే తత్త్వం, ప్రతిదాన్ని

తెలుసుకోవాలనే ఆసక్తి ఇనుమడించింది. అంధానుకరణం, గుడ్డినమ్మకాలు తొలిగిపోయాయి. నవల, వ్యాసం, నాటకం, వ్యాఖ్యానం , విమర్శ, సాహిత్య చరిత్ర, శాసన పరిశోధన, చరిత్ర రచన లాంటి ఎన్నెన్నో ప్రక్రియలు పరిఢవిల్లాయి. చదువరుల సంఖ్యపెరిగింది. రచయితల సంఖ్య పెరిగింది. చరిత్ర, భాష, సాహిత్యం, అముద్రిత గ్రంథ ప్రకటనం, విద్యావ్యాప్తి సంఘసంస్కరణ, సృజనాత్మకత, మొదలైన అన్ని రంగాలల్లోనూ ఒక నూతనోత్తేజం, ఒక సంక్షోభం, ఒక పునర్నిర్మాణకాంక్ష తలెత్తి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. వెలుగురేకలు వెల్లివిరిశాయి. తెలివివాకలు తీగసాగాయి.

ఈ నవ్యతాస్థాపనానికి మూలకందంగా నిలిచిన మహనీయులు కల్నల్ కాలిన్ మెకంజీ, రాబర్ట్‌కాల్డ్వెల్, సి.పి.బ్రౌన్ ఈ ముగ్గురు వరుసగా చరిత్ర, భాష, సాహిత్య రంగాల్లో తలెత్తిన నూతనాభ్యుదయానికి, పరిశోధన దీప్తికి ప్రథమ సోపానమై నిలిచారు. చరిత్ర పరిశోధనకు ఆద్యునిగా కల్నల్ కాలిన్‌మెకంజీ అనుకొంటే వారి బాటలో కొమర్రాజువారు, మల్లంపల్లివారు, నేలటూరి వారు, చిలుకూరి వీరభద్రరావు, సురవరం ప్రతాపరెడ్డి, బి.ఎన్. శాస్త్రి లాంటి వారంతా వస్తారు. భాషకు రాబర్ట్‌కాల్డ్వెల్‌ను ప్రతీకగా భావించుకొంటే గిడుగు రామ్మూర్తి, గంటి జోగిసోమయాజి, కోరాదరామకృష్ణయ్య, భద్రిరాజు కృష్ణమూర్తి మొదలుకొని నేటి భాషాపరిశోధకుల వరకు స్మరించుకోవచ్చు.

ఇక సి.పి. బ్రౌను పరిష్కరణం, అముద్రిత గ్రంథ ప్రకటనం, నిఘంటు నిర్మాణం, విమర్శనరంగం, వ్యాఖ్యానం అని భావిస్తే చిన్నయసూరి, వేదం వెంకటరాయశాస్త్రి, కందుకూరి వీరేశలింగం, కట్టమంచి రామలింగారెడ్డి, మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకర శాస్త్రి, నిడుదవోలు వెంకటరావు, ఖండవల్లి లక్ష్మీరంజనం ఇత్యాదులెందరో వారసులుగా నిలుస్తారు. మొదటిదశలోని పరిశోధకులెవరూ చరిత్ర, భాష, సాహిత్యం వేరు వేరు అంశాలని భావించలేదు. మూడురంగాలలోనూ తమ వ్యాసాంగాన్ని కొనసాగించారు. కనుక మూడు రంగాలను పరామర్శించవలసిందే.

# చరిత్ర

కర్నల్ కాలిన్ మెకంజీ(1754- 1821) సర్వేయర్ జనరల్ హోదాలో ఆ కాలంలో దాదాపు లక్షరూపాయలు వ్యయించి కన్యాకుమారి అగ్రం నుండి కృష్ణానది వరకు ఉన్న ముఖ్యపట్టణాలను, గ్రామాలను సందర్శించి తాళపత్రగ్రంథాలను, శాసనాలను సేకరించాడు. స్థానిక చరిత్రలను, గ్రామవిశేషాలను రాయించాడు. వీటినే కైఫియత్తులన్నారు. మెకంజీ 1568 రాతప్రతులు, 1070 స్థానిక చరిత్రలు 8076శాసన పాఠాలు, 2159 అనువాదాలు, 79 దేశపటాలు, 2630 డ్రాయింగులు 6218 నాణేలు 106 శిల్పచిత్రాలు, 149 పురాతన వస్తువులు సేకరించారు. అమరావతీ స్థూపం- ధరణికోట శిల్పాల ప్రతిరూపాలు తయారుచేయడంలో, సంరక్షించడంలో కీలకపాత్ర వహించాడు. మెకంజీ సేకరణల్లో ఇంగ్లాండుకు కొన్ని తరలిపోగా, మరికొన్ని మద్రాసు ప్రాచ్యలిఖిత భాండాగారానికి చేరాయి. ఈ మధ్య కొన్ని ప్రచురితాలయ్యాయి.

మెకంజీకి తోడునీడయి నిలచిన ఆత్మీయులు కావలి వెంకట బొర్రయ్య (1976-1803) కావలి రామస్వామి, కావలి లక్ష్మయ్యలు. "దక్షిణ భారత ఇతిహాస పరిశోధనాపితామహుడు" అని ఆరుద్ర "దక్షిణహిందు దేశపు మొట్టమొదటి ఎపిగ్రాఫిస్టు" అని కొమర్రాజు లాంటి విద్వాంసులు బొర్రయ్యను కీర్తించారు. కావలి రామస్వామి మొట్టమొదటిసారిగా 109 మంది దక్షిణ భారత కవుల జీవిత రేఖాచిత్రాలను The biographical sketches of Deccan Poets అనే పేర ఆంగ్లంలో 1829లో ప్రకటించారు. పాశ్చాత్య సంస్కారం తెలుగువారిలో కలిగించిన వికాసానికి ప్రథమ ప్రతిరూపాలు కావలిసోదరులు.

తెలుగువారి విజ్ఞాన సర్వస్వ నిర్మాణానికి చరిత్ర పరిశోధనకు దీపధారిగా నిలచిన మహనీయుడు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు. (18. ౨-1923) హైదరాబాదులో 1.9.1901న శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపకులలో కొమర్రాజువారొకరై తెలంగాణ చైతన్యానికి దోహదం చేశారు. సుమారు రెండువేల పుటల్లో ఒక వేయి విజ్ఞానాత్మక వ్యాసాలతో కూడు

సంపుటాల్లో "ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని" తయారు చేసి తెలుగువారికి చిరస్మరణీయులయ్యారు. ఏకశిలానగరం ఓరుగల్లేనని అది పోతన జన్మస్థలం అని కొమర్రాజుగారు సప్రమాణంగా నిరూపించి కడప ఒంటిమిట్ట వాదాన్ని పూర్తిగా ఖండించారు.

విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను నెలకొల్పి చారిత్రక, వైజ్ఞానిక రచనలు, నవలలు జీవిత చరిత్రలు, దేశచరిత్రలు, ఆర్థిక శాస్త్రాలు, 30దాకా ప్రచురించారు. హిందు మహాయుగం మహ్మదీయ మహాయుగం, శివాజి చరిత్ర మొదలగు గ్రంథాలు రాశారు. ఆనెగొంది శాసనం, పెదకోమటి వేమారెడ్డి నాలుగు తామ్రశాసనాలు. శాలంకాయనుల తామ్రశాసనాలు, రెండవపులకేశి తామ్రశాసనం పరిష్కరించి ప్రకటించారు. తెలుగుదేశాన్ని పాలించిన రాజవంశాల చరిత్రకు బాటలు వేశారు. లిపి పుట్టుపూర్వోత్త రాలను గురించి, తెలుగు తెనుగు ఆంధ్రం గురించి, ఇంకా ఎన్నో అంశాల మీద సత్యనిష్ఠతో వ్యాసాలు రాసిన అకళంక దేశభక్తులు కొమర్రాజువారు.

చరిత్ర పరిశోధన - శాసన పరిష్కారం, లిపిశాస్త్ర పరిజ్ఞానం లోనేకాక కవిత్వం నవల నాటకాది సృజనాత్మకరంగంలో అసమానులైన వారు **మల్లంపల్లి సోమశేఖరశర్మ** (1891-1963). అశోకుని శిలాశాసనాలు, ఇక్ష్వాకు శాలంకాయన విష్ణుకుండిన వాతాపి చాళుక్య, రేనాటి చోళ చాళుక్య కాకతీయ రెడ్డి విజయ నగరాది రాజుల శాసనాలను వివిధ పత్రికల్లో ప్రకటించారు. హిస్టరీ ఆఫ్ ది రెడ్డి కింగ్‌డమ్స్ (1948) ఎ ఫర్గాటన్ చాప్టర్ ఆఫ్ ఆంధ్రాహిస్టరీ (1945) అమరావతీస్తూపం- ఇతర వ్యాసాలు (1932) ఆంధ్ర దేశచరిత్ర సంగ్రహం మొదలగునవి రచించారు. విజ్ఞానసర్వస్వం, మూడవసంపుటం తెలుగు సంస్కృతి ఒకటి -రెండు భాగాలకు ప్రధాన సంగ్రాహకులుగా వ్యవహరించారు.

'డిగ్రీలు లేని పాండిత్యంబు వన్నెకు రాని యీ పాదుకాలాన బుట్టి' అంటు కవిసమ్రాట్ విశ్వనాథ వారు ప్రస్తుతిస్తూ తన ఆంధ్రప్రశస్తి కావ్యాన్ని మల్లంపల్లి వారికి అంకితమిచ్చారు. సి. నారాయణరెడ్డి, నేలటూరి

వెంకటరమణయ్య, తిరుమలరామచంద్ర, వేదం వేంకటకృష్ణశర్మ తమ రచనలను అంకితమిచ్చారు మరి నేడో డిగ్రీలుండి పాండిత్యంబు లేక వన్నెకు రాని పాడుకాలం దాపురించింది.

మల్లంపల్లి వారిని తలవగానే వారి అంతేవాసి గానున్న **నేలటూరి వెంకట రమణయ్య** (1891-1977) కళ్లలో మెదులుతారు. మద్రాసు విశ్వవిద్యాలయ చరిత్రశాఖలో రీడర్‌గా పనిచేశారు.(1931- 1946) వేదం వెంకటరాయశాస్త్రి ఆముక్తమాల్యదా సంజీవని వ్యాఖ్యాన రచనలో సహకరించేందుకు విజయనగర చరిత్ర మూలమూలలు త్రవ్విన మేధావి. విజయనగరసామ్రాజ్య చరిత్ర మీద అపూర్వమయిన గ్రంథాలను ఆంగ్లంలో ప్రచురించారు. కరికాళ చోళుడు- త్రిపులోచన పల్లవులు చారిత్రక పురుషులేనని **నిర్ధారించారు.** వేంగి చాళుక్యుల మీద ప్రామాణిక గ్రంథం రాశారు. శాసనవ్యాసాలు, వాఙ్మయ వ్యాసాలు, కథలు, వ్యాఖ్యానం, రూపకాలు రచించారు. డెబ్బైఏళ్ల వయస్సులో సైతం ఆంధ్రప్రదేశ్ పురాతత్వశాఖలో డిప్యూటి డైరెక్టరుగా సేవలందించారు. ఆ కాలంలో శాసనాలను జిల్లాల వారీగా వర్గీకరించి ఎపిగ్రాఫియా ఆంధ్రికా పేరుతో మూడు సంపుటాలు వెలువరించారు. 1.డా॥ మారేమండ రామారావు (ఓరుగల్లు , కాకతీయులు) 2. ముట్నూరి వెంకటరామయ్య (తెలుగుచోళులు)3. డా॥సి.మీనాక్షి (పల్లవుల పరిపాలన) 4. డా॥ఓరుగంటి రామచంద్రయ్య (శ్రీకృష్ణదేవరాయలు)5. డా॥శ్రీపాద కామేశ్వరరావు (కళింగదేశపు తూర్పు గంగవంశీయులు) 6. డా॥ అనంతరావు బాజీ (పశ్చిమ గంగవంశీయులు) 7.డా॥ఆదిపూడి నాగభూషణం(పశ్చిమదక్కను ఆర్థికచరిత్ర) 8. డా॥ సరోజినీ రేగాణి (విజయనగర రాజ్యంలో మతపరిస్థితులు) 9.డా॥ఎ. కృష్ణమూర్తి (ద్వార సముద్రపు హోయసలులు) 10. డా॥పి. శ్రీరామశర్మ (సాళువ వంశీయులు) 11. డా॥టి. శేషలింగం (విజయనగర పరిపాలన) 12. ఇంగువ కార్తికేయ శర్మ లాంటి మహామహులెందరో నేలటూరు వెంకటరమణయ్య శిష్యులంటే ఆయన గొప్పతనం ఏమిటో తెలుస్తుంది.

మనం పరిశోధించే అంశం పుస్తకాలలో నుండి మన మనస్సులోకి నరాల్లోకి ఇంకిపోవాలి. అది నిజమైన పరిశోధన. నేలటూరి వారి విజయనగర చరిత్ర ప్రధాన పరిశోధ నాంశం. -హంపీలో కృష్ణదేవరాయల స్వర్ణనిలయానికి 'హేమకూట'మని పేరు. నేలటూరి వారు వారికి చెన్నైలో ఉన్న ఇంటికి; ఆ తర్వాత హైదరాబాదులో ఉన్న ఇంటికి పెట్టుకొన్న పేరు 'హేమకూటం.'

**చిలుకూరి వీరభద్రరావు** (1872- 1939) చదివింది 'స్కూలుఫైనలు' అయినా చరిత్ర చతురాననులు. కందుకూరి వీరేశలింగం గారి సంస్కరణ దృక్పథం చేత ప్రభావితులైన వారు. ఆంధ్రుల చరిత్రను మూడు సంపుటాల్లో ప్రకటించారు. కాకతీయాంధ్ర రాజయుగ చరిత్ర, (1936) వెలవరించారు. 'ఆంధ్రేతిహాస పరిశోధకమండలి' స్థాపించి 12 సంపుటాల్లో ఆంధ్రచరిత్ర రాయడానికి సమాయత్తమయ్యారు. అవి పూర్తి కాలేదు. కానీ, వారి ఆస్తిపాస్తులు, ఆరోగ్యము, చివరకు ప్రాణం ఈ చరిత్ర రచనావ్యసనంలో పోయాయి. జాతీయోద్యమ ప్రభావ ఫలితమే చారిత్రక స్పృహ. చిలుకూరి వారికి చరిత్రలో ఏది ఆధార సమన్వితంగా దొరికితే అదే ప్రమాణం - కుండబద్దలు కొట్టినట్లు నిజాలను నిర్భయంగా చెప్పావారు. ఎవరికీ బెదిరేవారు కారు. క్షత్రియులకూ, రెడ్లకూ వెలమలకూ సంబంధ బాంధవ్యాలున్నాయని వీరు రాస్తే చాలామందికి కోపం వచ్చిందట. చారిత్రిక నవలలు, జీవిత చరిత్రలు రాశారు. చిలుకూరి తమ ఆంధ్రులచరిత్ర మూడవభాగంలో ఇలా సెలవిచ్చారు. నా గ్రంథాల్లో లోపాలు లేవనీ సమగ్రమైనవనీ నేను గర్వించడం లేదు. ఆధారాలు అసంపూర్ణంగా ఉన్నప్పుడు కొమ్ములు తిరిగిన వానికైనా భ్రమప్రమాదాలు తప్పవు. నా పుస్తకాలెంత దోషభూయిష్టమైనా చరిత్ర పరిశోధనకు మరికొందరిని పురికొల్పగలవు. అసూయాగ్రస్తులు గాక సత్యాన్వేషణపరులై ఎవ్వరైనా నా అభిప్రాయాలను ఖండించవచ్చు. దాని వల్ల నాకు అపకీర్తి కలుగబోదు. విమర్శనమూలంగానే సత్యం తేటపడి పరిశుద్ధమైన చరిత్ర వెలువడుతుందనడానికి సందేహపడవలసిన పనిలేదు. - పరిశోధక విద్యార్థులందరూ దీనిని గమనించాలి.

చరిత్రను ప్రస్తావిస్తున్నప్పుడు విధిగా స్మరించలసిన మహనీయుడు **కోట వెంకటాచలం** (1885- 1954) వీరు సప్తర్షి గణనం, ఖగోళ విజ్ఞానం ఆధారంగా భారత దేశ చరిత్ర పునర్నిర్మాణం గావించారు. విశ్వనాథ సత్యనారాయణ పురాణవైర గ్రంథమాల నవలలకు ప్రేరణ వీరే. బ్రహ్మాండ సృష్టి విజ్ఞానం, మానవ సృష్టి విజ్ఞానం, ఆభాస క్రైస్తవం, కలిశక విజ్ఞానం ఇత్యాదులు రాశారు. వీరి సిద్ధాంతాలు చాలామందికి మింగుడు పడలేదు.

**సురవరం ప్రతాపరెడ్డి** (1896-1953) రాజుల క్రమం- కాలక్రమం సంఘటనల క్రమంలో నుండి ప్రజల సాంఘిక జీవన విధానంవైపు దృష్టి మరలింపచేసిన దార్శనికుడు. ఎన్నెన్నో కావ్యాలలో ఇతివృత్తం మాటున దాగున్న ఆచారవ్యవహారాలు, మతసంస్కారాలు, వేషభూషణాలు, విద్యావినోదాలు, కళలు, కక్షలు, ఆయుధాలు, ఆటపాటలు, వర్తక వాణిజ్యాలను వెలికి తీసి తెలుగువారి చరిత్ర నాగరకతల విశేషాలను అందించిన అపూర్వగ్రంథం వారి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర.' సురవరం వారి 'రామాయణ విశేషాలు' రామాయణాన్ని భక్తి ఆధ్యాత్మికతల కోణం నుండి కాక చారిత్రక కోణం నుండి పరిశీలించిన గ్రంథం. వివిధ రామాయణాల చర్చ, వాల్మీకి కాలం నాటి భూగోళం, వానరులెవరు? రామాయణం నాటి జీవన వ్యవస్థ ఇత్యాది అనేక విషయాలను వారు చర్చించారు. 'హిందువుల పండుగల'కున్న పౌరాణిక ఇతిహాస సాంఘిక చారిత్రక నేపథ్యాన్ని వివరించిన సురవరం వారిగ్రంథమే ఆ రంగంలో ప్రథమం. తెలంగాణలో కవులు పూజ్యం అన్న మాటను ఖండిస్తూ 354 మంది కవులు- వారి రచనల వివరాలతో 'గోల్కొండ కవులసంచిక' తెచ్చారు. తెలంగాణ సామాజిక రాజకీయ చైతన్య దాతగా, పత్రికా సంపాదకునిగా, కవిగా, కథకునిగా, పండితునిగా, నీరాజనా లందుకున్న మహామనీషి సురవరం వారు.

సురవరం వారితో పాటే వినిపించే మరో పేరు **ఆదిరాజు వీరభద్రరావు** (1892-1973). తెలంగాణ వారిలో ఉన్న అవిద్య, అజ్ఞానం, నిస్పృహ, దాస్యభావనను పోగొట్టడంలో మాడపాటి వారు రాజకీయంగా

ఉద్యమిస్తే, సాహిత్య సాంస్కృతిక పోరాటాన్ని నిశ్శబ్దంగా చేసిన వారు ఆదిరాజువారు. హిందువో, మహ్మదీయుడో రకరకాలుగా చెప్పుకొన్న ఒక ర సీతాపతి రాజు అనే షితాబ్ ఖాన్. ఆదిరాజు వారు ఎన్నెన్నో రచనల్ని పరిశీలించి 1440 ప్రాంతంలో నాగముఖ్యుడనే నాయకుని మనమడు సీతాపతి బహమనీ వంశీయుల కింద 'సరదారు'గా ఉండి ఖాన్ బిరుదం పొందడంవల్ల సీతాపతి ఖాన్ అయ్యాడు. అతడు 1512లో గోల్కొండ నవాబుతో జరిగిన యుద్ధంలో చనిపోయాడు. ఇతడు హిందువే తప్ప ముస్లిం కాదని తేల్చారు. అలంపురం, ఆనెగొంది, కళ్యాణి- కొండాపురం- కొలనుపాక మొదలగు 12 ప్రసిద్ధ నగరాల విశేషాలనందించారు. "మన తెలంగాణం"లోని సనాలు, కాకతీయులు , గోల్కొండ లాంటి ఎన్నో విశేషాలు తెలిపారు. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశ నిర్మాతగా, జీవిత చరిత్రల నిర్మాతగా, శాసన పరిశీలకునిగా, బాలవాఙ్మయకర్తగా, గ్రంథాలయాల విద్యాసంస్థల, సారస్వత సంస్థల నిర్వాహకునిగా పలుకోణాల్లో ఆదిరాజువారు సేవలందించారు.

**డా॥మారేమండ రామారావు** (జననం:1906): ఆంధ్రదేశంలో బౌద్ధమత వ్యాప్తిని గురించి, కాకతీయుల గురించి విశేష కృషి చేశారు. మద్రాసు విశ్వవిద్యాలయం లో 1937లో చరిత్రలో పిహెచ్.డి చేసిన రెండవ ఆంధ్రుడు. (మొదటివారు నేలటూరి వెంకట రమణయ్య) అంశం కాకతీయ చరిత్ర, విజయపురి ఇక్ష్వాకులు, మధ్యయుగ భారతదేశంలో గ్రంథాలయాలు, ద్వైత సిద్ధాంతం, తొలినాటి చరిత్ర, దక్షిణ భారతదేశ చరిత్ర, శ్రీకృష్ణదేవరాయలు, ఆంధ్రదేశ శాసనాలు మూడు సంపుటాలు, తూర్పు చాళుక్య దేవాలయాలు, తొలిచాళుక్యుల దేవాలయాలు, తిరుమల తిరుపతి తిరుచానూరు దేవాలయాలు, శాతవాహన నాణేలు, తూర్పుచాళుక్యుల నాణేలు మొదలైన గ్రంథాలను ఆంగ్లంలో రాశారు. ఎం. రాధాకృష్ణశర్మ లాంటి పెద్దలు వారి పర్యవేక్షణలో పిహెచ్.డిలు చేశారు.

**పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు:** (1910- 1963): లండన్‌లో ఎల్.డి. బార్నెట్ పర్యవేక్షణలో 1000- 1500 కాలంలో ఆంధ్రుల చరిత్ర అనే అంశంపైన డాక్టరేటు పొందారు. దేశ విదేశాల్లో చరిత్ర పరిశోధకునిగా

పేరు గడించారు. నిజాం ప్రాంతంలో తెలంగాణ జిల్లాల శాసనాలను రెండుసంపుటాల్లో 1940 -42 లలో వెలువరించారు. కాకతీయ శాసనాలలోని అనేక సాంఘిక అంశాలను వెలుగులోకి తెచ్చారు. పురావస్తు డైరెక్టరుహోదాలో తెలంగాణ జిల్లాలోని చారిత్రక ప్రాధాన్యత ఉన్న అనేక స్థలాలను గుర్తించారు. తెలుగు సంస్కృతం ఇంగ్లీషు కన్నడ భాషల్లో పాండిత్యమే గాక భౌతికశాస్త్రం, జ్యోతిషం, ఖగోళ శాస్త్రాలలో కూడా అభినివేశం ఉండేది.

**బి.ఎన్. శాస్త్రి** (1932- 2002) గారు అనితర సాధ్యమైన విజ్ఞాన సర్వస్వాలను, చరిత్ర సంపుటాలను ఒక్కచేతిమీదుగా సాధించిన అపురూపమైన వ్యక్తి. విష్ణుకుండినుల పాలన తెలంగాణలో సాగిందని, తొలుత వారు బౌద్ధులని శాసన సాక్ష్యంతో బిఎన్‌శాస్త్రిగారు నిరూపించారు. విష్ణుకుండినులవి, కందూరి చోళులవి, కాకతీయులవి, ఎన్నో శాసనాలను వెలుగులోకి తెచ్చారు. త్రిపురాంతక, ముఖలింగ, బెజవాడ దుర్గామల్లీశ్వర శాసన సంపుటాలు; నల్గొండ, అదిలాబాదు, మహబూబ్‌నగర్ జిల్లాల సర్వస్వాలు రెడ్డి, బ్రాహ్మణ, రాజ్య సర్వస్వాలు; ఆంధ్రులసాంఘికచరిత్ర, ఆంధ్రదేశచరిత్ర -సంస్కృతి మూడు సంపుటాలు, భారతదేశచరిత్ర సంస్కృతి 21 సంపుటాల్లో వెలువరించారు. పత్రికాసంపాదకునిగా, నవలాకారునిగా, దేవాలయ నిర్మాతగా సర్వులకు ఆత్మీయునిగా బిఎన్‌శాస్త్రి చెరుగని ముద్రవేశారు.

బౌద్ధ వాఙ్మయం, పల్లవులతామ్ర శాసనాలు, దేవాలయ శాసనాలు, తూర్పుచాళుక్యులు లాంటి చారిత్రిక గ్రంథాలేకాక ; అప్పయ్య దీక్షితులు శంకరాచార్య జీవిత చరిత్రలేకాక శ్రీశైలం ప్రాజెక్టు వల్ల మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లా దేవాలయాలు మునిగిపోకుండా సంరక్షించిన పురాతత్వ శాస్త్రవేత్త ఎన్. రమేశన్. (1921-1981); నాగార్జునకొండ తవ్వకాలకు మూలపూరుషుడైన రావిప్రోలు సుబ్రహ్మణ్యం; 40 ఏళ్లే బతికి పురావస్తుశాఖకు గుర్తింపు తెచ్చి పెట్టినవారు, శిలా తామ్ర యుగానికి సంబంధించిన అపూర్వఅంశాలను వెల్లడి చేసిన బెండపూడి సుబ్బారావు, కంభంపాటి సత్యనారాయణ చరిత్రపరిశోధనను కొత్త పుంతలను తొక్కించి. తర్వాతి తరాలకు స్ఫూర్తిదాతలై మార్గదర్శనం చేశారు.; పి.వి.పరబ్రహ్మ

శాస్త్రి, వకుళాభరణం రామకృష్ణ , అడపా సత్యనారాయణ, ఈమని శివనాగిరెడ్డి లాంటి వారెందరో విశ్వవిద్యాలయాలలోపలా, వెలుపలా ముందుతరంవారి పరిశోధన స్ఫూర్తినందుకుని ముందుకు సాగుతున్నారు.

## భాష

తమిళం మాత్రం బాగా తెలిసి దేశీయ భాషలు తెలిసినవారు మరింత బాగా పరిశోధించాలని చెప్తూనే తెలుగు ద్రావిడ భాషాకుటుంబానికి చెందవచ్చునని చెప్పిన **రాబర్ట్ బిషప్ కాల్డ్వెల్** మాటలు – అందరికీ శిరోధార్యమై పోయాయి. మహామహోపాధ్యాయ **చిలుకూరి నారాయణరావు**(1890–1952) 1929లో మద్రాసు విశ్వవిద్యాలయం నుండి '11వశతాబ్ది తెలుగుభాష' పై పరిశోధించారు. ఇది తెలుగులో తొట్టతొలి పరిశోధన గ్రంథం. కాల్డ్వెల్ ద్రావిడ వాదాన్ని ఖండిస్తూ చిలుకూరి వారు ప్రాచీన ప్రాకృత భాషలకిది తక్కిన ద్రావిడ భాషల కంటె ఎక్కువ దగ్గరగా ఉన్నది "ద్రావిడ భాషల్లోని పదాలకు సమానార్ధక సంస్కృత పదాలను కాల్డ్‌వెల్ సమగ్రంగా సేకరించలేదు. ప్రాచీనార్య భాషలనుండి తక్కిన పాకృతముల వలె ద్రావిడ భాషలు వికాసము నొందినవని తలంచుచు నా దృష్టిలో పరిశోధనములు సాగించినచో ద్రావిడ భాషాతత్త్వము తేలగలదని చెప్పుట సాహసము కానేరదు."– అన్న సిద్ధాంతంతో కాల్డ్వెల్‌కు వ్యతిరేకదిశలో చిలుకూరి నారాయణరావుగారు పయనించారు. తెలుగు – ఉపభాషలు– మాండలికాలు, ధ్వనులు, లిపి, తెలుగు ప్రాకృత సంబంధాలు ఎన్నెన్నో విషయాలను అపూర్వంగా చర్చించారు. మొదటి బ్యాచ్ విద్యార్థులకు వెంటనే ఉద్యోగాలు లభించడం అనేది సామాన్యాంశం. కాని, మొట్టమొదటి పిహెచ్.డి విద్యార్థి అయిన చిలుకూరి వారికి అటు మద్రాసు విశ్వవిద్యాలయం లోనూ, ఇటు ఆంధ్ర విశ్వవిద్యాలయంలోనూ ఆధ్యాపకత్వం లభించలేదంటేనే వారి సిద్ధాంతంలోని బలమేమిటో తెలుస్తుంది.

'తెలుగు ద్రావిడ భాషాజన్యం' అని అనకపోతే ఎక్కడ అనాగరికులని తలపోస్తారో అన్నంతగా మన భాషా పండితులు భయపడిపోయారు. చిలుకూరి వారి గ్రంథంలో పేర్కొన్న ఉదాహరణలు వాడుకోవడం మీద చూపిన ఆసక్తిని ఆ గ్రంథాన్నిగురించి ఆ వాదాన్ని గురించి కనీసం అకడమిక్ గా

చర్చించడానికి ఆసక్తి చూపలేదు. చిలుకూరి వారి సమస్త సాహిత్య వ్యాసంగం దాదాపు ఒకలక్షాయాభై వేల పుటలదాకా విస్తరించింది. మొత్తం రాసిన పుస్తకాలు 250. ఆంధ్ర, సంస్కృత ప్రాకృత భాషా చరిత్రలు; గ్రీకు, రోమను, చీనా, జపాను, రష్యా., బర్మా, హిందూదేశ ఆంధ్రదేశ చరిత్రలు; ఇంకా శాసనపరిశోధన, ఆంగ్ల అనువాదాలు, నాటకాలు, పద్యగేయ కావ్యాలు మత వేదాంత గ్రంథాలు ఎన్నెన్నో రాశారు. తెలుగు తమిళ కన్నడ ఆంగ్ల ఉర్దూ అరబిక్ జపనీస్ భాషలు నేర్చారు.

వ్యావహారిక భాషా ఉద్యమకారునిగా చరిత్రలో చిరస్మరణీయులైనవారు **గిడుగు రామ్మూర్తి పంతులు** (1863- 1940) సవర భాషను స్వయంగా నేర్చుకొని 14 ఏళ్లు దాని పై కృషి చేసి ఆ భాషలో వాచకాలను, రీడర్లను నిఘంటువునలు తయారు చేసిన మహామేధావి. గొప్ప పరిశోధకులు. తెలుగు దేశంలో తెలుగుభాషను గురించి ఆధునిక పద్ధతులల్లో ఆలోచించిన మొట్టమొదటి భాషా శాస్త్రవేత్త. కవిత్రయ ప్రయోగాలతోనే భాషా ప్రయోజనాలు నెరవేరవు. కాలానుగుణమైన మార్పులు రావాలి. కొత్త పదప్రయోగాలు వ్యాప్తిలోకి రావాలి. కొత్త సమాజ అవసరాలు తీరడానికి భాష అన్ని రంగాలలో బలోపేతం కావాలి. అందుకు గ్రాంథిక భాష సరిపోదు. వ్యావహారిక భాషనే సమర్థమైందని గిడుగు రామ్మూర్తి ఒకయోధునిగా పండితులను ఢీకొన్నారు. ఊరూరా సభలను చేశారు. వ్యాసావళి, ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం, బాల కవిశరణ్యం, గద్యచింతామణి మొదలైన గ్రంథాల ద్వారా; 'తెలుగు' అనే పత్రిక నిర్వహణ ద్వారా వ్యావహారిక భాషకు అంతిమ విజయం చేకూర్చినవారయ్యారు.

'కొన్నిపట్టులందు గ్రాంథికవాదులు వాడుకనుడులు వాడుక తప్పదు. గాన, దానిని ఏవగించుట కూడదు. వ్యావహారిక భాషావాదులు కొన్నియెడల గ్రాంథిక రూపములు వాడవలసి వచ్చునుగాన, గ్రాంథిక భాష అసలే పనికిరాదు' అని అనకూడదు. 1914లోనే సమన్వయ దృక్పథంతో విజ్ఞతతో వ్యవహరించినవారు, 1941లోకూడా 'పలుకు తల్లిని గద్దె యెక్కించుట యెట్లు?' అని ఆరాటపడిన భాషావేత్త **మారేపల్లి రామచంద్రశాస్త్రి**. (1874-1951).

'తెనుగు తోబుట్టువులు(1935), తెనుగు నుడిదండలు(1953) లాంటి వ్యాసాలు రాశారు. 'నుడికడలి'ని నిర్మించడానికి యత్నించారు. ఎంతో దూరదృష్టితో వ్యవహరించిన మారేపల్లి రామచంద్ర శాస్త్రి గారి రచనలు అముద్రితాలుగా, అలభ్యాలుగా కాలగర్భంలో కలిసిపోవడం దురదృష్టం.

**ఆచార్య గంటిజోగి సోమయాజి**(1890- 1987) ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగుశాఖలో ఆచార్యులు. ఈనాడు సుప్రసిద్ధ భాషాశాస్త్రవేత్తలైన భద్రిరాజు కృష్ణమూర్తి, తూమాటి దొణప్ప, బూదరాజు రాధాకృష్ణ, పిఎస్సుబ్రహ్మణ్యం, చేకూరి రామారావు లాంటి వారంతా వీరిశిష్యులే. వీరు రాసిన 'ఆంధ్ర భాషా వికాసం 'బృహద్గ్రంథం. తెలుగుభాషా పరిణామ వికాసాలను తెలిపేది. విద్యార్థులకు పఠనీయ గ్రంథం. 38 అధ్యాయాల్లో సాగిన ఈ గ్రంథంలో తెలుగుభాష పేర్లు శాసన భాష- ఇతర భాషలతో సంబంధం, నామవాచకాలు, విశేషణాలు, క్రియలు, కృత్తద్ధితాలు ఇలా తెలుగు భాషకు సంబంధించిన సర్వాంశాలను ప్రణాళికాబద్ధంగా వివేచించి తెలుగు సంస్కృత భాషాజన్యం కాదని మూల ద్రావిడ భాష నుండి పుట్టిందని సిద్ధాంతీకరించారు. తెలుగు వ్యుత్పత్తి పదకోశం నిర్మాణానికి పూనుకొన్నారు. శిష్యులు దాన్ని కొనసాగించి ఎనిమిది సంపుటాలను తెచ్చారు. కొంతకాలం బొంబాయి లోని 'అఫీషియల్ లాంగ్వేజ్ కమీషన్'లో ప్రత్యేకాధికారిగా పనిచేశారు. ఐదు సం॥రాలు కృషి చేసి సాంకేతిక పదకోశాన్ని నిర్మించారు. ఆంగ్లం, సంస్కృతం, తమిళం, కన్నడం, మలయాళం మొదలైన భాషల్లో నిష్ణాతులు కావడంవల్ల తెలుగు ద్రావిడ భాషాజన్యం అని సిద్ధాంతీకరించడం వీరికి సులువైంది.

**కోరాడ రామకృష్ణయ్య** (1891-1962) మదరాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఆధ్యాపకులుగా పనిచేసినవారు. వీరు సంధి, స్టడీస్ ఇన్ ద్రవిడియన్ ఫైలాలజీ, భాషోత్పత్తిక్రమము - భాషా చరిత్రము, దక్షిణ దేశ భాషా సారస్వతములు, దేశి, భాషా చారిత్రక వ్యాసాలు Dravidian cognates అనే గ్రంథాల్ని భాషాపరంగా రాశారు. కాళిదాసు మీద, మహాభారతం మీద ఇతర సాహిత్యాంశాల మీద మరికొన్ని గ్రంథాలు రాశారు.

చారిత్రక పద్ధతిలో తమిళ కన్నడ మలయాళాదిసోదర ద్రావిడ భాషలతో సరిపోల్చి తెలుగు సంధిస్వరూపాన్ని విశ్లేషిస్తూ రాసిన వీరి 'సంధి' అనే గ్రంథానికి ఎంతోపేరు వచ్చింది. రుగాగమం, టుగామం లేవని రు, టు పదగతమైనవని వీరి ప్రతిపాదన. తెలుగు ద్రావిడ భాషాజన్యమనే కాల్డ్వెల్ సిద్ధాంతాన్ని బలపరుస్తూ తమిళ, కన్నడ, మలయాళాలలో తెలుగుకు ఉన్న సంబంధబాంధవ్యాలను విశ్లేషిస్తూ 'స్టడీస్ ఇన్ ద్రవిడియన్ పైలాలజీ అనే పుస్తకంలో రాశారు. ఇంకా నామధాతువుల్ని, క్రియాధాతువుల్ని ద్రావిడభాషా జాతీయపదాలను ద్రావిడ ధ్వనుల్ని విశ్లేషిస్తూ ఆంగ్లాంధ్ర భాషల్లో ప్రామాణిక వ్యాసాలు రాశారు.

భాషాశాస్త్రరంగంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన శాస్త్రవేత్త **ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి** (1928-2012) 1962లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్ర శాఖను స్థాపించి 1986 వరకు ఆచార్యులుగా కొనసాగారు. హైదరాబాదు విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలనందుకున్నారు.

తెలుగు భాషా స్వరూపస్వభావాల్ని శాస్త్రీయంగా విశ్లేషించిన ఘనత వీరిది. భాషా సామాజిక పరిశీలన, ద్రావిడ భాషలు, మాండలిక విజ్ఞానం, భాషాచరిత్ర, భాషా నవీకరణ, మాతృభాషలో విద్యాబోధన, వయోజన విద్య మొదలైన అంశాలపట్ల వీరి ప్రతిపాదనలు, పరిశీలనలు ప్రామాణికాలు.

భారతదేశంలో తొలిసారిగా వీరి నేతృత్వంలో తెలుగు మాండలికాల పరిశీలన జరిగింది. తెలుగు నాలుగుభాషా మండలాలుగా ఉందని గుర్తించారు. వ్యవసాయం, చేనేత, వృత్తి పదకోశాలు వీరి సంపాదకత్వంలో వెలువడ్డాయి. కొండభాషకు వ్యాకరణాన్ని రాశారు. తెలుగు ద్రావిడ భాషల్లో మధ్యద్రావిడ భాషకు చెందిందని వీరు నిర్ణయించారు. వయోజనుల్లో విద్యావ్యాప్తికోసం వారికనువైన భాషలో ఐదుసంపుటాల్లో భాషావాచకాలు తయారు చేశారు.

**ఆచార్య జి. ఎన్. రెడ్డి** (1927- 1989) మద్రాసు విశ్వవిద్యాలయం నుండి 'తెలుగులో అర్థ విపరిమాణం' అనే అంశం పై 1962లో డాక్టరేటు

పొందారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖఅధ్యక్షులుగా, ఆ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు.

ఫిల్లల భాష మొదలుకొని నిఘంటువు నిర్మాణం వరకు, కావ్యాల కర్తృత్వవివాదం మొదలుకొని కావ్యశైలి శిల్పం వరకు కంప్యూటర్ ఉపయోగించి పరిశోధన చేయవచ్చు. తెలుగు పరిశోధన అంటే కావ్య నాటక ప్రబంధాలకు కవులకు మాత్రమే పరిమితం కాదు. సమాజపరమైన ఆచారాలు, అలవాట్లు, సంప్రదాయాలు నమ్మకాలు శకునాలు, పూజలు, పండుగలు, పేర్లు, ప్రజాజీవనం, ప్రజా విజ్ఞానం ఇవన్నీ పరిశోధించదగ్గ విషయాలే. తెలుగు సమాజానికి సంబంధించిన ప్రతి అంశమూ పరిశోధనకు అర్హమే అన్న విశాల దృక్పథం జి.ఎన్. రెడ్డిగారిది. బోధనలో, పరిశోధనలో, పాఠ్యాంశాల రూపకల్పనలో, పాలనరంగంలో నూతనత్వాన్ని ఆధునిక సమాజ అవసరాలు తీర్చేవిధంగా సమర్థంగా ఉండాలని ఆరాటపడినవారు జి.ఎన్.రెడ్డి.

తెలుగు నిఘంటువు(1973); ఇంగ్లీషు తెలుగు ద్విభాషా నిఘంటువు (1978) తయారు చేశారు. కుమ్మర (1976) వడ్రంగి (1983) పదకోశాలు నిర్మించారు. వీరు తయారుచేసిన తెలుగు పర్యాయపద నిఘంటువు వీరు చనిపోయాక ప్రకటింపబడింది. తెలుగుసాహిత్యంపై ఆంగ్లభాషా ప్రభావం అనే వీరి ఆంగ్ల గ్రంథంలో ఆంగ్ల భాషా సాహిత్య సమాజాల ప్రభావం తెలుగు భాషా సాహిత్య సమాజాల మీద ఏవిధంగా ప్రసరించిందో వివరింపబడింది. చిత్తూరు ప్రాంతంలోని 1575 పొడుపు కథలను సేకరించి అకారాది క్రమంలో ప్రచురించారు. భాషా విజ్ఞాన పరిచయం ద్రావిడ భాషా విజ్ఞానం లాంటి గ్రంథాలు రాశారు.

పరిశోధన శబ్దానికి పర్యాయపదంగా చెప్పుకోదగిన **ఆచార్య తూమాటిదొణప్ప** (1926- 1996). హరికథా విజ్ఞాన సర్వస్వం, సంస్థానాలు సాహిత్యసేవ (1968) జానపద కళాసంపద (1978) మొదలైన అపూర్వ పరిశోధన గ్రంథాలు ప్రచురించారు. 1966 లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'తెలుగులో వైకృత పదస్వరూప నిరూపణం' అనే అంశంపై డాక్టరేటు చేసి 1988 లో ప్రచురించారు. సంస్కృత ప్రాకృత భవాలైన శబ్దాలు ఎన్నెన్ని

రకాలుగా మార్పులు చెందుతూ తెలుగులో ప్రవేశించాయో లక్ష్యలక్షణ సమన్వయ పూర్వకంగా భాషాశాస్త్ర దృక్పథంతో వివరించారు. ఈ సిద్ధాంతగ్రంథంలో సంస్కృత ప్రాకృత ఆంధ్ర ద్రావిడ భాషలమధ్య పద, వాక్య, వ్యాకరణ సంబంధాలను శాస్త్రీయంగా విశ్లేషించారు. భాషా చారిత్రక వ్యాసావళి (1972) అనే గ్రంథంలో నన్నయ శ్రీనాథ కృతుల్లోని అన్యదేశ్యాల గురించి; తెలుగులోని హకారాది శబ్దాల గురించి మరాఠిలోని తెలుగునుడుల గురించి తెలుగులో బుడతకీచు, (పోర్చుగీసు) శబ్దాలగురించి విశ్లేషించారు.

పాత్రికేయునిగా, సమీక్షకునిగా భాషా , సాహిత్యరంగాల్లో రెండింట విశేషమైన కృషిచేసిన వారు **డా॥ బూదరాజు రాధాకృష్ణ**(1932- 2006); వ్యావహారిక భాషా వికాసం, భాషాశాస్త్ర వ్యాసాలు, తెలుగు సంగతులు, అనువాదపాఠాలు లాంటివే గాక 'ఈనాడు' భాషా స్వరూపం, ఈనాడు వ్యవహార కోశం, ఆధునిక వ్యవహార కోశం, జర్నలిజం పరిచయం లాంటి పత్రికా సంబంధి రచనలు చేశారు. మాండలికవృత్తికోశం వాస్తు, లలిత కళల సంపుటాలకు; కోయ, గోండి, భాషావాచకాలకు సంపాదకత్వం వహించారు. శాసనభాషకు చారిత్రిక వ్యాకరణం రాసి 1965 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేటు పొందారు.

**ఆచార్య పి.ఎస్.సుబ్రహ్మణ్యం** (జ. 1939) ద్రావిడ భాషల్లోని పదనిర్మాణ పద్ధతుల మీద 1964లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేటు పొందారు. అన్నామలై విశ్వవిద్యాలయం భాషాశాస్త్రశాఖలో ఆచార్యులుగా సేవలందించారు. వీరు రాసిన ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు, ద్రావిడభాషలు రెండు గ్రంథాలు విద్యార్థులకు పాఠ్యగ్రంథాలుగా ఉపయోగపడుతున్నాయి. Dravidian comparative Phonology అనే గ్రంథాన్ని ఆంగ్లంలో రచించారు.

సాహిత్య విమర్శకుల్లో అగ్రేసరులుగా గుర్తింపు పొందిన **చేకూరి రామారావు** (1935) ప్రధానంగా భాషా శాస్త్రవేత్త. భాషాశాస్త్ర పద్ధతుల్లో తెలుగులో వాక్య నిర్మాణ స్వరూప స్వభావాలను విశ్లేషిస్తూ చేకూరి రామారావు రాసిన' తెలుగు వాక్యం' ప్రామాణిక రచన.

'తెలుగులో వెలుగులు' (1982) అనే వారి భాషాశాస్త్ర సంబంధిత వ్యాస సంకలనంలో అసమాపకక్రియలు, బహువచన రూపాలు, పారిభాషిక పదాల నిర్మాణాలు, తెలుగులో 'అని' చేసే పని, తెలుగులో నామ్నీకరరణాల గురించి విశ్లేషించారు. భాషానువర్తనం (2000) భాషా పరివేషం(2003) భాషాంతరంగం (2001) అనే మరో మూడు భాషాసంబంధరచనలే కాక మరెన్నో సాహిత్యవిమర్శనాత్మక గ్రంథాలు రాశారు. మంచి సాహిత్య విమర్శకునిగా ఎదగాలనుకొనే విద్యార్థులకు ఆచార్య చేకూరి రామారావు గారి సాహిత్య విమర్శ వ్యాససంకలనాలు ఎంతో ఉపయోగకరం.

**లకంసాని చక్రధరరావు** (జ. 1939) తెలుగు శాసనాల్లోని ఉర్దూ మరాఠీ పదాలు' అనే అంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయం ద్వారా 1967లో డాక్టరేటు పట్టం పొంది అక్కడే ఆచార్యులుగా పనిచేశారు. 1991లో 1,08,330 పదాలతో కూడిన 'తెలుగు వ్యుత్పత్తికోశం' 8 సంపుటాల్లో ప్రకటించారు. 'భాషా శాస్త్ర వ్యాసములు' (1968) పేరుతో పది భాషా శాస్త్ర సంబంధ వ్యాసాలు రాశారు. ద్రావిడ భాషలన్నీ సోదరభాషలే తప్ప ఏ భాషకూ అగ్రత్వాన్ని ఆపాదించకూడదని వారు సోదాహరణంగా నిరూపించారు. వైదిక సంస్కృత భాష స్వర ప్రధానం కాగా తెలుగుతో సహా ద్రావిడ భాషలన్నీ 'ఉనిక' ప్రధానమైనవి. స్వరం - ఉనిక ఈ రెండు భేదాలు ఆర్య - ద్రావిడ భాషల పరిశీలనలో ప్రధానంగా గుర్తించాలని ప్రతిపాదించారు.

**ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు**(జ.1940) నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులుగా పనిచేశారు. వీరు 'అనంతపురం జిల్లాగ్రామనామాలు ' అనే అంశంపై 1974 లో డాక్టరేటు పొందారు. గ్రామనామాల మీద ఇండ్లపేర్ల మీద విస్తృతంగా పరిశోధించారు. పరిశోధనలు చేయించారు. ఒక ఊరికథ,..ఇంటిపేర్లు, నామవిజ్ఞానం లాంటి పుస్తకాలన్నీ 'నామవిజ్ఞాన' సంబంధాలే.

ఇంకా భాషారంగంలో పరిమి రామనరసింహం, (శైలీశాస్త్రం) జి. ఉమామహేశ్వరరావు(యాంత్రికానువాదం) కోరాడ మహాదేవశాస్త్రి (చారిత్రక

వ్యాకరణం); జి.యస్. వరదాచారి (పత్రికాభాష) మొదలైన వారెందరో కృషిచేస్తున్నారు. తెలుగు భాషా స్వరూప స్వభావాలు, నామక్రియా విజ్ఞానం, మాండలిక భేదాలు, జన్యజనక సంబంధాల పట్ల సోదరభాషలతో ఉన్న సంబంధ బాంధవ్యాలు, పారిభాషికపదాలు, నూతన పదకల్పనలు, అనువాదసమస్యలు - ఇలా రకరకాల కోణాల నుండి తెలుగు విద్వాంసులు పరిశోధనలు సల్పుతున్నారు.

## సాహిత్యం

పురుగుల కెరయై, నుసినుసిగా రాలిపోతున్న తాటాకులను తన అమృతహస్తంతో రక్షించి కొండెక్కనున్న ఆంధ్ర సాహిత్య జ్యోతిని దిగ్దిగంతాలకు వ్యాపింపచేసిన స్థిర యశస్వి. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్(1798-1884).సి.పి. బ్రౌన్ పాఠ పరిష్కార విమర్శకు ఆద్యుడు. పదసూచికల నిర్మాణంలో-ప్రథముడు. నిఘంటువు నిర్మాణంలో మార్గనిర్దేశకుడు. గ్రంథ సంపాదక శబ్దాన్ని సార్థకం చేసిన మనిషి. సూక్ష్మేక్షికతో కవిహృదయాన్ని అర్థం చేసుకోగలిగిన సారమతి. పరిశ్రమశీలం, ఔచిత్యం, నిశితత్వం, క్రమశిక్షణలను తాను స్వయంగా కలిగి ఉంటూ భవిష్యత్ పరిశోధకులకు విమర్శకులకు ఇవన్నీ ఉండి తీరాలని చాటిచెప్పిన మహామనీషి. రచనా పార్శ్వం నుండి జూలూరి అప్పయ్యశాస్త్రి అద్వైతం పరబ్రహ్మశాస్త్రి ప్రభృతులు, సమన్వయ, పర్యవేక్షణపార్శ్వం నుండి అయోధ్యాపురం కృష్ణారెడ్డి బ్రౌన్‌కు రెండు భుజాలుగా రెండుకళ్లుగా నిలచి చరితార్థులయ్యారు.

1. వేమనను సాహిత్యసింహాసనాధిష్ఠితుడిని చేశాడు.

2. వివిధ పర్వాలను 50 తాళపత్రప్రతులతో; 12 సమగ్రతాళ పత్ర ప్రతులలో సరిపోల్చి కవిత్రయ భారతాన్ని సుపరిష్కృతం చేశాడు.

3. మనుచరిత్ర, ఆముక్తమాల్యద, శశాంక విజయం, పద్మపురాణం, హంసవిశంతి, శుకసప్తతి, పల్నాటి వీర చరిత్ర లాంటి కావ్యాలను పరిష్కరించాడు.

4. గీర్వాణాంధ్ర ఛందస్సులను వ్యాకరణాన్ని విశ్లేషించాడు. ఆంగ్ల - తెలుగు - ఆంగ్ల; నిఘంటువులను సంతరించాడు.

5. సుమతి, వేమనశతకాలను ధరణిదేవుల రామయ్యమంత్రి దశావతార చరిత్రలోని అహల్యావృత్తాంతాన్ని ఆంగ్లంలోకి అనువదించాడు. అచ్చులో తెలుగు అక్షరాలకు, అధ్యాయాల విభజనకు, పద్యసూచనకు, విరామచిహ్నాలకు స్థిర రూపం కలిగించాడు. గ్రంథముద్రణను సువ్యవస్థితం చేశాడు.

బ్రౌన్ సాహిత్య వ్యాసంగాన్ని అంతా లండన్‌నుండి 25 వేల పేజీలు 52 సంపుటాల్లో మైక్రో ఫిల్మ్ రూపంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో భద్రపరిచారట. బ్రౌన్ లేఖల సంపుటాలు మద్రాసు ప్రాచ్యలిఖిత భాండాగారంలో ఉన్నాయట. వాటినెంతమేరకు వినియోగించుకోగలిగామో! తెలుగు వారెన్నటికీ తీర్చలేనంత అప్పుపెట్టిన అక్షర కుబేరుడు, 225రూ॥ల నుండి 500 లోపు నెలవారీ జీతం పొందిన సామాన్యఉద్యోగి చార్లెసు ఫిలిప్‌బ్రౌన్. బ్రౌన్ సాహిత్యధార ప్రధానంగా అముద్రిత గ్రంథ ప్రకటనం, నిఘంటు నిర్మాణం, వ్యాఖ్యానం, సాహిత్యవిమర్శనం, ఛందో వ్యాకరణ పరిశ్రమరంగాలుగా కొనసాగించిందని భావించవచ్చు.

**గ్రంథ పరిష్కరణం, ప్రకటనం:** ప్రచురణకు నోచుకోని కావ్యాల కాగితం ప్రతులను, తాటాకు ప్రతులను సేకరించి, పాఠాంతరాలను పరిశీలించి, సాధు పాఠ నిర్ణయంచేసి గ్రంథ రూపకల్పన చేసి, విపులమైన పీఠిక రాసి, అందించడం ఒక దశలో ఉద్యమంగా కొనసాగింది. మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి నిడుదవోలు వెంకటరావులు ప్రథమ స్మరణీయులు.

***మానవల్లి రామకృష్ణకవి*** (1875-1957) వనపర్తి నుండి మలబారు దాక విస్తృతపర్యటనం చేసి ఎన్నెన్నో అమ్మ్యూలగ్రంథాలు వెలుగులోకి తెచ్చిన భాషాసేవకుడు. వారు చేసిన నిర్ణయాలు కొన్ని వాదోపవాదాలకు దారితీశాయి. క్రీడాభిరామాన్ని ప్రకటిస్తూ శ్రీనాథ కృతమన్నారు. నన్నెచోడుని కుమారసంభవాన్ని వెలుగులోకి తెచ్చి నన్నయకు పూర్వీకుడు నన్నెచోడుడు అన్నారు. నీతిశాస్త్రముక్తావళి, శ్రీరంగమహత్త్వం, త్రిపురాంతకోదాహరణం,

సకలనీతి సమ్మతం ఇవి మాత్రమే కాదు. దిఙ్నాగుని కుందమాల, భరతుని నాట్యశాస్త్రం, అభినవగుప్తుని అభినవ భారతీవ్యాఖ్యానం మొ॥ ఎన్నో ఉన్నాయి. ఎంతో మహత్తరమైన కృషి చేసిన ఈ విద్వాంసుడు భుక్తి కోసం చేయి చాపాల్సినంత పరమ దరిద్రంగా బతకాల్సి వచ్చింది.

Amongst these individuals there is one at this moment who stands out like a light house. This is Mr.Ramakrishna kavi M.A. of rajahmundry. His resources are not income of a state but of heart. *He is lord of poverty* a Teacher in a secondary school..[1]

"ఆనాడువారి కృషికి ప్రశంసలేదు. సరికదా అభిశంసన, పదవీచ్యుతులే తప్పలేదంటే నమ్మగలమా? కవిగారు వనపర్తి వదిలి వెళ్లిపోవడానికి, రాజమండ్రిలోని మారుమూల మాధ్యమిక మోడల్ స్కూలుకు ఉపాధ్యాయులుగా బదిలీకావడానికి అధికార దర్పం ఆగ్రహావేశాలకు గురికావడానికి బ్రతుకు తెరువుకై స్కూలు పుస్తకాలు నవలలు వ్రాసి చివరకు టాబ్యులేషన్ వర్కు చేసి కాలం గడపడానికి, ఫించను అంటూ లేని టంపెరరీ పోస్టులలో జీవిక గడుపుకోవడానికి చివరి దశలో తిరుపతిలో ఒక హోటల్ యజమాని దయాధర్మాలతో భుక్తి గడుపుకోవలసి రావడానికి వారి వాఙ్మయ సేవలక్ష్యమే కారణమైతే ఆ అపరాధమో, చిన్నతనమో వాస్తవానికి వారిదికాదు అది ఆంధ్ర లోకానిది. అంతటి బాధలోనూ, ఒత్తిడిలోనూ ఆయన కిమ్మనలేదు. స్థితప్రజ్ఞులై అన్నిటికీ అతీతంగా ఉండి కనీసం బదులు పలికే ప్రయత్నమైనా చేయలేదు. తన లక్ష్యమేదో సాధించుకునే దిశలోనే పయనం సాగిస్తూ వచ్చారు. అదంతా కారణజన్ముని ఒక జీవిత కాలపు పరిశ్రమ. జీవుని వేదన.[2]

'యోగంతో చిత్తాన్ని, పదశాస్త్రంతో భాషను, వైద్యశాస్త్రంతో దేహాన్ని పరిపూతం చేసిన పతంజలి వంటి మహనీయులు ***వేటూరి ప్రభాకరులు*** (1888-1950) భాషా- సాహిత్య, చరిత్ర, పురాతత్వ, శాసన, ఖగోళ,

1. మానవల్లి కవి రచనలు (1972) పుట : 89
2. వేటూరి ఆనందమూర్తి 'మానవల్లి రామకృష్ణకవి వాఙ్మయం' - తెలుగులో తొలితరం పరిశోధకులు (2005) పుట : 252.

వైద్యప్రయోగ శాస్త్రాలలో గంభీరమైన లోచూపుతో దైవికమయిన ఉపజ్ఞతతో కలంపట్టినదెల్లా కలకాలం నిలిచే కటికసత్యాలు రాసిన నిష్ఠాగరిష్ఠులు'[1] అన్న తిరుమలరామచంద్రగారి వాక్కులు సత్యసమ్మతాలు.

1. తాళ్లపాక అన్నమయ్యను, ఇతర తాళ్లపాక కవులను సుప్రతిష్ఠులను చేశారు.
2. మనుచరిత్ర, బసవపురాణం, క్రీడాభిరామం, సుగ్రీవ విజయం, ధనుర్విద్యా విలాసం లాంటి గ్రంథాలు పరిష్కరించి విపుల పీఠికలతో ప్రచురించారు.
3. ప్రబంధ రత్నావళి, చాటుపద్యమణిమంజరి లాంటి సంకలనాలు వెలువరించారు.
4. మద్రాసు ప్రాచ్యలిఖిత భాండాగారంలోని పుస్తకాలకు 20 సంపుటాల్లో వర్ణనాత్మక సూచికలు తయారు చేశారు. (ప్రభుత్వనియమాల ప్రకారం వాటి మీద లైబ్రరీ క్యూరేటర్ పేరు ఉంటుంది.)
5. ఆహధనకరశాసనం లాంటి ఎన్నో శాసనచర్చల్లో పాల్గొని అర్థనిర్ణయాలు చేశారు.
6. తంజావూరు ఆంధ్ర రాజుల చరిత్ర శృంగార శ్రీనాథము, అన్నమాచార్య జీవిత చరిత్ర లాంటి చరిత్రలు' రచించారు.

కవితలు, అనువాదాలు, వ్యాఖ్యానాలు, వ్యాసాలు ఎన్నో ఎన్నెన్నో సాహిత్యం, భాష, సమాజం అన్ని వర్గాలకు అనుభవయోగ్యం కావాలని, భాగస్వామ్యం ఉండాలని తపించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఉదార చరితులు. సాహిత్య పరిశోధన వ్యాసంగంలో వేటూరి వారిని కొంతవరకు ఇతరులతో పోల్చవచ్చునేమో! కాని ఏ తెలుగు పరిశోధకునికి లేని మరొక అర్హత వారి ఆధ్యాత్మిక తపస్సంపన్నత.

***నిడుదవోలు వెంకటరావు*** (1903-1982) పరిశోధన పరమేశ్వరులు. ప్రాచీన సాహిత్యంలో ఏపదం, ఏ కావ్యంలో ప్రయోగింపబడిందో అలవోకగా

1. పోచిరాజు శేషగిరిరావు, వేటూరివారి సారస్వత పరివస్య (1986), పుట: 388

చెప్పగలిగిన అసాధారణ జ్ఞాపకశక్తి వారి సొంతం. జంగమవిజ్ఞానసర్వస్వం. సమకాలీనులు చమత్కారంగా వారిని పదప్రయోగ మూషిక మార్జాలం అన్నారు. కర్ణాటకాంధ్రముల పరస్పర ప్రభావం, ఆంధ్రవచనవాఙ్మయం, ఉదాహరణ వాఙ్మయ చరిత్ర, దక్షిణాంధ్ర వాఙ్మయ చరిత్ర, మొదలైన పరిశోధన గ్రంథాలు, శబ్దరత్నాకరానికి చేర్చిన 122 పుటల పదివేల శబ్దాల అనుబంధం; చిన్నయసూరి, పోతన, జీవితచరిత్రలు; ఖడ్గలక్షణ శిరోమణి, కట్టావరద రాజు రామాయణం, రాజగోపాల విలాసం, బసవపురాణం, కుమార సంభవం, ఉత్తర హరివంశం, భాస్కర రామాయణం లాంటి పరిష్కృత గ్రంథాలు; భారతి పత్రికలో రాసిన అసంఖ్యాక వ్యాసాలు, వావిళ్లవారి కావ్యాలెన్నింటికో రాసిన పీఠికలు వారి సారస్వత సేవకు నిదర్శనాలు. 120 మెకంజీ కైఫీయత్తులను ఆంగ్లంలోకి అనువదించారు.

చిలుకూరి నారాయణరావు పండితారాధ్యుల చరిత్రకు రాసిన 348 పుటల పీఠిక, వెలుదండ ప్రభాకరరామాత్యుల ఆముక్తమాల్యదా పర్యాలోకనానికి ; చలమచర్ల రంగాచార్యుల ఆంధ్ర ప్రతాప రుద్ర యశోభూషణానికి, బూర్గుల రామకృష్ణారావు పండిత రాజ పంచామృతానికి ఈయుణ్ణి వీరరాఘవాచార్యులు రాసిన పీఠికలు ప్రత్యేక గ్రంథాల లాంటివే. ఇటీవల తిరుపతి శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థకు చెందిన మిత్రుడు ఆచార్య చిట్రాజు గోవిందరాజు 'గ్రంథ పరిష్కరణ విధానాలు' (2008) పేరుతో గొప్పసదస్సు నిర్వహించి విలువైన పుస్తకాన్ని ప్రచురించారు.

ఒకనాటి సాహిత్య అకాడమీ కావ్యాలకు, భారతంలోని పద్దెనిమిది పర్వాలకు, వావిళ్ల సంస్థల ముద్రణలకు ఎందరో విద్వాంసులు రాసిన విపులమైన వైదుష్య భరితమైన పీఠికలను, నిర్దుష్టపాఠ నిర్ణయ ధీమత్వాన్ని స్మరించుకొంటూ అంజలి ఘటిస్తూ ముందు కెళ్దాం.

***నిఘంటు నిర్మాణం:*** సి.పి.బ్రౌన్‌కు ముందే కొన్ని నిఘంటువులు వచ్చినా బ్రౌన్ నిఘంటువులే జనాదరణకు నోచుకున్నాయి. ఆ తర్వాత బాగా అందరికీ నేటికీ వినియోగపడుతున్నది బహుజనపల్లి సీతారామచార్యుల వారి

శబ్దరత్నాకరము. అవసరం పడ్డప్పుడు ఉపయోగపడుతున్నది సూర్యారాయాంధ్ర నిఘంటువు. చదివి కంఠస్థం చేయాల్సిన అమరం లాంటి శ్లోకాల నిఘంటువునుండి చూసుకొనే అకారాదిక్రమనిఘంటువుల వైపు దృష్టి మళ్లించినవాడు బ్రౌన్. సాహిత్యం భాష, అధ్యయన, అధ్యాపనాలకు, పదాల అర్థ రూపపరిణామాలకు, అనువాదాలకు, వ్యుత్పత్తి అర్థాలకు, సమానార్థాలకు, నానార్థాలకు, మరెన్నింటికో నిఘంటువులు అవసరం. మన నిఘంటువులన్నీ కావ్యభాషకే పరిమితం అయ్యాయి. జానపద భాషను, దిగువ కులాల భాషను నిఘంటు నిర్మాతలు పట్టించుకోలేదని అలవోకగా వేదికలమీద మాట్లాడటం అంత సులువు కాదు నిఘంటునిర్మాణం. నిఘంటువు నిర్మించడమంటే ఒక నిశ్శబ్ద విప్లవాన్ని సాగించడమే. ఏమాత్రం పక్కచూపులు చూసినా ఎక్కడ దృష్టిలో నుండి పోతుందో అన్నంత తలవంచుకొని పుస్తకాలనుండి, జన వ్యవహారం లోంచి పదప్రయోగాలు సేకరించుకోవలసి వస్తుంది. ప్రకృతికి, గ్రామీణ సమాజానికి సన్నిహితంగా మసలిన పూర్వీకులే భక్ష్యవిశేషం, వృక్షవిశేషం, క్రీడా విశేషం అంటూ తెలియని పదాలను సూచించి వదిలేసిన వారి చిత్తశుద్ధికి జేజేలు పలకాలి. సమాజానికి దూరంగా పట్టణీకరణం, ఆంగ్లీకరణం చెందిన మనం ఆ పదాలకు అర్థనిర్ణయం ఎంత మేరకు చేయగలమో ఆలోచించాలి.

వావిళ్ల సంస్థానం వారే ఏడు నిఘంటువులను నిర్మించారు. వావిళ్ల నిఘంటువు ఎనభై వేల పదాలతో కూడింది. చలమచర్ల రంగాచార్యుల వారి నిఘంటువు 65వేలపదాలతో కూడింది. సూర్యారాయాంధ్రనిఘంటువు పండితవర్యుల సహకారం, పిఠాపురం మహారాజ ఆర్థిక సహకారం, ఆనాటి సాహిత్య అకాడమీ (నేటి తెలుగువిశ్వవిద్యాలయం) ముద్రణ సహకారం తోడై అందుబాటులోకి వచ్చింది. కొట్రశ్యామలకామశాస్త్రి ఆంధ్రవాచస్పత్యం మూడు సంపుటాల్లో 50 వేల సంస్కృతపదాలు 30 వేల తెలుగుపదాలు 20వేల పారిభాషిక పదాలతో వెలువడింది. దాని ప్రచురణకు వారు తమ భూమిని కూడా అమ్మారట. అది వారి నిష్ఠ. అబ్బరాజు సూర్యనారాయణ

మూర్తి గారి ఆంధ్రమహాభారత నిఘంటువును ఆం.ప్ర. సాహిత్య అకాడమీ రెండు సంపుటాల్లో ప్రచురించింది. అబ్బరాజు సూర్యనారాయణ వేటపాలెం బండ్లబాపయ్య హైస్కూలులో తెలుగుపండితులు. వారి ఆర్థిక స్థితి ఉన్నతమైనదేమీ కాదు. భార్యావియోగం, ఈతిబాధలు, ఆరోగ్యసమస్యలు, కౌటుంబిక, మానసిక సమస్యలు ఎన్నో ఎదుర్కొంటూ మహాభారత నిఘంటువు నిర్మించారు. వృత్తిపదకోశాలు. తెలుగు అకాడెమీ వారి వివిధ శాస్త్ర సంబంధ పదకోశాలు ఆచార్య టి.బరో ఎం.బి ఎమినో గార్ల ద్రావిడ వ్యుత్పత్తి కోశాలు ఆంధ్రవిశ్వవిద్యాలయంవారి తెలుగు వ్యుత్పత్తి కోశాలు, ఇంకా పదబంధ పారిజాతాలు, సామెతల కోశాలు, పత్రికాసంబంధ కోశాలు, ఇంకా ద్విభాష, త్రిభాష, బహుభాషానిఘంటువులు, సంగీత వేదాంత లలిత కళల పాలనా రంగ నిఘంటువులన్నీ సి.పి.బ్రౌన్ గారి నిఘంటువు నిర్మాణ వారసత్వాన్ని ముందుకు తీసుకొని పోయేవే.[1]

*వ్యాఖ్యానం:* బ్రౌన్ తన పండిత మండలి చేత కావ్యాలకు వ్యాఖ్యానాలను రాయించారు. వ్యాఖ్యాన రంగంలో శిఖరప్రాయంగా నిలచినవారు వేదం వేంకటరాయశాస్త్రి. ఆముక్త మల్యాదాసంజీవని, శృంగారనైషధ సర్వంకషలు వారి శాశ్వత కీర్తిపతాకలు. సమగ్ర వివరణ, సాధుపాఠ నిర్ధారణ, వ్యాఖ్యానావిష్కరణ, సముచితార్థ వివరణ, ప్రామాణిక ప్రయోగాల ఉదాహరణ ఇత్యాద్యనేక అంశాలో వేదంవారు వరవడి దిద్దారు. ఆముక్తమాల్యదకు వావిళ్లవారి 'రుచి' కరమైన వ్యాఖ్యానం, వావిలి కొలనుసుబ్బారావు రామాయణ మంధరం, నాగపూడి కుప్పుస్వామయ్య పారిజాతాపహరణ వ్యాఖ్యానం, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి మనుచరిత్ర వ్యాఖ్యానం, తాపిధర్మారావు విజయవిలాసహృదయోల్లాసవ్యాఖ్య, ఎక్కిరాల కృష్ణ మాచార్యుల వారి భాగవత రహస్య ప్రకాశ వ్యాఖ్య, తంజనగరం తేవప్పెరుమాళ్లయ్య, శొంఠి భద్రాద్రి రామశాస్త్రుల వసుచరిత్ర వ్యాఖ్యానం మొదలుకొని ఇటీవలి తిరుమల తిరుపతి దేవస్థానం మహాభారత వ్యాఖ్యానం బృహత్ సంపుటాల దాక ఈ విశిష్ట వాఙ్మయ పరంపర వ్యాఖ్యాతల అపూర్వ పాండిత్య ప్రభావాలకు నికషోపలాలు.

1. డా. వై. రెడ్డిశ్యామల, ప్రసిద్ధ తెలుగు నిఘంటువులు-లక్షిత ప్రయోజనాలు (2007)

*ఛందోవ్యాకరణాలు :* ఛందోవ్యాకరణాలను సాంప్రదాయిక దృష్టితో, భాషాశాస్త్ర దృష్టితో పరిశీలించిన పండితులున్నారు. టేకుమళ్ల రాజగోపాలరావు, చిలుకూరి నారాయణరావు, గిడుగు సీతాపతి, రావూరి దొరస్వామి శర్మ, నిడుదవోలు వెంకటరావు, కోవెల సంపత్కుమార మొ॥గు వారు విశ్వవిద్యాలయాల వెలుపల ఛందస్సుమీద దృష్టి కేంద్రీకరించారు. ఎవరికీ దక్కనంత పేరు ప్రఖ్యాతులు చిన్నయసూరికి లభించాయి. ఎవరైనా తమ తర్వాతి వారిని ప్రభావితం చేయడం సహజం. కాని, చిన్నయసూరి బాలవ్యాకరణానికి విరుద్ధమని పండితులు ప్రాచీన కావ్యాలను దిద్దారంటే ఆయన ప్రభావం ఎంత గాఢంగా ప్రసరించిందో విశదమౌతుంది. బహుజనపల్లి సీతారామాచార్యులు, వజ్ఝల చిన సీతారామశాస్త్రులు, దువ్వూరి వెంకటరమణశాస్త్రి, వడ్లమూడి గోపాలకృష్ణయ్య, వంతరాం రామకృష్ణారావు లాంటివారు వ్యాకరణ రంగంలో జీవించారు.

*విమర్శరంగం:* కట్టమంచి రామలింగారెడ్డి (1880-1951) 'కవిత్వతత్త్వ విచారం తో విమర్శపథాల్లో గొప్పదృక్పథం కలిగించి నవ్యసాహిత్యానికి కొత్తబోదెలు తవ్వారు'. అని విశ్వనాథవారు; 'విమర్శమార్గమును బాహిరజగత్తు నుండి అంతర జగత్తుకు కొనిపోయిన ప్రథమాంధ్రవిమర్శన గ్రంథం కవిత్వతత్త్వ విచారం' అని పింగళి లక్ష్మీకాంతంగారు అన్నాక మనం మరోమాట మాట్లాడాల్సిన పనిలేదు.

కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కర్త-నవలాకారుడు మాత్రమే కాదు ప్రథమాంధ్ర విమర్శకుడు, ప్రామాణిక సాహిత్య చరిత్ర నిర్మాత, కావ్య పరిష్కర్త కూడా. వారి విగ్రహతంత్ర విమర్శనం మొదటి విమర్శన గ్రంథంగా పరిశోధకులు నిర్ణయించారు. కందుకూరి వారు దాదాపు 120 రచనల వరకు చేశారు. సంఘసంస్కరణ, సాహిత్యసంస్కరణ రెండూ వారి ప్రధాన రంగాలే. మొల్ల రామాయణం, పింగళసూరన ప్రభావతీప్రద్యుమ్నం, కాకుమాని మూర్తికవి పాంచాలీ పరిణయం, కేతన విజ్ఞానేశ్వరీయం, చరిగొండ ధర్మన్న, చిత్ర భారతం, నాచన సోముని ఉత్తరహరివంశం, నందిమల్లయ్య ఘంటసింగనల ప్రబోధ చంద్రోదయం లాంటి 19 గ్రంథాలు పరిష్కరించి ప్రచురించారు. గురజాడ శ్రీరామ మూర్తి కవిజీవితములు ఉన్నా

పరిశోధనాత్మకమైన, ప్రణాళిక బద్ధమైన కవుల చరిత్రకు పంతులుగారే ఆద్యులు. కైఫీయత్తులు, దేశచరిత్ర గ్రంథాలు పరిశీలించి 232 కవుల జీవిత వివరాలను పొందుపరిచారు. పింగళి లక్ష్మీకాంత మహోదయులు పాఠం చెప్పిన నోట్సు 'ఆంధ్రసాహిత్య చరిత్ర'గా రూపాంతరం ఎత్తి ఎంతోమంది విద్యార్థులను ప్రభావితం చేయడంతోపాటు, అధ్యాపకులను తయారుచేసింది. కె.వి. నారాయణరావు, కురుగంటి సీతారామయ్య, చాగంటి శేషయ్య, ఆరుద్ర, కొర్లపాటి శ్రీరామమూర్తి ప్రభృతులు ఆ రంగాన్ని పరిపుష్టం చేశారు.

ఉస్మానియా తెలుగుశాఖరూపశిల్పి, ఋషికల్పులు **ఖండవల్లి లక్ష్మీరంజనం** (1908-1986) రచించిన ఆంధ్రుల చరిత్ర సంస్కృతి విశ్వవిద్యాలయ విద్యార్థులు చరిత్రరంగంలో చదివిన ప్రథమ పాఠ్యగ్రంథం. తెలంగాణా కవితావికాసాన్ని అధ్యయంగా చేర్చిన మొదటి సాహిత్య చరిత్ర వారిది. మహాభారత సంశోధిత ముద్రణం వారి నేతృత్వంలో వెలువడింది. 8 సంపుటాల్లో సంగ్రహాంధ్ర విజ్ఞానకోశం వారి కన్నుసన్నలలో రూపుదిద్దుకొంది. వారి లక్ష్మీరంజన వ్యాసావళి ఆలోచనాత్మకమైంది. ఆంగ్లంలోనూ, తెలుగులోనూ రాసిన పీఠికలు అమూల్యమైనవి. సాహిత్య చరిత్రకు అనుగుణంగా యుగాలవారిగా పరిశోధన చేయించిన దార్శనికులు వారు. తాను నిత్య పరిశోధకులుగా వెలుగుతూ మరెన్నో దివ్వెలను వెలిగించిన ఉదాత్త చరితులు.

ఆధునిక భావజాలం బాగా వ్యాపించాక మౌఖిక సారసత్వానికి ఆదరణ లభించింది. నిజమైన జాతి సంస్కృతి జానపద గేయాల్లోనే నిలిచి ఉంటుందన్న భావం పెరిగింది. బ్రౌన్ కుమారరాముడి కథ పల్నాటి వీరచరిత్ర, బొబ్బిలి కథలు మొదలైనవి సేకరించాడు. చింతాదీక్షితులు, నందిరాజు చలపతిరావు గేయసేకరణ మీద మక్కువ చూపారు. నేదునూరి గంగాధరం, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి (కృష్ణశ్రీ) ఉద్యమప్రాయంగా జీవితాలనే అంకితం చేసి జానపద గేయాల సేకరణ జరిపారు. బి. రామరాజు గారు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జానపదపరిశోధనలకు ద్వారాలు తెరిచారు.

గురజాడ అప్పారావు, అక్కిరాజు ఉమాకాంత, విశ్వనాథ సత్యనారాయణ, పింగళి లక్ష్మీకాంతం, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, భండారు

తమ్మయ్య, నండూరి బంగారయ్య, పురాణం సూరి శాస్త్రి లాంటి ఎందరెందరో మహానుభావులు తెలుగు విమర్శక పరిశోధక జగతిని పరిపుష్ఠం చేశారు. భాష వేరు, సాహిత్యం వేరు, సమాజం వేరు, కొన్ని రంగాలు మావి కావు అని వారు అనుకోలేదు. విచిత్రమేమంటే వీరందరూ ఏ ఒక్క రంగానికో పరిమితమైన వారు కారు. సమకాలీన స్వాతంత్ర్యోద్యమానికి ప్రేరితులైనవారు, సృజనాత్మక ప్రక్రియల్లో సాధన చేసినవారు, సమాజ సంస్కరణల్లో పాలొన్నవారు. భిన్నభాషలు, భిన్న రంగాలు, భిన్నప్రక్రియలు సొంతం చేసుకుని నిరాడంబరంగా సమాజోన్నతే లక్ష్యంగా నిత్యసాహిత్య వ్యసనం గలిగి తర్వాతి తరాలకు స్ఫూర్తి దాతలై నిలిచారు.

విశ్వవిద్యాలయాల లోపల, వెలుపల పనిచేస్తు సిద్ధాంత గ్రంథరచనతో మాత్రమే ఆగిపోనివారు, సిద్ధాంత గ్రంథం తప్ప దాన్ని మించిన కృషిచేసినవారు ఎందరో ఉన్నారు. మౌలికమైన తపనతో నిరంతరం సాహిత్య గమనాన్ని పరిశీలిస్తూ, విశ్లేషిస్తూ, వ్యాఖ్యానిస్తూ వచ్చిన/ వస్తున్న వారు ఎందరో ఉన్నారు. స్థలాభావం దృష్ట్యా వారిని నామ మాత్రంగా ప్రస్తావిస్తూ ముగిస్తాను.

కడియాల రామ్మోహనరాయ్, ముదిగంటి సుజాతారెడ్డి (సాహిత్య చరిత్ర), పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, మొదలి నాగభూషణ శర్మ, ఆర్.ఎస్. సుదర్శనం, కోడూరి శ్రీరామమూర్తి, సి. మృణాళిని, వాడ్రేవు వీరలక్ష్మీదేవి, (నవలారంగం), ఆర్.వి.ఆర్, మద్దుకూరి చంద్రశేఖరరావు, పాములపర్తి సదాశివరావు (మార్క్సిస్టు కోణం), రాంభట్ల కృష్ణమూర్తి, కె.వి. రమణారెడ్డి, కొడవటిగంటి కుటుంబరావు, త్రిపురనేని మధుసూధనరావు, ఎస్వీ. సత్యనారాయణ (అభ్యుదయ విప్లవరంగం), మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, శిష్టా రామకృష్ణశాస్త్రి, ఎన్. తారక రామారావు (నాటకరంగం), కె.కె. రంగనాథాచార్యులు (చారిత్రక పరిణామం), కుందుర్తి ఆంజనేయులు (వచన కవిత్వం), టి. సంజీవదేవ్ (కళా సౌందర్య వివేచన); ముదిగొండ వీరభద్రయ్య (కళాతాత్వికత, ప్రతీకాత్మకత), కొలకలూరి ఇనాక్, బన్నా ఐలయ్య, దార్ల వెంకటేశ్వరరావు, కె. మధుజ్యోతి, పి. కనకయ్య (దళిత రంగం), జయధీర్ తిరుమలరావు (మౌఖిక సాహిత్యం, అణగారిన వర్గాల కళా సాంస్కృతిక వర్గం), బి.ఎస్. రాములు (బహుజన కోణం), కె.పి. అశోక్ కుమార్ (విమర్శ - సమీక్ష), రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ([illegible]ఎక), కె. కాత్యాయనీ [illegible]

(స్త్రీవాదం), కె. జితేంద్రబాబు (వాఙ్మయ పరిశోధన), బి. తిరుపతిరావు, అఫ్సర్, ఆర్. సీతారాం (పోస్ట్ మాడర్నిజం), వెలగా వెంకటప్పయ్య (గ్రంథాలయ శాస్త్రం, రిఫెరెన్స్ గ్రంథాలు), సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, ఆర్. జైకిషన్, సంగనభట్ల నర్సయ్య, కాసుల ప్రతాపరెడ్డి, జి. బాలశ్రీనివాస మూర్తి (తెలంగాణ పరిశోధన), వల్లంపాటి వెంకటసుబ్బయ్య, (శిల్ప విమర్శ), గడియారం రామకృష్ణ శర్మ, కపిలవాయి లింగమూర్తి (స్థానిక చరిత్ర), నాగసూరి వేణుగోపాల్ (ప్రసార మాధ్యమాలు) మొదలైనవారు ఎందరో మదిలో మెదులుతున్నారు. పుట్టపర్తి నారాయణాచార్యులు (విజయనగర సామ్రాజ్యం), గుంటూరు శేషేంద్రశర్మ, (స్వర్ణహంస, కవిసేన మేనిఫేస్టో), జి.వి. సుబ్రహ్మణ్యం (వీరరసం, సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, ఆంగ్ల విమర్శ ప్రభావం), మధునా పంతుల సత్యనారాయణశాస్త్రి (ఆంధ్ర రచయితలు), సర్దేశాయి తిరుమలరావు (విమర్శ – పరామర్శ, శివభారత దర్శనం, కన్యాశుల్కం నాటక కళ), నండూరి రామోహనరావు (నరావతారం, విశ్వదర్శనం) లాంటివారు చరిత్రలో నిలిచిపోయారు. ఎం.వి.ఆర్. శాస్త్రి (ఏది చరిత్ర, ఆంధ్రుల చరిత్ర, అల్లూరి సీతారామరాజు), యు.ఏ. నరసింహమూర్తి (కన్యాశుల్కం, ఆధునిక భారతీయ నాటకాలు, విశ్వనాథ సౌందర్య దర్శనం), శిష్టా శ్రీనివాస్ (కపిద్వాకార భూగోళ, రాజమహేంద్రి క్షేత్ర పటాలు), ఉన్నం జ్యోతివాస్ (దీపాల పిచ్చయశాస్త్రి భారతీవరవస్య), ఇంకా సూర్యదేవర రవికుమార్, లక్ష్మణచక్రవర్తి, గుడిపాటి, జి.వి.పూర్ణచంద్, సా.వెం. రమేష్, పెన్నా శివరామకృష్ణ, వి. సిమ్మన్న, ద్వా.నా.శాస్త్రి, రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు మొదలైనవారు నిత్య సాహిత్య వ్యాసంగం కొనసాగిస్తున్నారు.

కె.వి.ఆర్. నరసింహం, తుమ్మపూడి కోటేశ్వరావు, కోవెల సుప్రసన్నాచార్య, వడలి వందేశ్వరరావు, బి. రామరాజు, కోవెల సంపత్కుమారాచార్య, కె.వి. రామకోటిశాస్త్రి, పుల్లెల శ్రీరామచంద్రుడు, అద్దేపల్లి రామ్మోహనరావు, ఎస్వీ. రామారావు, రవ్వా శ్రీహరి లాంటి విద్వాంసులను ఇంకా నాకు స్ఫురించని వారి[illegible]ాడా స్మరిస్తూ తెలుగుశాఖల వైపు వెళ్దాం.

# 3

# తెలుగు శాఖల్లో పరిశోధన

ఈనాడు 'పరిశోధన' అంటే విశ్వవిద్యాలయాల్లో ఎం.ఫిల్., పి.హెచ్.డి., డిగ్రీల కోసం సమర్పించిన సిద్ధాంతగ్రంథాలని రూఢి ఏర్పడింది. రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాల తెలుగుశాఖలు స్నాతకోత్తరస్థాయి పాఠ్యబోధనతో పాటు పరిశోధన కార్యక్రమాలు కూడా చురుగ్గా నిర్వహిస్తున్నాయి. ఉస్మానియా, ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాలు తొలి తరానివి కాగా, వాటికి పుత్రికలుగా పుట్టి స్వతంత్ర ప్రతిపత్తి పొందినవి కాకతీయ, నాగార్జున, శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయాలు. పాలకుల అవసరాల వల్ల, అభిరుచుల వల్ల ఏర్పడినవి హైదరాబాదు (కేంద్రీయ)విశ్వవిద్యాలయం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ద్రావిడ విశ్వవిద్యాలయం - వీటన్నింటిలోను ఎం.ఫిల్., పిహెచ్.డి.లు బహుళ సంఖ్యలో వస్తున్నాయి. ఇక రాష్ట్రం వెలుపలి మద్రాసు విశ్వవిద్యాలయం దేశం మొత్తంలోనే మొదటిసారిగా ఏర్పడిన మూడు విశ్వవిద్యాలయాల్లో ఒకటి. ఇందలి తెలుగుశాఖలో పిహెచ్.డి. అయినా ఎం.లిట్ వ్యాసమయినా ఆంగ్లంలోనే రాయాలన్న నిబంధన తొలినాళ్ళలో ఉండేది. కాలక్రమంలో అది మారిపోయింది. మద్రాసు విశ్వవిద్యాలయంలోను, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలోను విడివిడిగా పరిశోధనలు జరుగుతున్నాయి. మధురైలో రెగ్యులర్‌గాను; దూరవిద్యాపథకం ద్వారాను పరిశోధనలు జరుగుతున్నాయి. అట్లే బెంగుళూరు, మైసూరు, బెనారస్, అలీగడ్, ఢిల్లీ విశ్వవిద్యాలయాల్లో ఈ

రోజు విద్యార్థులసంఖ్య, అధ్యాపకుల సంఖ్య క్షీణించినా పరిశోధనలకు సముచిత ప్రోత్సాహమందుతుంది. అమెరికాలోని విస్కాన్సిన్, మిచిగాన్, టెక్సాస్, డ్యూక్, పెన్సిల్వేనియాలో ఎక్కువగా భాషాశాస్త్ర సంబంధమైన డాక్టరేట్లు వచ్చాయి.

ఇటీవలె తామరతంపరగా వచ్చిన సరికొత్త విశ్వవిద్యాలయాలు కూడా అతిత్వరలో పరిశోధన కార్యక్రమాలు చేపట్టవచ్చు.

1929లో చిలుకూరి నారాయణరావు మద్రాసు విశ్వవిద్యాలయం నుండి తెలుగుకు సంబంధించి మొదటిసారిగా డాక్టరేటు గ్రహించారు. ఆ తర్వాత పదిహేనేళ్లకు 1945లో కె.వి.ఆర్. నరసింహంగారు 'ప్రబంధ వాఙ్మయం' మీద పరిశోధించి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేటు పొందారు. ఆ రోజుల్లో నరసింహం మాష్టారు డాక్టరేట్ పొందారని ఎంతో గొప్పగా, అబ్బురంగా చెప్పుకొనేవారట. 1956లో కొత్తపల్లి వీరభద్రరావు, తంగిరాల నారాయణశాస్త్రి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి; బి. రామరాజు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టర్లయ్యారు.

1957లో దివాకర్ల వేంకటావధాని ఉస్మానియా నుండి; ఎస్.వి. జోగారావు ఆంధ్ర నుండి; 1958లో జి.వి. కృష్ణారావు మద్రాసు నుండి; 1960లో పల్లాదుర్గయ్య గారు, కేతవరపు రామకోటిశాస్త్రిగారు ఉస్మానియా నుండి పిహెచ్.డి. లు పొందారు. తెలుగు పరిశోధన మొదలైన 1930 నుంచి 1960 దాకా మూడుదశాబ్దాల్లో మద్రాసు తెలుగుశాఖ నుండి ఇరువురు, ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ నుండి నలుగురు, ఉస్మానియా తెలుగుశాఖ నుండి నలుగురు మొత్తం పదిమంది డాక్టరేట్లు పొందారన్న మాట. భద్రిరాజు కృష్ణమూర్తి అమెరికాలోని పెన్సిల్వేనియా నుండి 1957లో తెలుగుక్రియల మీద, ఇలపావులూరి పాండురంగారావు హిందీ తెలుగు నాటకాలమీద ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ శాఖ నుండి 1960లో డాక్టరేట్లు పొందారు. సంఖ్యాపరంగా ఈ మూడు దశాబ్దాల్లో తెలుగు పరిశోధన ప్రగతి ఇది.

'పరిశోధన' విశ్వవిద్యాలయాల్లో పదోన్నతిలో భాగంగా, విధ్యుక్తధర్మంగా మారిందీ, స్థిరమైందీ 1961 నుండి అని లెక్కవేసుకుంటే ఈ

ఐదు దశాబ్దాల కాలంలో ఎం.ఫిల్., పి.హెచ్.డి. లు 5000 దాకా వచ్చాయి. 1956 నుండి 1971ల మధ్య కాలంలో ఎన్ని వచ్చాయో 1972-86 మధ్య అంతకు రెట్టింపు సిద్ధాంతగ్రంథాలు వచ్చాయి. 1987 వరకు మొత్తం 1156 పరిశోధనలు లెక్కతేలాయి. ఈ రెండు దశాబ్దాలకాలంలో ఒకటిన్నరరెట్లు పెరిగినట్లు తెలుస్తుంది. ఇది బలుపు కావచ్చు. వాపు కావచ్చు. ఈ ప్రస్థానంలో ఎన్నెన్నో మలుపులు, మెరుపులు, ఉత్థాన పతనాలు, ఆశలు నిరాశలు అన్నీ కలగాపులగంగా కనిపిస్తాయి. అత్యద్భుతమైన పరిశోధన గ్రంథాలు వచ్చాయి. పేలవమైనవీ వచ్చాయి. ఒక ప్రక్రియ ఆవిర్భావ వికాసాలకు అద్దంపట్టిన రచనలు, ఒక యుగకర్తలాంటి కవి దార్శనికదృష్టినీ ప్రతిభా మహత్త్వాలనూ విశ్లేషించి చూపిన గ్రంథాలు వచ్చాయి. ఒక సిద్ధాంత ప్రతిపాదన గమ్యంగా సాగిన రచనలు వచ్చాయి. భాషాపరిణామ విశేషాలను బేరీజు వేసిన రచనలు వెలువడ్డాయి. హాస్టల్‌లో తిండి తినడం కోసం రాసినవీ ఉన్నాయి. ఏదో నెత్తిమీదనున్న బరువు దించుకొందామనే రచనలు ఉన్నాయి. ఏ మాత్రం అవసరంలేని అంశాలమీద పిహెచ్.డి.లు వచ్చాయి. నిందలు, ప్రశంసలు, సత్కారాలు, ఛీత్కారాలు తెలుగు పరిశోధన చరిత్రను మిశ్రమంగా వరించాయి. మంచి ఫలితాలతో మనం పేచీ పడవలసిన అవసరం లేదు. మంచి వాటిని మనసారా ప్రశంసించడానికి మనవారికి నోరు కూడా రాకపోవచ్చు (రాదు కూడా). నాసిరకం పరిశోధనల మీద కత్తి దూయడానికి సర్వులు అత్యుత్సాహంగా ముందుంటారు. ఈ పరిశోధనల్లో చోటు చేసుకొన్న బలహీనతల మూలంగా 'పరిశోధన' వల్ల కలిగిన వికాసం, వచ్చిన వెలుగు సైతం మరుగున పడిపోయే స్థితి ఏర్పడింది.

పరిశోధన వల్ల జరిగిన **మంచి** పరిణామాలను, **మంచి** ఫలితాలను ముందు గమనిద్దాం. సాధారణంగా అవసరం పడితే తప్ప చదవడానికి పూనుకోని భాషాశాస్త్ర వ్యాకరణఛందో2లంకారాది శాస్త్రాల పరిశీలన, అన్వయం పరిశోధన వల్లనే సాధ్యమైంది. ప్రబంధ భాషమీద రావిభారతి, శ్రీనాథుని భాషమీద నేతి అనంతరామశాస్త్రి పి.యల్. శ్రీనివాసరెడ్డిగారలు, శాసనభాషకు, వివిధ కావ్యాలకు పరిశోధకులు రాసిన వర్ణనాత్మక

వ్యాకరణాలు, అమరేశం రాజేశ్వరశర్మ బొడ్డుపల్లి పురుషోత్తంగార్ల వ్యాకరణ పరిశోధనలు, కె. సర్వోత్తమరావు, సంగనభట్ల నరసయ్య, ఎస్.ఎస్. రాజుగార్ల ఛందఃపరిశోధనలు,– అట్లే ఎంతో శ్రమతో విషయసేకరణ చేసి రూపొందించిన తంగిరాల వారి 'వీరగాథలు', కసిరెడ్డిగారి పొడుపుకథల సిద్ధాంత గ్రంథం మొదలైన వన్నీ పరిశోధన అంటూ డిగ్రీ ఒకటి చేయవలసి రావడం వల్ల వచ్చినవే తప్ప ఆ రచయితలు స్వతంత్రంగా వాటిని అలా శ్రమకోర్చి రాస్తారని భావించలేం. ఈనాటికీ ఆ రంగాలలో ఆ పుస్తకాలు ప్రామాణికంగా పాఠకులకు ఉపయోగపడుతున్నాయి.

యుగద్రష్టలైన కవుల ప్రతిభామహత్త్వాలను అనితరసాధ్యంగా విశ్లేషించి చూపిన గ్రంథాలు విశ్వవిద్యాలయాల్లోనే వచ్చాయి. కేతవరపు రామకోటిశాస్త్రిగారి తిక్కన కావ్యశిల్పం, జి.వి. సుబ్రహ్మణ్యంగారి మార్కండేయ పురాణం, తుమ్మపూడి కోటేశ్వరరావు ఆముక్తమాల్యదాసౌందర్యం, ధూళిపాళ శ్రీరామమూర్తి పోతన భాగవతానుశీలనం, వి.వి.యల్. నరసింహారావు నన్నయ అక్షరరమ్యత లాంటివి ఒజ్జబంతులై నిలిచాయి. పరిశోధన అనే ప్రేరణే లేకపోతే వీరెవ్వరు ఈ అంశాల మీద ఇంత విస్తృతస్థాయిలో గ్రంథాలు వ్రాసేవారు కారేమో! ఏ కవిత్వమో, వర్తమాన కవుల మీదనో రాసుకునేవారేమో.

'ఆధునికాంధ్ర కవిత్వ మహాంభోరాశిని మథించి తీసిన సారస్వత నవామృతము' సి. నారాయణరెడ్డిగారి సిద్ధాంతగ్రంథం. ఈ పుస్తకాన్ని వారు రాయక పోయినా జ్ఞానపీఠం వచ్చేది కాని యూనివర్శిటీలో డాక్టర్, తర్వాత ప్రొఫెసర్, ఆ తర్వాత వైస్‌ఛాన్సలర్ కాలేకపోయేవారు. "పట్టముతో పాటు పదికాలముల పాటు నిలుచు గ్రంథము రచించుటకు వీలు" కల్పించినది ఉస్మానియా విశ్వవిద్యాలయాధి కారులే. నేటికీ ఆధునికాంధ్ర కవిత్వాన్ని అధ్యయనం చేయడానికి ప్రథమ స్మరణీయమైంది వారి గ్రంథమే. పదోన్నతికే అయినా పౌరుషంతో రాయబడిన గ్రంథమది. డాక్టరేట్ అన్న మెట్టు ఎక్కాల్సిన అవసరమే లేకపోతే నారాయణరెడ్డిగారు మరో రెండు కవితా సంకలనాలు వేసుకునేవారు. కాని సిద్ధాంతగ్రంథ రచనం జోలికి వెళ్ళకపోయేవారు. ఐదు ముద్రణలు వేసినా తర్వాతి వివరాలు చేర్చకపోవడానికి కారణం మౌలికంగా

కవిత్వం, వక్తృత్వం తన రంగాలు తప్ప పరిశోధన, విమర్శలు కావనుకోవడమే నేమో! తనను గురించి కూడా తానే రాసుకోవలసి రావడం కూడా ఒక కారణం కావచ్చు. 'పరిశోధన'కు ఉన్న ప్రాధాన్యాన్ని చెప్పడానికే ఇక్కడ సి. నారాయణ రెడ్డి గారిని ప్రస్తావిస్తున్నది.

నూటికి తొంభైమంది విద్వాంసులు తమ పరిశోధన గ్రంథం స్థాయిలో మరో పుస్తకం రాయకపోవడం, సిద్ధాంతగ్రంథరచనకు వెచ్చించినంత కాలం, శ్రమ, వ్యయం మరో రచనకు కేటాయించకపోవడమే పరిశోధన ప్రాముఖ్యాన్ని, ప్రాధాన్యాన్ని తెలుపుతుంది. పైన పేర్కొన్నవన్నీ వెనుకటివే. ఇప్పటివాళ్ళ సంగతేమిటి? అనవచ్చు. ఇప్పటి వారు సైతం ఎన్నో మంచి గ్రంథాలు రాయకపోలేదు. 'ప్రజానాట్యమండలి ప్రదర్శనకళలు'పై పరిశోధించిన డా॥ చింతా సత్యనారాయణ విషయసేకరణ కోసం ఎంతో శ్రమపడ్డారు. ప్రజానాట్యమండలి 1943లో మొదలైంది. కాని ఏ రోజున మొదలైందో గుర్తించడానికి ఎన్నోపాట్లు పడవలసివచ్చింది. 'శ్రీ కాకుళోద్యమసాహిత్యం' మీద పరిశోధించిన కె. ముత్యం ప్రమాదభరితమైన తీవ్రవాదప్రాంతాల్లో విస్తృతక్షేత్ర పర్యటన చేసి అనేకాంశాలు వెలుగులోకి తెచ్చారు.

శ్రీమతి వి.రాజేశ్వరిగారు 'తెలుగునవలల్లో వరకట్న సమస్య చిత్రణ' (1990)ను గురించి పరిశోధిస్తూ వరకట్న సమస్యను సాంఘికశాస్త్ర నేపథ్యంతో చక్కగా విశ్లేషించారు. పట్టికలు, టేబుళ్ళు, ఫ్లోచార్టులతో గణాంకశాస్త్ర పద్ధతులను తొలిసారిగా ప్రయోగించి సహస్రముఖాలుగా వికృతరూపం దాల్చిన వరకట్న సమస్యను మన ముందుంచారు.

తెలుగు సినిమాపాటల మీద, చరిత్ర, కైఫీయత్తుల మీద, నవలల మీద ఇత్యాద్యనేకాంశాల మీద విశ్వవిద్యాలయాల్లో వచ్చిన గ్రంథాలతో పోలిస్తే బయటవచ్చిన గ్రంథాలు చాలా తక్కువ. గోపీచంద్ కథల మీద, నవలల మీద బుచ్చిబాబు మీద మంచి గ్రంథాలు యూనివర్సిటీలలోనే పరిశోధనలో భాగంగా వచ్చాయి. ఇక జానపదం, గ్రామనామాలు, భాషాశాస్త్రం విశ్వవిద్యాలయాలను ఆసరాగా చేసుకొని వృద్ధిపొందుతున్నవే. విశ్వవిద్యాలయాల్లో జానపదం మీద 235పై చిలుకు ఎం.ఫిల్., పి.హెచ్.డిలు

వచ్చినట్లు దాఖాలా ఉంది. మరి విశ్వవిద్యాలయం వెలుపల జానపద సాహిత్యాన్ని పరిశీలిస్తు ఎన్ని గ్రంథాలు వచ్చాయి?

భక్తికవులు - సామాజిక విశ్లేషణ (1994), భారతీయ వ్యాఖ్యాన సంప్రదాయం - తెలుగులో వ్యాఖ్యానాలు(1990), తెలుగులో మృచ్ఛకటికం(1991), తెలుగు సినిమాపాట(1991), ఆధునిక తెలుగు సాహిత్యంలో అధిక్షేప ధోరణులు(1992), తెలుగులో పద్యనిఘంటువులు(1993), తెలుగులో యాత్రా చరిత్రలు(1990), తెలంగాణాలో సాహితీ సాంస్కృతిక చైతన్యం-పత్రికల పాత్ర(1996), జానపదభిక్షుక గాయకులు(1996), భావకవిత్వంలో స్త్రీ(1987), కవయిత్రుల కవిత్వంలో స్త్రీ మనోభావాలు(1990), కాకతీయ యుగసాహిత్యంలో స్త్రీల సామాజిక స్థితిగతులు (1996), తెలుగు సాహిత్యంపై శరత్ ప్రభావం(1990), విశ్వనాథ నవలలు-మానవ సంబంధాలు(1994), ఆధునిక కవిత్వం వస్తువు రూపపరిణామం(1992), అభ్యుదయ కవిత్వంలో స్త్రీ(1989), తెలుగు కవిత్వంలో భావచిత్రాలు(1996), అభ్యుదయ కవిత్వంలో మధ్యతరగతి జీవితచిత్రణ(1982), ఆధునిక తెలుగు కవిత్వంలో "నేను"(1990) మొదలైన వాటినెన్నింటినో పేర్కొనవచ్చు.

వెనిగళ్ళ రాంబాబు 'ప్రాచీనాంధ్రసాహిత్యంలో విజ్ఞాన శాస్త్రాంశాలు' అనే అంశంపై 2005లో డాక్టరేట్ పొందారు. గణితం, వైద్యం, వ్యవసాయశాస్త్రం, భౌతిక శాస్త్రం, ఖగోళశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, ఆహారవిజ్ఞానశాస్త్రాదుల్లో భారతీయవిజ్ఞానాన్ని ఆధునికశాస్త్ర విజ్ఞానంతో సరిపోల్చి పరిశీలించారు.

చదరంగంలో మొదటి గదిమీద ఒక గింజ ఉంచి క్రమంగా అరవైనాలుగు గళ్ళల్లో రెట్టిస్తుపోతుంటే వచ్చే సంఖ్య 184467447 3709551615 అని గణితసార సంగ్రహంలో చెప్పబడింది. ఇది ఆధునిక కంప్యూటర్‌తో పునః పరిశీలిస్తే సరియైనదేనని తేలిందట. భాగవతంలో చెప్పబడిన పిండోత్పత్తి పెరుగుదల క్రమం ఆధునిక ఆలోపతి శాస్త్రంలో ఆయా దశల చిత్రపటాలతో పోలిస్తే సక్రమమని తేలుతుంది. వడ్లలో 200 రకాలు, 20 రకాల ధాన్యాలు,

15 రకాల నూనెగింజలు, 50 రకాల కూరగాయలు, 30 రకాల ఊరగాయలు, 25 రకాల ఆకుకూరలు ప్రాచీన సాహిత్యంలో లభిస్తున్నాయి. కాంతి స్వభావాన్ని, కాంతివేగాన్ని, గ్రహాల వ్యాసాలను, ఔషధాల తయారీ చిత్రలేఖనంలో ఏనాటికీ మాయని రంగులు మొదలైనవెన్నెన్నో అంశాలను వెనిగళ్ళ రాంబాబు సిద్ధాంతగ్రంథంలో పేర్కొన్నారు.

తెలంగాణ విమోచనోద్యమం కాలంలోని స్త్రీల చైతన్యాన్ని సాహిత్యంలో అది ప్రతిఫలించిన తీరును సోదాహరణంగా వివరించి తిరునగరి దేవకీదేవి మంచి సిద్ధాంత గ్రంథం రాశారు.

ధారణాశక్తికి, సద్యఃస్పందనకు, భావుకతకు, మూలమైన అవధాన ప్రక్రియ అవతరణ వికాసాలను గురించి సాధికారికమైన సిద్ధాంతగ్రంథాన్ని **రాళ్ళబండి కవితా** ప్రసాద్ (2006) రచించారు. వామనుడు 'చిత్తైకాగ్ర్యం అవధానం' అన్న నాటినుండి సంస్కృతాంధ్రకావ్యాల్లో అవధానశబ్ద విచారం, అవధాన స్వరూపం వైవిధ్యం - అష్ట, అష్టాదశ, శత, సహస్ర సహస్రాధిక అవధానాల వివరాలను, అంశాల స్వరూప స్వభావాలను అందులోని మెళుకువలను రాళ్ళబండివారు వివరించారు.

సమగ్ర సాహిత్య చరిత్ర నిర్మాణానికి ప్రత్యేకప్రాంత, ప్రత్యేక కాల, ప్రత్యేక ప్రక్రియాచరిత్రలు ఎంతో దోహదం చేస్తాయి. మహబూబ్‌నగర్ జిల్లా శతకం, వచనం, రాయలసీమకవులు, మెదక్, కడప, శ్రీకాకుళం, కరీంనగర్ జిల్లాల కవుల భిన్న భిన్న క్షేత్రమాహాత్మ్యాల పరిశీలనలు, వచన గేయ కవిత్వ పరిశీలనలు ఇత్యాదులెన్నో విషయ నిర్భరమైన సిద్ధాంతగ్రంథాలు వచ్చాయి.

1991-2000 దశకంలోని 'పద్య ప్రక్రియ - వస్తువైవిధ్యం' అనే అంశంపై కె.వి.రమణాచారి డాక్టరేటు పొందారు. 1991-2000 మధ్యలో వచ్చిన 323 పద్య కృతుల్లోని ఆధ్యాత్మిక, పౌరాణిక, చారిత్రక, సామాజికాది భిన్న భిన్న వస్తువులను క్రోడీకరించి ప్రదర్శించారు. పద్యం ఈసడింపునకు గురవుతున్న కాలంలో ప్రామాణికమైన మహాకావ్యాలు రావడం - వై 2 కె వైరస్ ప్రమాదం, నైనాసాహ్నీ హత్య, కాకతీయరైలు దహనం - కార్గిల్‌యుద్ధం,

బుద్ధవిగ్రహపతనం, బాలకార్మికవ్యవస్థ, లంచగొండితనం మొదలైన అనేకాంశాల మీద పద్యాలు రావడాన్ని రమణాచారి సోదాహరణంగా పేర్కొన్నారు. వినూతన ఛందస్సులు కల్పింపబడడం; సాహిత్యంతో సంబంధంలేని ఇంజనీర్లు, కలెక్టర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తల పద్యరచనలు చేయడం మొదలైన అనేక విషయాలను కె.వి. రమణాచారి తమ సిద్ధాంత గ్రంథాలలో వివరించారు. ఈ సిద్ధాంత గ్రంథం '2001-2010 సంవత్సరాల్లో పద్య కవితా వికాస పరిశీలన' కు ఆదర్శంగా నిలుస్తుంది. ప్రేరణనిస్తుంది.

అత్యాధునిక సమస్య 'ప్రపంచీకరణం'. సి. హెచ్. కాశీం 2009లో ప్రపంచీ కరణ వ్యతిరేక సాహిత్యం మీద డాక్టరేటు పొందారు. ప్రపంచబ్యాంక్, వరల్డ్‌ట్రేడ్ ఆర్గనేజేషన్లు దేశాలను దోపిడీ చేస్తున్న తీరును తెలుగుకవులు, కథకులు, నవలాకారులు దాన్ని ప్రతిఘటించిన తీరు వాటి వస్తురూప విశ్లేషణను కాశీం వివరించారు.

బద్దిపూడి జయరావు 2007లో దళిత సంఘటన కవిత్వం మీద తెలుగు విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి. చేశారు. కారంచేడు, నీరుకొండ, తిమ్మసముద్రం, చుండూరు, వేంపేట లాంటి గ్రామాల్లో జరిగిన కులకక్షలు, కంచికచర్లకోటేసు, చలకుర్తి ముత్తమ్మల పై దాడికి సంబంధించి ఆయా గ్రామాలలో తిరిగి, వ్యక్తులను కలిసి, సంఘాలతో సంప్రదించి - ప్రత్యక్షక్షేత్ర పర్యటనతో సిద్ధాంతగ్రంథాన్ని రూపొందించారు.

ఎరుకలి వారి జీవనస్థితిగతుల మీద (కె. ప్రభాకర్), సుగాలీ సంస్కృతిభాషా సంస్కృతుల మీద (ఎం.గోనానాయక్), నల్లగొండ బంజారాలమీద (డి. సూర్య ధనంజయ్), ఆశ్రితకుల వ్యవస్థ మీద (పి. సబ్బాచారి), సాహిత్యంలో ముస్లింల జీవిత చిత్రణ మీద (వి. గీతానాగరాణి)లాంటివెన్నింటినో పేర్కొనవచ్చు.

ఇలాగ ఎన్నో సిద్ధాంతగ్రంథాలలోని మేలిమి సుగుణాలను ప్రదర్శించాలన్న ఆసక్తి ఉంది. కాని స్థలాభావం దృష్ట్యా చెప్పలేక పోతున్నాను. ఇటీవల నా సంపాద కత్వంలో సి.పి.బ్రౌన్ అకాడమీ ప్రచురించిన పరిశోధన

వ్యాసమంజరి I, II రెండు సంపుటాల్లో మరిన్ని సిద్ధాంతగ్రంథాల వివరాలు లభిస్తాయి. వైయక్తికమైన అభిరుచి, శ్రమశీలం ఓపిక, వ్యుత్పన్నత ఉంటే మంచి సిద్ధాంత గ్రంథం రాయవచ్చు. పిహెచ్.డి అన్న వ్యవస్థ ఉండడం వల్లనే ఇవన్నీ సాధ్యమయ్యాయని మాత్రం నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. తెలుగులో జరిగిన పరిశోధనను స్థూలంగా ఎనిమిది విభాగాలుగా వర్గీకరించుకోవచ్చు. ఒకే గ్రంథంలో ఈ ఎనిమిది అంశాలు కలిసిపోవచ్చు కూడా.

## 1. సాహితీ విలువలను పరిశీలించడం

రసం, అలంకారాలు, పాత్రపోషణం, సౌందర్యపోషణం, కవి ప్రతిభను నిరూపించగలిగే అంశాలు, పూర్వకవి ప్రభావాలు, అనంతర కవులపై ఆయన చూపిన ప్రభావం, తీసుకొన్న ఇతివృత్తానికి మూలాలు వగైరా అన్నీ ఈ విభాగం కింద చెప్పుకొనే వీలుంది. తెలుగులోని ప్రాచీన ఆధునిక కవులందరి మీద ఇంచుమించు ఈ రకం సిద్ధాంత గ్రంథాలు వెలువడ్డాయి. తెలుగులో ఆద్యగ్రంథమైన కవిత్రయ మహాభారతంపై 220 దాక ఎం.ఫిల్., పిహెచ్.డి.లు వచ్చాయి. ఇది రాశిని సూచిస్తుంది. మరి ఇంతమంది చేసినప్పుడు ఎన్నెన్ని కొత్త అంశాలు వెలుగులోకి వచ్చాయి? ఎన్నెన్ని పునరుక్తులయ్యాయి? 'నన్నయపై ఇంత పరిశోధన వ్యాసంగం జరిగినా, నన్నయ శబ్దార్థసాహితీతత్త్వ స్వరూపావగతికి తెలుగుజాతి నోచుకోలేదంటే అర్థమేమిటి?'[1] అని విద్వన్మణులు విసుక్కొంటున్నారు. 'విశ్వనాథ'పైన 'జానపదం' పైన అత్యధిక సంఖ్యలో పరిశోధన గ్రంథాలు వెలువడ్డాయి. వాటి సార్థకత ఏమేరకు సంతృప్తికరంగా ఉందో విశ్లేషించు కోవాలి. దివాకర్ల వేంకటావధాని 1957లో ఉస్మానియా నుండి 'ప్రాఙ్నన్నయ యుగము-నన్నయ భారతము' అనే అంశం మీద పరిశోధించారు. శాసనాల్లో తొలి తెనుగు నుడులు మొదలుకొని తొలి తెలుగుకవి నన్నయ సంస్కృత భారతాన్ని ఆంధ్రీకరించిన తీరుతెన్నులు, చేసిన మార్పులు సోపపత్తికంగా నిరూపిస్తూ తెలుగుభాష పటిష్ఠతకు నన్నయ చేసిన దోహదాన్ని వివరించారు. జొన్నలగడ్డ

1. తుమ్మపూడి కోటేశ్వరరావు: శ్వేతపద్మం, పుట 19

మృత్యుంజయరావు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి నన్నయ అనువాద విధానాన్ని ప్రత్యేకంగా పరిశీలించి డాక్టరేటు పొందారు.

మహాభారతంలోని ఇతిహాస లక్షణాలను కేతవరపు రామకోటిశాస్త్రి వివేచించి ఉస్మానియా నుండి డాక్టరేటు పొందారు. ఎల్లూరి శివారెడ్డి, జి. హరిహరనాథ్ ఆంధ్ర కమలాదేవి ప్రభృతులు రసపోషణ వైచిత్రిని ఆవిష్కరించారు. అప్పజోడు వెంకటసుబ్బయ్య మహాభారతంలో మానవస్వభావ చిత్రణను పరిశీలించి 1971లో ఉస్మానియా నుండి డాక్టరేటు పొందారు. భీష్ముడు, కుంతి, ద్రౌపది, శ్రీకృష్ణుడు, ధర్మరాజు, భీముడు, అర్జునుడు మొదలుకొని సాత్యకి, ఉత్తరలాంటి అప్రధాన పాత్రల వరకు వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన జరిగింది.

1969 నాచనసోమన ఇతర హరివంశాల మీద ఉస్మానియా నుండి పి. యశోదారెడ్డి, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి వేదుల కామేశ్వరరావు 1966లో పరిశోధనలు జరిపారు. 1969లో పోతన భాగవతంపై ధూళిపాళ శ్రీరామమూర్తి, 1980లో భాస్కర రామాయణంపై ఆర్. శ్రీహరి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేటు చేసి సిద్ధాంత గ్రంథాలను ప్రచురించారు.

కొర్లపాటి శ్రీరామ్మూర్తి శ్రీనాథుని ఆంధ్రీకరణ విధానం ఇతర చారిత్రక అంశాలను, పాండితీ ప్రాభవాన్ని ప్రామాణికంగా ఆవిష్కరించి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి 1965లో డాక్టరేటు గ్రహించారు. శ్రీనాథుని ఈశ్వరార్చన కళాశీలాన్ని సోపపత్తికంగా నిరూపించి 1976లో పిహెచ్.డి. కన్నా ఉన్నతమైన డి.లిట్. పట్టాన్ని కూడా శ్రీరామ్మూర్తి పొందారు.

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సేకరించిన తాళ్లపాక అన్నమాచార్యుని సంకీర్తనలను ఆలంబనగా చేసుకొని అన్నమాచార్యుల సంకీర్తన లక్షణాలను వైష్ణవ ప్రభావాన్ని విశ్లేషించి ఉస్మానియా నుండి 1966లో వేటూరి ఆనందమూర్తిగారు డాక్టరేటు పట్టా పొందారు. అన్నమాచార్యుల సంకీర్తనల్లో శృంగారభావనలు, జానపద గేయఫణితులు, స్త్రీ సంబంధిత అంశాలు,

కవిసమయాలు, సమకాలీన సాంఘిక జీవనం, యక్షగాన సంప్రదాయం, వర్ణనలు, ఆత్మనివేదన, అన్యదేశ్యాలు, గ్రామీణజీవితం మొదలైన అనేక అంశాల మీద శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ప్రత్యేకదృష్టి పెట్టి ఎం.ఫిల్., పిహెచ్.డి. లకు పరిశోధనలు చేయించింది.

ప్రబంధయుగ మణిదీపంలాగా పేర్కొనదగిన శ్రీ కృష్ణదేవరాయల 'ఆముక్త మాల్యద' సౌందర్యాన్ని తుమ్మపూడి కోటేశ్వరరావు ఉస్మానియా నుండి 1967లో విశ్లేషించి డాక్టరేటు పొందారు. ఇంకా మనుచరిత్ర పారిజాతాపహరణం, వసుచరిత్ర, పాండురంగ మాహాత్మ్యాది కావ్యాలకు సంబంధించి రకరకాల అంశాల మీద పరిశోధనలు జరిగాయి.

దక్షిణాంధ్రయుగంలో రఘునాథనాయకుని వాల్మీకి చరిత్రాది కృతుల మీద, చేమకూర వేంకటకవి కృతుల మీద, పిఠాపురం, వెంకటగిరి, గద్వాల సంస్థానాలకు చెందిన ఎందరో కవుల కావ్యాలు తెలుగు పరిశోధనలకు వస్తువులయ్యాయి.సామాజిక దురాచారాలను ఖండించిన వేమన, వీరబ్రహ్మం మొదలైనవారి మీద, త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు ఇతర వాగ్గేయకారుల మీద కూడా వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధకులు ప్రశస్తమైన పరిశోధనలు జరిపి ఆయా అంశాలను నిగ్గు తేల్చారు.

## 2. ఛందోవ్యాకరణాది శాస్త్రాంశాలను అన్వయించి పరిశోధించడం

పాటిబండ మాధవశర్మ 'మహాభారతం – ఛందశ్శిల్పం', వివియల్ నరసింహారావు నన్నయ అక్షరరమ్యత, జంధ్యాల జయశంకర బాపూజీ శ్రీనాథుని సాహిత్యప్రస్థానం, నన్నయ, నన్నెచోడ, శ్రీనాథ, చేమకూర కృతులను భాషాశాస్త్రపరంగా పలువురు రచించిన వర్ణనాత్మక వ్యాకరణాలు, ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతాన్ని ఆంధ్ర మహాభారతానికి అన్వయించి శలాక రఘునాథశర్మ, మనుచరిత్రకు అన్వయించి కె. రాజన్నశాస్త్రి, సీతారామాంజనేయ సంవాదం కావ్యానికి జీవబ్రహ్మైక్య సిద్ధాంతాన్ని సమన్వయిస్తూ రత్నాకర బాలరాజు సిద్ధాంత గ్రంథం మొదలైనవాటిని

శాస్త్రాంశాలను అన్వయించి రాసిన సిద్ధాంత గ్రంథాలకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

## 3. కేవల శాస్త్రాలంశాల మీద, శాస్త్ర గ్రంథాల మీద కృషి

వ్యాకరణం, భాష, ఛందోఅలంకార శాస్త్రాదుల ఆవతరణ వికాసాల మీద, అంతర్గత అంశాల పరిణామామ స్వరూప స్వభావాల మీద, తత్సంబంధ గ్రంథాల మీద పరిశోధకులు యథోచిత దృష్టి ప్రసరింపచేశారు. తెలుగు వ్యాకరణ వికాసంపై బొడ్డుపల్లి పురుషోత్తం 1966లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి, అమరేశం రాజేశ్వరశర్మ 1970లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి, జి. లలిత మద్రాసు విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్లు పొందారు. చిన్నయసూరి బాలవ్యాకరణం, బహుజనపల్లి సీతారామాచార్యుల ప్రౌఢ వ్యాకరణాల రచనానిర్మాణ వైఖరులను విశ్లేషిస్తూ చేసిన పరిశోధనలు వచ్చాయి. తూమాటి దొణప్ప వైకృత పదస్వరూపాలను వివరించి 1965లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేటు పొందారు.

కేతన కృతుల మీద పరిశోధించిన హరిశివకుమార్‌గారు 'ఆంధ్రభాషా భూషణాన్ని వర్ణనాత్మకంగా సమీక్షిస్తే సరిపోయేది. కాని వారు దానికి మూలమైన నాగవర్మ (ద్వితీయ) రాసిన కర్ణాటక భాషాభూషణంతో సరిపోల్చి పరిశీలించారు. తొలి వ్యాకరణమైన ఆంధ్రభాషాభూషణంలోని ప్రయోగాల, సూత్రాల ప్రభావం విన్నకోట పెద్దన, అనంతుడు, చిన్నయసూరి, బహుజనపల్లి సీతారామాచార్యుల దాక వచ్చిన అనంతర వ్యాకర్తల మీద ఎలా ప్రసరించిందో వివరించారు.

సంస్కృతేతర దేశిచ్ఛందస్సుల మూలాలు శోధించి, పద్య, గణ, యతి నిర్మాణాల మూలాలకు జానపద చ్ఛందాలు మాతృకలని, సీసాది ఛందాలు గేయం నుండి రూపుదిద్దుకున్న శిష్టవాఙ్మయ ఛందోరూపాలని నరసయ్యగారు కేవలశాస్త్రదృష్టితో నిగ్గుతేల్చిన పరిశోధన 'తెలుగు దేశీ ఛందస్సు - ప్రారంభవికాసాలు.' సంగనభట్ల, బొడ్డుపల్లి పురుషోత్తం, అమరేశం రాజేశ్వరశర్మగార్ల పుస్తకాలకు కొంతమేరకు ఖ్యాతి వచ్చింది. కానీ పాండితీ

యశోమండితమైన మరొక సిద్ధాంత గ్రంథం 'ఆంధ్ర మునిత్రయ తత్త్వదర్శనము' డా॥ చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మగారిది. 1988లో నాగార్జున విశ్వవిద్యాలయంలో డాక్టరేటు పొంది రెండు సంపుటాల్లో 1990లో ముద్రణరూపమెత్తింది. నాగార్జున విశ్వవిద్యాలయ సిద్ధాంత గ్రంథ సూచికలతో సహా ఎక్కడా దీని ప్రస్తావన ఉండదు. ఆంధ్ర శబ్ద చింతామణి, వికృతివివేకము, కవిశిరోభూషణముల చుట్టు దట్టంగా అల్లుకున్న అపప్రథలను, అవిశ్వాసాలను, మహావిద్వాంసుల పూర్వ నిశ్చితాభిప్రాయాలను పూర్వ పక్షం చేస్తూ సత్యశోధన దిశలో పయనించి స్వీయసిద్ధాంత ప్రతిపాదనం చేశారు. అయితే ఈ పుస్తకం ఈ కాలంలో చదివి అర్థం చేసుకొనే ఓపిక, తీరిక, కోరిక ప్రశ్నార్థకమే.

భద్రిరాజు కృష్ణమూర్తి ఇండియాలో భాషాశాస్త్రాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. వారి శిష్యప్రశిష్యులెందరో భాషాశాస్త్రానికి సంబంధించిన భిన్న భిన్న అంశాలను పాశ్చాత్య సిద్ధాంతాలతో, పద్ధతులలో, శాస్త్రీయంగా, దేశవిదేశాల్లో విశ్లేషించారు. శాసనభాషా పరిణామంపై కాలవిభజన చేసుకొని బూదరాజు రాధాకృష్ణ, కె.కె. రంగనాథాచార్యులు, కందప్పచెట్టి క్రమంగా వ్యావహారిక ప్రయోగాల ప్రాచీనతా స్థాపనాన్ని, పదపదాంశ వాక్యనిర్మాణ వైఖరులను లేఖన స్వరూప పరిణామాన్ని పరిశోధించారు. చేకూరి రామారావు 1968లో కార్నెల్ విశ్వవిద్యాలయం నుండి తెలుగు నామవాచకాలను చామ్‌స్కీ పరివర్తన సిద్ధాంతం వెలుగులో పరిశోధించి డాక్టరేటు పుచ్చుకున్నారు. బి. రామకృష్ణారెడ్డి తెలుగు వాక్యం మీద లోకలిస్టు సిద్ధాంత ప్రభావాన్ని పరిశీలించి ఎడ్.బర్గ్ విశ్వవిద్యాలయం నుండి 1976లో డాక్టరేటు పొందారు. వివిధ మాండలికాల పరిశీలన, నామరూపకృత్తద్ధిత, సమాస కారక సర్వనామ, అన్యదేశ్యాద్యనేకాంశాలు పరిశోధనలకు పాత్రమయ్యాయి.

## 4. ప్రక్రియా వికాసాలను పరిశీలించడం

తెలుగులో భిన్న భిన్న రూపవస్తు ప్రక్రియలను పరిశోధనాంశాలుగా గ్రహించి ఆ రంగం సంపూర్ణ అవతరణవికాసాలను ఆవిష్కరించిన వారనేకులు ఉన్నారు. ఇవి ఒక రకంగా ఆ ప్రక్రియకు సంబంధించిన సమగ్ర సాహిత్య

చరిత్రలు. ఇవి నేడు ముఖ్యమైన రిఫరెన్సు గ్రంథాలుగా, బృహత్ సాహిత్య చరిత్ర నిర్మాణానికి ప్రధానమైన ప్రాతిపదికలుగా అమితంగా ఉపకరిస్తున్నాయి.

'జానపద వాఙ్మయం'పై 1956లో బి. రామరాజు, 'శతక వాఙ్మయం'పై 1965లో కె. గోపాలకృష్ణారావు, 'నాటక వికాసం'పై 1961లో పి.యస్.ఆర్. అప్పారావు, 'ప్రబంధ వాఙ్మయ వికాసం'పై 1960లో పల్లా దుర్గయ్య, నన్నయ నుండి నేటిదాకా వచ్చిన వచన పరిణామ రీతులపై 1964లో ఎం. కులశేఖరరావు, 'ఆధునికాంధ్ర కవిత్వం'పై డా॥ సి. నారాయణరెడ్డి, 'నవల'పై 1963లో బి.వి. కుటుంబరావు, 'కథానిక'పై 1977లో పోరంకి దక్షిణామూర్తి, 'సాహిత్య విమర్శ' పై 1973లో ఎస్.వి. రామారావు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్లు గ్రహించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 'ద్విపద వాఙ్మయం' పై 1966లో జి. నాగయ్య, 'వ్యాసప్రక్రియ'పై 1974లో కొలకలూరి ఇనాక్, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'యక్షగానం' పై 1957లో ఎస్.వి. జోగారావు పరిశోధనలు చేశారు. ఛందస్సు, గేయం, పేరడీ, సైన్స్ ఫిక్షన్ కథలు, ఉదాహరణ వాఙ్మయం, స్మృతి లాంటి ప్రక్రియల అవతరణ వికాస పరిణామాలను పరిశీలించిన సిద్ధాంత గ్రంథాలు కూడా వెలువడ్డాయి. ఈ గ్రంథాలన్నింటిల్లోను ఆ ప్రక్రియలకు సంబంధించిన సమాచారాన్ని పుష్కలంగా సేకరించి ముఖ్య అముఖ్యగ్రంథాలను, విశేషాలను, పరిణామాలను అన్ని కోణాల్లోంచి విశ్లేషణ చేయడం కనబడుతుంది. ఇవి ఒక రకమైన హిస్టారికల్ డాక్యుమేంటేషన్లు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధన ప్రారంభమయ్యాక ప్రక్రియా వికాసాల మీద జరిగిన ఈ పిహెచ్.డి.లు ప్రామాణ్యాన్ని సంతరించుకొని ఆయా పరిశోధకులకు ఎంతో పేరు ప్రఖ్యాతులను తెచ్చి పెట్టాయి. వీటిల్లో ప్రస్తావింపబడిన అంశాలు తర్వాతి కాలంలో ప్రత్యేక పరిశోధనాంశాలయ్యాయి.

## 5. చారిత్రక సామాజిక అంశాలను అన్వేషించడం

సమాజ పరిణామాన్ని, గతిశీలాన్ని సాహిత్యం సమర్థంగా ప్రతిబింబిస్తుంది. అందునా చారిత్రక సామాజిక అంశాలను పరిశీలించడం

ఆధునిక యుగంలో అనివార్యమైంది. 'ప్రబంధాలలో సామాజిక చిత్రణ', 'తెలుగు శాసనాలు-సామాజిక సాంస్కృతిక దృక్పథం'లాంటి డైరెక్టు సిద్ధాంత గ్రంథాలతో పాటు ఆయా కవుల మీద విడివిడిగా చేసిన పరిశోధనల్లోను సామాజికాంశాల అన్వేషణ గోచరిస్తుంది.

జానపద విజ్ఞానంలో దాదాపు 250 మంది దాకా ఎం.ఫిల్.. పిహెచ్.డి. లు వచ్చాయి. ఇవన్నీ సాహిత్య సామాజికాంశాలే. జిల్లాలవారిగా ప్రాంతాలవారిగా కూడా జానపదాంశాల పరిశీలనలు జరిగాయి. 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' మీద ప్రశస్త ప్రామాణిక గ్రంథం ప్రకటించి ఆర్.వి.ఎస్. సుందరం పిహెచ్.డి. కన్న ఉన్నతమైన డి.లిట్ పట్టం గ్రహించారు. తెలుగులో వీరగాథా కవిత్వం (1969)పై తంగిరాల సుబ్బారావు, నృశాస్త్రాన్ని అన్వయించి నాయని కృష్ణకుమారి తెలుగు జానపద గేయగాథలను (1970) పరిశీలించారు. రావి ప్రేమలత పురాణగాథలపై విస్తారంగా పరిశోధనలు సలిపారు. వివిధ ప్రాంతాల గ్రామదేవతలు, వాటి నేపథ్యం, జాతరలు వాటి విశేషాలు, గిరిజన విజ్ఞానం, కులవిజ్ఞానం, పౌరాణిక కథలు, ప్రదర్శన కళలు, సామెతలు, జాతీయాలు ఇత్యాదిగా ఎంతో విస్తారంగా జానపద పరిశోధనలు తెలుగులో జరిగాయి.

కేతు విశ్వనాథరెడ్డి 1975లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తొలిసారి కడప జిల్లా గ్రామనామాల మీద పరిశోధించారు. యార్లగడ్డ బాలగంగాధరరావు అనంతపురం జిల్లా గ్రామనామాల మీద 1981లో నాగార్జున విశ్వపద్యాలయంలో పిహెచ్.డి చేయడమే గాక తన శిష్యుల చేత ఇంచుమించు కృష్ణాజిల్లాలోని అన్ని మండలాల ఊళ్లను గురించి పరిశోధింపచేశారు. ఇండ్లపేర్లు, కులగోత్రాలు, వ్యక్తుల పేర్లు లాంటివి కూడా వచ్చాయి.

## 6. కవుల వ్యక్తిత్వాలను, వారి కృతులను కలిపి పరిశోధించడం

కవి జీవిత కాలాదికాలను చర్చించిన పిదప వారి రచనలన్నింటిని విశ్లేషించడం ఈ వర్గీకరణ కిందికి చేర్చవచ్చు. తెలుగులో దాదాపు ప్రతి కవి మీద పరిశోధన జరిగింది. బృహత్కావ్యంలో చెప్పగలిగే అంశాలుంటే

ఆ ఒక్క కావ్యం మీదనే పరిశోధించడం లేదా కవి రచించిన అన్ని కృతులను సమీక్షాత్మకంగా పరిశీలించిన గ్రంథాలను ప్రస్తావించుకోవచ్చు. ఆధునిక కవులు, రచయితలు అందరిపైన విపుల పరిశోధనలు వచ్చాయి.

'కందుకూరి వీరేశలింగం' తెలుగు సంఘానికీ, తెలుగు సాహిత్యానికి తెచ్చిపెట్టిన కొత్త వెలుగును అక్కిరాజు రమాపతిరావు ప్రదర్శించి ఉస్మానియా నుండి 1965లో డాక్టరేటు గ్రహించారు. వేటూరి ప్రభాకరశాస్త్రి సాగించిన సాహిత్య పరిశోధన జీవితాన్ని, సాధించిన యోగపారమార్థిక జీవితానుభవాలను ఆవిష్కరించి పోచిరాజు శేషగిరిరావు 1980లో ఆంధ్ర యూనివర్సిటీ నుండి డాక్టరేటు పొందారు.

పానుగంటి లక్ష్మీనరసింహరావు సాహిత్యసృష్టిపై ముదిగొండ వీరభద్రశాస్త్రి (1963), చిలకమర్తి సాహిత్యసేవపై ముక్తేవి భారతి (1980), జాషువాకృతులపై బి.భాస్కరచౌదరి (1979), చలం సామాజిక దృక్పథంపై ఎన్. రామచంద్ర, అడవి బాపిరాజు రచనలపై వి. సిమ్మన్న, మన్నవ సత్యనారాయణ ఇలా భిన్న భిన్న విశ్వవిద్యాలయాల నుండి ఎందరో పరిశోధించి కృతార్థులయ్యారు. గిడుగు రామ్మూర్తి, కొమర్రాజు వేంకట లక్ష్మణరావు, వేదం వెంకటరాయశాస్త్రి, తాపిధర్మారావు, విశ్వనాథ సత్యనారాయణ, గురజాడ, శ్రీశ్రీ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, జాషువా బోయి భీమన్న, గోపీచంద్, రావిశాస్త్రి, సి. నారాయణరెడ్డి, శేషేంద్రశర్మ మొదలైన ఆంధ్రసాహితీలోక మూర్ధన్యుల రచనలపై విస్తారంగా పరిశోధనలు జరిగాయి. పనిలో పనిగా సాధారణ రచయితల జీవితాలు రచనల మీద కూడా పరిశోధనలను బండ్ల కెక్కించారు.

## 7. తులనాత్మక పరిశీలన

తులనాత్మక పరిశీలనం(అధ్యయనం) అంటే రెండు అంశాల మధ్య సామ్యభేధాల పరిశీలనం. దీని ద్వారా రెండింటిలోని ప్రత్యేకత ప్రకాశమానమై మరింత స్పష్టంగా చెప్పుకునే వీలు కలుగుతుంది. భిన్నభాషల్లో వెలువడిన సా- ్దరు రచయితలు వేర్వేరుగా రాసిన ఒకే అంశం తులనాత్మక పరిశీలన

కిందికి వస్తుంది. భారతీయ భాషలన్నింటిలో భారత భాగవత రామాయణాలు ఏదో తీరుగా ఉంటాయి. కనుక తులనాత్మక పరిశోధనలు వాటి చుట్టూ పరిభ్రమించటంలో ఆశ్చర్యపోనక్కర లేదు. పంప పేరుందేవనార్ నన్నయల కవిత్వ వైఖరులను తులనాత్మకంగా పరిశీలించి కె. వెంకటేశ ఆచార్య కర్ణాటక విశ్వవిద్యాలయం నుండి డాక్టరేటు పొందారు. వీరు కన్నడ తమిళాంధ్ర కవులను గూర్చి తమ గ్రంథాన్ని ఇంగ్లీషులో రాయడం మరొక సంగతి. దీనితో నాలుగు భాషల కూడలిగా వారి రచన తయారయ్యింది. తిక్కన కుమార వ్యాసులపై; కంబరంగనాథ రామాయణాలపై పోతన సూరదాసులపై పరిశోధనలు వచ్చాయి. తెలుగులో ఎందరో రాసిన గోదాదేవి కథలను, నలకథలను, హరిశ్చంద్రో పాఖ్యాలను, విప్రనారాయణ కథలను పోల్చి చూసిన వారు కూడా ఉన్నారు.

ఉస్మానియా హిందీశాఖలో పనిచేసిన భీంసేన్ నిర్మల్‌గారు, ఆంధ్ర విశ్వ విద్యాలయం హిందీశాఖలో ఆచార్యులుగా పనిచేసిన జి. సుందర రెడ్డి, కర్ణ రాజశేషగిరి రావు ఇరు భాషల్లోను పండితులు, రచయితలు కావడం మూలాన తమ శిష్యప్రశిష్యుల చేత తెలుగు హిందీ తులనాత్మక పరిశీలనలను గణనీయంగా ప్రోత్సహించారు.

'భారతేందు హరిశ్చంద్ర వీరేశలింగం'ల గురించి ఖ్వాజామెయిన్ (1965) సూర్‌దాస్ పోతన సాహిత్యాల్లో వాత్సల్యరస పోషణం గురించి బి. లీలాజ్యోతి(1967), ప్రసాద్–పానుగంటిల మీద ఎ. గోపాలరావు 1972లో, సూర్‌దాస్–పోతనల్లో భక్తి భావన సిహెచ్.రాములు 1972లో, హిందీ–తెలుగు భావకవిత్వాలను గురించి, అభ్యుదయ కవిత్వాల గురించి, శతక సాహిత్యాల గురించి, చారిత్రక నాటకాల గురించి, నవలల గురించి, అస్తిత్వవాదం గురించి, స్మృతి కావ్యాలను గురించి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరిగాయి.

హిందీ తెలుగు నాటకాల గురించి ఐ. పాండురంగారావు 1960లో, నవలల గురించి జి.వి. సుబ్రహ్మణ్యం 1971లో, హిందీ తెలుగు కావ్యాలపై

గాంధేయవాద ప్రభావం గురించి ఎం. శివప్రసాదరావు (1977) ప్రభృతుల ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పరిశోధనలు జరిపారు.

సుమిత్రా నందన్‌పంత్ కృష్ణశాస్త్రి కవిత్వాల భేదసాదృశ్యాల గురించి, విద్యాపతి, క్షేత్రయ్యల పదకీర్తనల గురించి, ప్రేమ్‌చంద్, గోపీచంద్ నవలల గురించి, విశ్వనాథ సత్యనారాయణ, జయశంకర ప్రసాదు కవిత్వాల గురించి; విశ్వనాథ చతురసేనశాస్త్రి నవలల గురించి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరిగాయి.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం హిందీశాఖలో హిందీ తెలుగు వైష్ణవభక్తి కావ్యాల గురించి కె. రామనాథన్ 1964లో చేసిన పరిశోధనతో తులనాత్మక పరిశీలనకు అంకురార్పణ జరిగింది. సూర్‌దాస్ అన్నమయ్యల కీర్తనల మాధుర్యం గురించి ఎం. నాగరత్నమ్మ సూర్‌దాస్ అన్నమాచార్యుల గురించి ముట్నూరి సంగమేశం, సూర్‌దాస్ అన్నమయ్యల సాహిత్యం దాస్యభక్తిని గురించి కె. పద్మావతి పరిశోధనలు జరిపారు.

హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం హిందీశాఖలో ఆచార్య వై. వెంకటరమణారావు హిందీ తెలుగు తులనాత్మక పరిశోధనలు బాగా ప్రోత్సహించారు. అలహాబాదు, బెనారస్, బీహార్, నాగపూర్‌లాంటి ఉత్తరాది విశ్వవిద్యాలయాల్లో కూడా తెలుగు హిందీ తులనాత్మక పరిశోధనలు జరిగాయి. ఉత్తరాదిలోను దక్షిణాదిలోను హిందీ తెలుగు తులనాత్మక పరిశోధనలు చేసినవారు చాలామటుకు హిందీ నేర్చిన తెలుగువారే. తప్ప తెలుగు నేర్చిన హిందీవారు కారు. హైదరాబాదు నగరంలో నున్న తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయనకేంద్రం ఒకటి ప్రత్యేకంగా స్థాపించబడింది. దానిలో దాదాపు 40 ఎం.ఫిల్. పదిదాకా పిహెచ్.డి. లు వచ్చినట్లున్నాయి. తులనాత్మక పరిశోధకులు సోదరభారతీయ భాషలన్న హిందీ ఆంగ్ల తెలుగు రచనల్లోని సాదృశ్యాలు, వైదృశ్యాల పరిశీలించడానికి ప్రాధాన్యమిచ్చారు.

## 8. తెలుగులోని వివిధాంశాలను గుర్తించడం

ప్రాచీన ఆధునిక కవిత్వంలోను నవల నాటకం కథ జానపదాది ప్రక్రియల్లోను ఉన్న వివిధాంశాలను పరిశోధనాంశాలుగా ఎందరో ఎన్నుకొని విశ్లేషించారు.

తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావం కొత్తపల్లి వీరభద్రరావు (1956), తెలంగాణలో సాహిత్య కార్యక్రమాలు - సంస్థలు - బన్న ఐలయ్య (1994), ఆధునిక తెలుగు కవిత్వంలో వాస్తవికత – అధివాస్తవికత నందిని సిద్ధారెడ్డి(1986), తెలుగు నవలపై తెలంగాణా విమోచనోద్యమ ప్రభావం పి. వరవరరావు (1981), తెలుగు నవలల్లో ఉద్యోగినుల సమస్యలు, టి.వి. నాగరంజని (1990), తెలుగు సినిమా పాటల ప్రభావం-పరిణామం పి.ఎస్. రెడ్డి (1992), ఆంధ్ర సారస్వతంలోని అద్వైత తత్త్వకావ్యాలు ఎస్. పరబ్రహ్మశాస్త్రి (1973), తెలుగు కవితా విప్లవాల స్వరూపం వేల్చేరు నారాయణ రావు (1974), తెలుగు కావ్యపీఠికలు డి. చంద్రశేఖరరెడ్డి (1988), తెలుగులో యాత్రా చరిత్రలు మచ్చహరిదాసు, తెలుగు సాహిత్యం– క్రైస్తవం జి. కృపాచారి (1985), ఆంధ్ర వాఙ్మయం రామాయణం కె. మలయవాసిని (1971) లాంటి మంచి మంచి అంశాలనెన్నుకొని రాసిన సిద్ధాంత గ్రంథాలను లెక్కకుమించి పేర్కొనవచ్చు.

## మరో పార్శ్వం: అనిష్ట వాస్తవాలు

ఇక సిద్ధాంత గ్రంథాలు ఆశించిన స్థాయిలో ఉండడం లేదని పలువురు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. పత్రికల్లో సూటిపోటి వ్యాఖ్యలు, వ్యంగ్యరచనలు చేస్తున్నారు. ఈ ప్రమాణాల పతనంలో వ్యక్తి గత దోషాలు, వ్యవస్థాగత దోషాలు, సామాజిక దోషాలు, ఎన్నెన్నో ఉన్నాయి. నేడు పరిశోధకుల పరిస్థితి, స్థాయి పర్యవేక్షకుల స్థితి, 'పోబో నీళ్ళకున్ పలుచనై....' అన్నట్లు నానాటికి దిగజారుతుంది. పూర్వపు ప్రతిభా పాండిత్యాలు, శ్రద్ధాభక్తులు కనుమరుగై పోయాయి.

'ఈనాడు మన యూనివర్సిటీలలో జరుగుతున్న పరిశోధనలను గురించి బయట అంత మంచిపేరు లేదు. ఈ సంగతి మనకు కూడా తెలుసు. దీనిని మనం సర్దుబాటు చేసుకోలేకపోతున్నాం. ఎందువల్లనంటే మన ఆలోచనలెంత ఆధ్యాత్మికములో మన ఆచరణలంత పరమలౌకికములు. మరొకమాటలో చెప్పాలంటే స్వప్రయోజనానికి లౌకిక దృష్టినీ, పరప్రయోజనానికి ఆధ్యాత్మిక దృష్టినీ మనం అవలంబిస్తాం. అందరమూ అరాచకత్వాన్ని ఆమోదిస్తూ ఆలోచనాస్థాయిలో ఖండిస్తున్నాం. ఎవరికీ ఇబ్బంది కరమైన మార్గం కాని మార్గం అవలంబించాం'[1] అని కీ॥శే॥ కేతవరపు రామకోటిశాస్త్రిగారు 1986లోనే అనుభవ పూర్వకంగా హెచ్చరించినా నేటికీ పరిస్థితులు ఏదిశలో సాగుతున్నాయో ఎవరికి వారే బేరీజు వేసుకోవాలి.

ప్రమాణాల కోసం పరితపించడం మూర్ఖత్వమనీ, ప్రయోజనాలు సాధించడమే మనిషి లక్ష్యం అనీ వేగంగా పరిశోధకులు ముందుకు దూసుకుపోతున్నారు. యువతరం. అయితే ఈ చొరవ ఈ వేగం విద్యాసముపార్జనం పట్ల, రచానభ్యాసం పట్ల చూపవలసిన అవసరం ఎంతైనా ఉంది. చేకూరి రామారావుగారన్నట్లు కష్టపడడానికి ఇష్టంలేని ఒకతరం తయారయింది. రకరకాల విద్యేతర ప్రభావాలతో, సామాజిక కారణాలతో 'సిద్ధాంత వ్యాసరచనకు మార్గదర్శకసూత్రాలు' నిర్వచించే, నిర్ణయించే స్థానాలలోకి వచ్చి కూర్చుంటున్నారు. అలా వచ్చాకయినా దృష్టిని స్థాయి పెంచుకొనే వైపు ప్రసరింప చేసుకోకపోవడం గమనార్హం. విశ్లేషణ, అన్వయసామర్థ్యం మాట దేవుడెరుగు. పుట్టెడు వాక్యనిర్మాణ దోషాలతో, అక్షరదోషాలతో అనన్వయంగా రాసేసి డిగ్రీలు తెచ్చుకొన్న పరిశోధకులూ ఉన్నారు. ఆ పరిశోధకులే పర్యవేక్షకులుగా పరిణమించి మార్గదర్శనం చేస్తున్నారు. రాసింది ఒకసారి సరిచూసుకుందాం అనే ఓపిక లేకపోవడం, నేర్చుకోవాలన్న ఆసక్తి లేకపోవడం. ఏమి రాసినా ఎట్లా రాసినా డిగ్రీ వస్తుందన్న నిర్లక్ష్యం అంతే.

---

1. దృష్టి-దృశ్యం (2005) పుట 176

పరిశోధన గ్రంథోత్పత్తి కుటీరపరిశ్రమలు వెలిశాయి. దయ్యపురాతలు బలిశాయి. ఆడినమాట తప్పి రచ్చచేసుకున్న వైనాలూ దృష్టి కొస్తున్నాయి. పరిశోధక విద్యార్థులు సేకరించుకొన్న సమాచారాన్ని కైవసం చేసుకొంటున్న పర్యవేక్షకులూ ఉన్నారు. పర్యవేక్షకులను కొనుక్కొంటున్న పరిశోధకులూ ఉన్నారు. గురుశిష్యుల మధ్య ఆర్థిక లావాదేవీలు అధికమవుతున్నాయి. సర్వే సర్వత్ర వ్యాపించిన 'వ్యాపార సంస్కృతి'కి పరిశోధకులు, పర్యవేక్షకులు మాత్రం అతీతులెలా కాగలరు? వారు కూడా మనుషులే కదా!

పరిశోధక రంగం ఒక్కటే చెడిపోయింది. దేశమంతా బాగుందన్నట్లు అభాండాలు వేయడం సబబు కాదు. ఈ స్థితి తెలుగుశాఖకే పరిమితమూ కాదు. ఎ. పున్నారావుగా రొకసారి చెప్పిన మాటలు స్మరించుకొందాం. 'ఈ ప్రమాణాలు పడిపోవడం అనే ఆవేదన కేవలం ఈ తరంవారిదే కాదు. దాదాపు అన్ని తరాలవారూ కొందరు ఈ భావనకు గురైనట్లు తెలుస్తుంది. మాకు బోధించిన వారు తమ తరంవారి అభినివేశాలూ శ్రమశీలాలూ తమ విద్యార్థులలో లేవని విచారించేవారు. అయితే వారి ఆచార్యులూ వారిని అదేవిధంగా అనలేదని చెప్పలేం. కాగా ఈ ప్రమాణాల పతనమో, రాహిత్యమో ఇలాంటివి ఏనాడు తప్పనివే అని గ్రహించాలి. కాకపోతే నేడు మారిన సాంఘిక పరిస్థితుల వల్ల చదువరుల సంఖ్య బాగా (పాతకాలంతో పోలిస్తే) పెరిగిన కారణాన ఆ పెరుగుదల ప్రమాణానికి అనుగుణంగా ఈ పతనాల ప్రమాణమూ పెరిగి ఉండవచ్చు. అది అనివార్యంగదా మరి... అవమానకరమైన పరిస్థితుల్లో మన చదువుల్నీ మన పరిశోధనల్నీ ఉంచుకోవడం విషాదకరమైన పరిణామమే. ఆ పరిణామానికి ప్రత్యక్షంగానో పరోక్షంగానో మనమూ; కొంతవరకు మన పూర్వులూ బాధ్యులే! కాని వాస్తవమేమిటంటే ఈ పరిణామం ఈ దేశాన ఏ ఒక్క విభాగానికో, యూనివర్శిటీకో పరిమితమై లేదు. తెలియవచ్చినంత వరకు పరిశీలిస్తే. జాతి శీలంలోనే ఏదో వెలితి ఏర్పడినపుడు దాని ప్రభావం ఆ జాతి అన్ని చర్యల్లోనూ ప్రస్ఫుటంగా ప్రతిఫలించక తప్పదు. ఆ వెలితి ఒక పద్ధ్యంగానికే

ఇక్కడ పరిమితమనలేము. అది పరిపాలనా వ్యాపార వాణిజ్య ఆది వివిధజాతి జీవన ప్రక్రియలకూ వ్యాపించే ఉంది. కాగా భాగీరథీ గంగతో పాటు భారతీయ జీవనగంగను కూడా (ముఖ్యంగా విద్యాధికులను) ప్రక్షాళన చేయవలసిన అవసరం పుష్కలంగా ఉంది. అప్పుడు గాని అన్నిటి మాలిన్యాలతో పాటు విద్యారంగ మాలిన్యమూ తొలగిపోదు.'[1]

ఈ రోజు సౌకర్యాలు ఎంతగా పెరిగినా మన పూర్వులు సాధించిన పాండితీ ప్రాభవాలను మించి సాధించుకోగలిగిన పరిస్థితులు లేవు. ఈ తరానికి బహువ్యాపకత్వం ఎక్కువ. పైపెచ్చు సంఘంలో వాణీపూజ కన్నా లక్ష్మీపూజ మీద మనసు. అవసరాలు పెరిగిపోతున్నాయి. ఒక గంటసేపు అదెంత మంచి సిద్ధాంతగ్రంథ మైనా సరే చదవడం కన్నా ఆ గంటసేపు ఏదో పనిచేసుకొనో, ఏ యూనివర్శిటీ పేపర్లు దిద్దో నాలుగు రూకలు సంపాదించుకోవడం ఎక్కువ ప్రయోజనదాయకం. పర్యవేక్షకులు దైనందిన కార్యభారంతో, నాగరకజీవితంతో నలిగిపోతున్నారు. బోధనకు తయారుకావడంతోను, కాలేజీకి ప్రయాణం కావడంతోను, రాత్రి టెలివిజన్ భూతంతో గడపడంతోనే అధికసమయం వ్యయమయిపోతుంది. పాఠం చెప్పడానికో, సమీక్ష చేయడానికో తప్ప, ఏదో ఒక రకమైన అవసరముంటే తప్ప ఎంత గొప్ప పుస్తకమైనా సరే చదవలేని స్థితి ఏర్పడింది. దాంతో పరిశోధకుడు, పర్యవేక్షకుడు ఇద్దరూ కొత్తగా చదువుకొంటున్న వారే అవుతున్నారు. రెండువందల పుస్తకాలు కూడ ఇంట్లోలేని తెలుగు లెక్చరర్లు ఎందరో ఉన్నారు. ఇన్ని సమస్యల మధ్య ఇప్పుడు కూడా తపనతో రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్న వారిని నిరంతరం చదువుతూ కొత్త సంగతులు తెలుసుకోవాలని ఆరాటపడుతున్న వారినీ మనం ప్రస్తుతించక తప్పదు.

---

1. పల్లవ గ్రాహిపాండిత్యం (వ్యాసం) తెలుగు పరిశోధన 4వ సంచిక (1988)

# 4

# పరిశోధకులు

పూర్వపరిశోధకులు అంటే కనీసం మూడు, నాలుగు దశాబ్దాల పూర్వందాక, ఎం.ఫిల్ ప్రవేశపెట్టకముందు వరకు బోధనానుభవం, సాహిత్య పరిచయం, రచనా వ్యాసంగం కలిగి ఉండేవారు. పిహెచ్.డిలో ప్రవేశం కోరుతున్ననాటికి కొంత సాహిత్య కృషి చేసి, ఆ అంశం మీద పూర్వీకుల కృషి కొంతైనా తెలుసుకొని వచ్చేవారు. అంతేగాక అతిస్వల్ప వ్యవధిలో సిద్ధాంత గ్రంథ రచనం ముగించాలన్న తపన ఉండేది కాదు. అప్పటికే ఉద్యోగస్థులు అయి ఉండడం మూలానా డాక్టరేటు ద్వారా కొత్త ఉద్యోగం ఏదీ వచ్చేస్థితి లేకపోవడంతో ప్రశాంతంగా విషయాసక్తితో పరిశ్రమించేవారు. అందువల్ల వాటికి మంచిపేరు వచ్చింది.

ఇప్పటి పరిశోధక విద్యార్థి స్థితి వేరు. అతని ఆందోళనలు, మానసిక సమస్యలు వేరు. ఈ రోజు పరిశోధక విద్యార్థి ప్రధానంగా రెండు సమస్యలు ఎదుర్కొంటున్నాడు. 1. పరిశోధనాంశానికి సంబంధించిన నేపథ్య పరిజ్ఞాన రాహిత్యం. 2. జీవితానికి సంబంధించిన ఉద్యోగరాహిత్యం. నేపథ్య పరిజ్ఞాన రాహిత్యం (Background Knowledge) అంటే ఎం.ఫిల్‌లో చేరేనాటికి ఏ అంశాన్ని ఎందుకు తీసుకోవాలో, ఆ అంశం మీద ఎంతవరకు కృషి జరిగిందో ఏ మాత్రం అవగాహన లేకపోవడం. దీనికి కారణం ఉంది. ఎం.ఏలో చదివేపద్ధతికీ, రిసెర్చిలో అధ్యయనంచేసే పద్ధతికి పూర్తి వ్యత్యాసం ఉంటుంది. ఎం.ఏ దాకా ఒక ప్రత్యేకమైన పాఠ్యప్రణాళిక ఉండడం అందులో సగం

సిలబస్‌ను చదివితే చాలు ఉత్తీర్ణులయ్యే అవకాశ ముండడం. ప్రశ్నలకు జవాబులుగా పుస్తకాల నుండి యథాతథంగా ఎత్తి రాసుకొని కంఠస్థం చేసుకొని కానీ, గుర్తుంచుకొని కానీ పరీక్షల్లో రాస్తే చాలు కృతార్థులవుతారు. ఎం.ఏలో సామూహికకృషితో ఫలితాలు సాధించవచ్చు. తరగతిమొత్తంలో ఇద్దరు ముగ్గురు విద్యార్థులు శ్రమిస్తారు. నోట్స్ రాస్తారు. తక్కినవారు వాటిని ఎత్తి రాసుకొంటారు. ఎత్తి రాసుకోవడం కూడ ఇప్పుడు పోయింది. పరీక్షలకు రెండు రోజుల ముందు జిరాక్స్ చేసుకొంటున్నారు. పరీక్షహాలు నుండి బయటికి వచ్చే వరకు జ్ఞాపకముంటే సరి. కాని పరిశోధక విద్యార్థి అలాకాదు. అతని కృషి సామూహికంగా ఉండదు. వ్యష్టిగా ఉంటుంది. బాధ్యత తీసుకోవల్సి ఉంటుంది. పర్యవేక్షకునితోనేగాకు, ఇతర ఉపన్యాసకులతోను, మిత్రులతోను చర్చించాల్సి ఉంటుంది. తనకు కావల్సిన సమాచారం తానే రాబట్టుకోవాల్సి ఉంటుంది. ఎం.ఏ పరీక్షలో విషయం తెలుసా లేదా అనే చూస్తారు. అలాగే చూడాలి కూడా. ఎం.ఏలో విద్యార్థి మౌలికంగా సొంత వ్యాఖ్యానాలు చేయడానికి అంతగా వీలుపడదు. కాని పిహెచ్.డిలో మౌలికతకే ప్రాధాన్య ముంటుంది. పొరపడితే పరీక్షకులు మాత్రమే కాదు. లోకంలో ఎవరైనా ఎప్పుడైన వాటిని తప్పు అని నిరూపిస్తూ కొత్తవి ప్రతిపాదించే అవకాశం ఉంటుంది.

ఇలా ఎం.ఏలో సిలబస్ మాత్రులై కంఠస్థమే గమ్యం కావడం ఒకటి కాగా జీవితంలో స్థిరపడాల్సిన దశ కావడంతో విద్యార్థులు తమ దృష్టిని పోటీ పరీక్షల మీద ఉద్యోగాన్వేషణ మీద కేంద్రీకరించక తప్పదు. పత్రికల్లో సాహిత్యానుబంధాల పేజీ మీద కన్నా ఉద్యోగ ప్రకటన పేజీ మీద దృష్టి ఉంటుంది. తాము పుట్టిన గ్రామాల్లోకన్నా నగరాల్లో ఉంటే 'ఉద్యోగార్జన' ఉద్యమంలో కృతకృత్యులు కాగలరు. కనుక వారు ఎదుర్కొనే సమస్య వసతి. కష్టమో నష్టమో ఎం.ఫిల్, పిహెచ్.డిల్లో సీట్లు తెచ్చుకుంటే కొంతకాలం హాస్టల్లో ఉండవచ్చు. తినడానికి తిండి, ఉండడానికి వసతి లభిస్తాయి. పోటీ పరీక్షలు రాసుకొని అదృష్టదేవత కరుణిస్తే చిన్నదో పెద్దదో ఉద్యోగం దొరికించుకొని వెళ్ళిపోవచ్చు. ఈ విధంగా 'లక్ష్యమే' వేరయిన విద్యార్థుల నుండి మంచి పరిశోధనలు రావాలని ఎలా ఆశించగలం? తమకు

తిండి పెట్టని పరిశోధన వైపు కాకుండా జీవనోపాధి చూపించే అవకాశాలున్న కోర్సులవైపు దృష్టి పెట్టక తప్పదు మరి. మరి భారీగా ఉపకారవేతనాలు పొందే వారో! వారూ అంతే!

అట్లాగే ఎం.ఫిల్ విద్యార్థులకు విషయావగాహన చదివితే వస్తుంది. కాని రచనా పరమైన అభ్యాసం లేకపోవడం ఒకలోపం. ఎలా మొదలు పెట్టాలి? ఎలా ముగించాలి? వాక్య నిర్మాణాలు ఎలా ఉన్నాయి? కంటిన్యుటీ ఉందా? లేదా? అకస్మాత్తుగా మరో విషయం మీదికి వెళ్ళిపోతున్నామా? మొదలైన విషయాలలో వారు ఇంకా శక్తి సమన్వితులు కావలసిన అవసరం కనిపిస్తుంది. కొందరు పర్యవేక్షకులు కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఈ దశను ఎం.ఏ వరకే దాటిన వారికి ఎం.ఫిల్‌లో రాయడం సులువవుతుంది. విషయ విశ్లేషణను, విషయ ప్రతిపాదనలను పర్యవేక్షకుడు చూడడం సముచితం. కాని రాతదోషాలను కూడా సవరించుకొంటూ కూర్చునే తీరిక పర్యవేక్షకునకుండదు. ఒక్కోసారి పర్యవేక్షకుడు విద్యార్థికి ఎంత చెప్పినా అర్థంకాని స్థితి, అశక్తత ఉంటాయి. అటువంటప్పుడు విషయం మీది కన్నా శీర్షికలు, అధ్యాయాలపేర్లు సరిచేసి వదిలేయడం జరుగుతుంది. అంతే తప్ప పర్యవేక్షకుడు స్వయంగా రాసివ్వలేదు. అసలు పరిశోధకులు రాసుకొచ్చిన దానిని దిద్దడం కన్నా రాసివ్వడమే సులభం అని వాపోతున్న పర్యవేక్షకులు లేకపోలేదు.

అసలు ఎం.ఏలో పరిశోధనకు సంబంధించిన ఊసే లేకపోవడం విచిత్రం, విమర్శ పేపరులో 'పరిశోధన'కు సంబంధించిన అంశం ఉండాలి. పాఠశాలల్లో చిన్న పిల్లలచేత కూడ 'ప్రాజెక్ట్స్' చేయిస్తుంటే ఎం.ఏలో ప్రాజెక్ట్ ఉండకూడదని గొడవలు చేసి తీసేయిస్తున్నారు.

అనితర సాధ్యమైన విశ్లేషణనూ, నూతన అన్వయాలనూ చేయగలిగిన శక్తి లేకపోయినా చెప్పేది సూటిగా నిర్దుష్టంగా ఉందా లేదా అని పరిశీలించుకోవడం, అక్షర వాక్యనిర్మాణ దోషాలను సవరించుకోవాలన్న పట్టుదల ఉండడం ఉత్తమ పరిశోధకుని లక్షణం. నిర్లక్ష్యంతో ఏం రాసినా

ఎలా రాసినా చెల్లిపోతుందన్న ధీమాతో రాస్తే; పర్యవేక్షకుడు వాత్సల్యంతో, ఔదార్యంతో, ఓపికలేని తనంతో ఆమోదించవచ్చు. కాని ఆ దోషాలు పరీక్షకుల దృష్టిలో పడతాయి.

ఒక అంశాన్ని గురించి విశ్లేషణ పద్ధతి, తార్కికత, అనుశీలించే విధానం తెలిసి ఉండడమే స్థూలంగా డాక్టరేటు ఉద్దేశ్యం. విశ్వవిద్యాలయ స్థాయిలో పిహెచ్.డి అనేది అత్యున్నతస్థాయి డిగ్రీ. ఇక ఆపైన చదువు ఉండదు. ఈ మధ్య డి.లిట్ ఇస్తున్నారు. కాని ఇది అంత వ్యాప్తిలో లేదు. అంటే ఆ ప్రత్యేకాంశం పైన ఇక అతడే ఎంతో అవగాహన కలిగిన వ్యక్తిగా ముద్రపడతాడు. అతనయితేనే సప్రమాణంగా చెప్పగలడు అని ప్రజలు విశ్వసిస్తారు! అందుకుగాను పరిశోధకుడు పిహెచ్.డీలో చేరాలనుకొనేనాటికి ఆ ప్రత్యేక రంగంలో వచ్చిన మూడు నాలుగు పిహెచ్.డీ గ్రంథాలనైనా, అవసరమున్న పేజీలు కాక మొదటి పుట నుండి చివరి పుట దాకా ప్రత్యక్షరం నిశితంగా చదవాలి. కనీసం చేరిన కొత్తల్లోనైనా చదివితీరాలి. ఉదా॥ జానపదరంగంలో పరిశోధించాలను కొంటే బి. రామరాజు, నాయనికృష్ణకుమారి, తంగిరాల సుబ్బారావు, ఆర్.వి. ఎస్. సుందరం, రావి ప్రేమలత, కసిరెడ్డి ప్రభృతుల గ్రంథాలను చదవకుండానే ఆ రంగాన్ని ఎన్నుకుంటే ఎట్లాగు? ఆధునిక కవిత్వం మీద చేసేవాడు, సి. నారాయణ రెడ్డి, ముదిగొండ శివప్రసాద్, వేల్చేరు నారాయణ రావు, జి. చెన్నకేశవరెడ్డి, ఎస్వీ సత్యనారాయణ గారల రచనలు విధిగా చదవాలి. ఇంచుమించు ఆధునిక కవిత్వమంతా వివిధ ఉద్యమాలతో మమేకమై సాగింది. కనుక ఆ ఉద్యమాల పరిణామవికాసాలు సిద్ధాంతాలపట్ల అవగాహన పెంచుకోవాలి. అట్లాగే ఏ రంగాన్ని తీసుకొన్నా ఆ రంగానికి చెందిన ప్రామాణిక రచనలు చదవాలి. వీటిలో సగం పుస్తకాలు ఎం.ఏ స్థాయిలో పాఠ్యగ్రంథాలుగా ఉండడంతో చదివే అవకాశం సిద్ధిస్తుంది. ఎంఏలో ప్రశ్నలకు జవాబుల కోసం ఈ పుస్తకాల్లో ఏ పుటల్లో దొరుకుతుందో చదువుతారు. ఇప్పుడు అలాకాదు. వారి వారి ప్రణాళికలు ఎలా ఉన్నాయి? విషయ వివరణకు అవి ఎంతవరకు సరిపోయాయి? రచనా విన్యాసం, విషయ వ్యక్తీకరణ విధానం ఎలా ఉంది?

మొదలైన విషయాలను జీర్ణం చేసుకోవడానికి చదవాలి. తర్వాత పిహెచ్.డిలో చేరాక పరిశోధనలో తాదాత్మ్యం పెరుగుతున్న కొద్దీ పుస్తకాలు చదివే పద్ధతి మారుతుంది. ఈ సమయంలో మనకు కావలసిన సమాచారం, వ్యాఖ్యలు ఏ పేజీలలో దొరుకుతాయో, వాటిని మాత్రం శ్రద్ధగా చదువుతూ తక్కిన పుటలు గమనిస్తు వెళ్ళిపోతుండాలి. కనిపించిన ప్రతి పుస్తకం చదువుతూ పోతె జ్ఞానపరిధి విస్తృతమే అవుతుంది. నిజమే. కానీ పరిశోధన కుంటుపడుతుంది. ఇలా పేజీలు తిప్పేస్తూ గమనిస్తు పోతూనే గ్రహించే శక్తి ఓ వంద గ్రంథాలనయినా క్షుణ్ణంగా అధ్యయనం చేస్తేనే సిద్ధిస్తుంది.

తన పరిశోధనాంశంతో పోలిన అంశాలమీద పరిశోధన చేసిన వారు ఎలా ప్రణాళిక వేసుకొన్నారు? ఉపశీర్షికలెలా ఉన్నాయి? ఏఏ అంశాలను ఎలా చర్చించారు? అన్నది పరిశీలించుకొని తన పరిశోధనాంశానికి అనువైన చట్రాన్ని తయారు చేసుకోవచ్చు. తర్వాత పర్యవేక్షకునితో చర్చించి మరింత నిగ్గుదేల్చుకోవచ్చు.

పరిశోధకునికి తన పరిశోధనాంశానికి ఉపకరించే అంశాలు ఎక్కడున్నా పట్టుకోగలిగే నేర్పరితనం ఉండాలి. అది చిత్తుకాగితాల బుట్టలో పారేసిన ఒక పాతపేపరులో దొరకవచ్చు. లైబ్రరీలో అతిభద్రంగా దాచబడ్డ పుస్తకంలో దొరకవచ్చు. ఒక్కోసారి రచయితలు తమ వ్యాసాలకు డొంకతిరుగుడు పేర్లు పెట్టి రాయవచ్చు. లేదా మహారచయితలు తమ విస్తృత అనుభవాన్ని పురస్కరించుకొని ఒక విషయాన్ని చెప్తూ మరొక అప్రస్తుతాంశాన్ని చెప్పవచ్చు. ఆ వ్యాసాన్ని చదివిన పాఠకులకు ఆ వ్యాసం ఉపయోగపడవచ్చు. పడకపోవచ్చు. కాని అప్రస్తుతంగా చెప్పిన ఆ అంశం ఈ పరిశోధకునికి ఒక్కోసారి మార్గదర్శనం చేయవచ్చు.

నిడుదవోలు వెంకటరావు గారి 'ఆధునికయుగం – గాంధీప్రభావం' అనే వ్యాసం 1973 ఫిబ్రవరి మార్చి భారతి సంచికల్లో వచ్చింది. ఈ వ్యాస శీర్షికద్వార మన కర్థం అయ్యేదేమిటి? స్వాతంత్ర్యోద్యమంలో గాంధీ నాయకత్వం స్థిరమైన తర్వాత వెలువడిన సాహిత్యం. దానిమీద గాంధీ ప్రభావప్రసరణం అనే భావిస్తాం గదా! కానీ ఆ మహానుభావుడు పోతూ

కూచిమంచి జగ్గన మొదలైన రాజులను ఎదిరించిన కవులందరిని వివరిస్తూ ఆధునిక కవుల దగ్గరకు వచ్చాడు ఇలాంటి వాటిని కూడా పరిశోధకుడు పట్టుకోగల్గాలి. ఉపయోగించుకోగల్గాలి. ముఖ్యంగా తమ అంశానికి సంబంధమున్న అంశాలమీద వచ్చిన సిద్ధాంత గ్రంథాల్లో ఉపయుక్త గ్రంథసూచికలను పరిశీలిస్తే దారి దొరకగలదు.

పరిశోధకునిలో పరిశోధనకు సంబంధించిన కుతూహలం ఉండడం సహజం. ఏదైనా కొత్తఅంశం లభించిందంటే అమాంతం ఎగిరిగంతేయడం సహజం. ఆ పారవశ్యంలో వస్తువును సక్రమంగా గమనిస్తున్నామా? లేదా ఎక్కడైనా పొరపాటు పడుతున్నామా? అని ఒకటికి రెండు సార్లు మనల్ని మనం పరీక్షించుకోవాలి.

భాగవత కర్త పోతనకు ఒక కొడుకు ఉన్నాడు. అతడి పేరు మల్లన్న. రుక్మాంగద చరిత్ర కావ్యం రాసిన ప్రౌఢకవి మల్లన తండ్రి పేరు పోతన, అది చూసి ఆ పోతన కొడుకు ఈ మల్లన అని పరవశించిపోవచ్చు. ఒక ప్రముఖ విమర్శకుడే అలా పరవశించిపోయాడు. కాని పోతనది కౌండిన్య గోత్రం, మల్లన్నది శ్రీవత్సగోత్రం అని సావకాశంగా గద్యలను పరిశీలిస్తే తేలుతుంది. ఇద్దరు వేర్వేరు అని రూఢిపడుతుంది. నామసామ్యం వల్ల పొరపాటు పడే అవకాశం ఉంటుందని హెచ్చరించడానికి ఈ ఉదాహరణ. ఈ ఒక్కటే కాదు ఇంకా ఎన్నో రకాలుగా పొరపాట్లు పడే అవకాశ ముంటుంది.

పోతన భక్తితత్వ విశ్లేషణం సామాన్యాంశం. కాని డా॥ ప్రభల జానకి పోతనను సంగీత విద్వాంసునిగా ప్రతిపాదించడం వినూతనాంశం.

సాంద్ర శరచ్చంద్ర చంద్రికా ధవళిత, విమల బృందావన వీధియందు
రాసకేళీమహోల్లాసుఁడై యుత్ఫుల్ల, జలజాక్షుఁడొక నిశాసమయమునను
దనరారు మంద్రమధ్యమతారముల నింపు దళు కొత్త రాగభేదములఁ దనరి
దైవత ఋషభ గాంధార నిషాద పంచమ షడ్జమధ్యమ స్వరములోనిఁ
గళలు జాతులు మూర్ఛనల్ గలుగ వేణు, నాళ విమాంగుళిన్యాసలాలనమున
మహితగతిఁబాడె నవ్యక్తమధురముగను, బంకజాక్షుండ దారువులంకురింప

అనే పద్యంలో సంగీత శాస్త్ర సాంకేతిక పదాలనేకం ప్రయుక్తమైనాయి. పద్యారంభంలోనే 'చంద్రిక'రాగం సూచితమైంది. "ద,రి,గ,ని,ప,స,మ" అనడంలో సప్తస్వరాలు, మంద్ర, మధ్యమ తారలనే త్రిస్థాయిలు, కళలు, జాతులు, మూర్ఛనలు - ఇవన్నీ సంగీతశాస్త్ర సాంకేతిక పదాలై తజ్ఞులకు మాత్రమే అర్థమౌతాయి. 'సరిగమపదని' అని కాకుండా 'ద,రి,గ,ని,ప,స,మ' అనే వరుస నిర్దేశించడం చేత చంద్రికారాగ అరోహణావరోహణలు కూడా సూచించినట్లైంది. కళలంటే సంగీతంలో 'సంగతులు'. అయితే ఇది తాళదశప్రాణాల్లో ఒక తాళాంగంగా కూడా సంగీతజ్ఞులు సంభావిస్తారు. ఈ కళలు మళ్ళీ ఏక, ద్వి, చతుష్క భేదంతో ఒకటి, రెండు నాలుగక్షరాల కాలపరిమితిని తెలుపుతాయి. దీప్త, ఆయత, కరుణ, మృదు, మధ్యమ భేదంతో జాతులైదని సంగీత సంప్రదాయం, ద్వావింశతి శ్రుతులందరికీ పరిచితమైనవే. ఇంతటి గంభీరార్థాన్ని పోతన అలవోకగా సీసపద్యంలో నిక్షేపించడం ఆయన సంగీతజ్ఞానానికి నిదర్శనం.'[1]

అట్లాగే భాగవతం దశమస్కంధం ఉత్తర భాగం-1096లో పేర్కొనబడిన పదిహేను వాద్య విశేషాలు, నీలోత్పల (10-పూర్వభాగం-776); హంసధ్వని (10 పూర్వభాగం-778) భువనమోహిని రాగం (10 పూర్వభాగం - 772) ప్రస్తావనలు పరిశీలిస్తే పోతన కేవల సాహితీమూర్తే గాక ఎంతటి నాదోపాసనా నిష్ణిత బుద్ధికలవాడో అవగతమౌతుంది[2] పోతన దగ్గర 'సంగీతం' ప్రస్తావిస్తే కొత్తదనం వస్తుంది. రామరాజ భూషణుని దగ్గర సంగీతం ప్రస్తావిస్తే సామాన్యాంశమవుతుంది. ఎందుకంటే ఆయన 'సంగీత కళారహస్యనిధి'నని కంఠోక్తిగా చెప్పుకున్నాడు. నన్నయ తెనుగుదనాన్ని గురించి, పాల్కురికిసోమన, తిక్కనల తత్సమ పదభూయిష్ఠ, సమాసాత్మక రచనను విశ్లేషిస్తే నూతనత్వం వస్తుంది. **పరిశోధన గ్రంథంలో 75 శాతం గతానుగతికత్వం ఉన్నా 25 శాతమైన వినూతనత్వం, స్వీయముద్ర, సృజనాత్మక అన్వయం ఉంటే ఆ పరిశోధకుడు విజయం పొందినట్లే.**

---

**1,2 భక్తి పథంలో ప్రస్థానత్రయం (పోతన-రామదాసు-త్యాగరాజు)(2003) పుటలు 40-42**

అన్వయించడంలో పరిశోధకునికి సృజనశీలం కూడా అవసరం. ఇట్లెందుకని ఉంటాడు అని ప్రశ్న వేసుకోవాలి. లోకంలో వారి వారి అభిరుచులను అనుసరించి పాక్షిక వ్యాఖ్యానాలు చేస్తుంటారు. పరిశోధకులు ఆ గాలి వాటంలో కొట్టుకపోకూడదు.

'ఉపమ గలిగిన శయ్యల నొప్పియున్న అంఘ్రిభవుని కావ్యంబు గ్రాహ్యంబు కాద'ని ఎంత గొప్పదయినా శూద్రుని కావ్యం బ్రాహ్మణ కావ్యంతో సమానం కాదు - అని కాకునూరి అప్పకవి అప్పకవీయంలో రాశాడు. దీనిని ఉల్లేఖిస్తూ ఇది అవమానించడం తప్ప మరొకటి కాదని, ఇంతకన్నా కుల అహంకార సిద్ధాంతం వేరే ఉండదు - అంటూ వ్యాఖ్యానించిన ప్రసిద్ధులు, అప్రసిద్ధులు ఉన్నారు. చేమకూర వేంకటకవి కావ్యం గొప్పది గదా అన్న వారూ ఉన్నారు. ఈ స్పందన చాలా సహజమైంది. ఏకీభవించదగిందే కాని చాల్మామంది ఇంతవరకే ఆగిపోయి తృప్తి పడతారు. పరిశోధకుడు ఇక్కడ తనబుద్ధికి పదును పెట్టాలి. ఇంత కులవివక్ష కలిగిన అప్పకవి శ్రీకృష్ణదేవరాయలు, రామరాజభూషణుడు, చేమకూర వేంకటకవి, సురభిమాధవరాయలు లాంటి బ్రాహ్మణేతర కవులను ఉదాహరించడమేమిటి? పరమ భక్తాగ్రగణ్యుడు, లోక ప్రియుడు అయిన పోతన భాగవతంలోనుండి ఒక్కటంటే ఒక్కపద్యం కూడా ఉదాహరించకపోవడమేమిటి? ఈ ప్రశ్నను వేసుకొని సమన్వయించే ప్రయత్నం చేయడం పరిశోధకుని కర్తవ్యం.

ఆనాటి సామాజిక స్థితిని బట్టి గ్రంథావతారికలో అప్పకవి ఔపచారికంగా చెప్పాడు. గ్రంథంలోపల మాత్రం ఒక శాస్త్రవేత్తగా తన లాక్షణిక దృక్పథానికి అనుగుణ మైన రచనలనే ఉల్లేఖించాడు తప్ప అది అప్రసిద్ధమా? సుప్రసిద్ధమా? బ్రాహ్మణ కృతమా? బ్రాహ్మణేతర కృతమా అన్నది పరిగణించలేదన్న విషయం తేటపడుతుంది. ఈ సమన్వయం అందరికీ నచ్చుతుందా? నచ్చదా అన్నది కాదు సమస్య. పరిశోధకుడు ప్రయత్నం చేశాడా? లేదా అన్నదే సమస్య. ఇది కేవలం ఉదాహరణ కోసం చెప్పిందే.

మన సమాజం రకరకాల సెంటిమెంట్లకు, విశ్వాసాలకు, ... లకు, మానవాతీత విషయాలకు పెట్టింది పేరు. వాటి ప్రభావం

అనివార్యంగా మన మీద ప్రసరిస్తుంది. నమ్మేవాడు గుడ్డిగా నమ్మేస్తాడు. నమ్మనివాడు విపరీతంగా ద్వేషిస్తాడు. పరిశోధకుడు ఈ విపరీతంగా నమ్మడం, విపరీతంగా ద్వేషించడం లాంటి భావవాద ధోరణిలో పడిపోకుండా. మధ్యలో తనదైన దారి వేసుకొని సాగాల్సి ఉంటుంది.

ఒకనవల, ఒకకావ్యం చదువుతున్నప్పుడు అందులో ఇతివృత్తపరమైన సమాచారంతోపాటు సామాజిక ఆధ్యాత్మికాది ఎన్నెన్నో అంశాలుంటాయి. కొన్ని కవి కల్పనలు, ప్రతీకలు, ఉంటాయి. పరిశోధకుడు భౌతిక వాస్తవికాంశాలతోపాటు కళాత్మక సత్యాలను గూడ గుర్తించాలి. కళాత్మక సత్యాలను వాస్తవికాంశాలుగా కూడా భ్రమిస్తూ వాటి సాధ్యాసాధ్యాలను, ఔచిత్యాలను గురించి వ్యాఖ్యానించరాదు.

'వేయి పడగలు'లో పసిరికను మనిషిగా భావిస్తే పప్పులో కాలేస్తాం. రామేశ్వర శాస్త్రి మూడు వర్ణాలకు చెందిన అమ్మాయిలను పెళ్ళాడాడు అనేది కూడా ప్రతీకాత్మకంగా వ్యాఖ్యానించాల్సిందే, తప్ప భౌతికంగా భావించలేం. అయోనిజలు, అగ్ని ప్రవేశాలు, ఒకేసారి రెండు చోట్ల ప్రత్యక్షం కావడాలు, వరప్రసాదాలు లాంటి ఎన్నెన్నో అంశాలు ఉంటాయి. వాటిని గుడ్డిగా ఆరాధించకుండా, దూకుడుగా తిట్టిపోయ కుండా మధ్యేమార్గాన్ని అనుసరించాలి. ఆ విషయాల 'గొప్పతనాన్ని' సూచించడానికి ఇవి జోడింపబడతాయి అన్న గుర్తింపుతో ముందుకు సాగుతూ ప్రధానాంశం మీద దృష్టి కేంద్రీకరించాలి.

సామాజిక పరిణామాల పట్ల, మారుతున్న నూతన రాజకీయ ఆర్థిక దృక్పథాల పట్ల, శాస్త్ర సాంకేతికరంగాల ప్రభావం పట్ల చాలినంత పరిచయం సంపాదించుకోవాలి. అలంకార శాస్త్ర పరిచయం ఆధునిక విమర్శ రీతులేకాకుండా చరిత్ర, ఆంత్రోపాలజీ, సోషియాలజీ లాంటి Interdisciplinary Subjects తోను, ఇతర భాషా సాహిత్యాలతోను పరిచయం సంపాదించుకొని వాటిని అన్వయించుకొని వ్యాఖ్యానించ గలిగితే సిద్ధాంత గ్రంథం బహుళ జనాదరణ పొందే అవకాశం ఉంటుంది. ఇక్కడ చెప్పినవన్నీ ఒక్కడే నేర్చుకుంటే మంచిదే కాని అది సాధ్యపడనప్పుడు వచ్చినవారితో చర్చించి అవసరమైనంతవరకు అవగాహన చేసుకోగల్గాలి.

అంతటా ఉన్నట్లే తెలుగు భాషా సాహిత్యాలకు పరిమాణంతో పాటు పరిణామం కూడా ఉందనీ, ఏ భాషాసాహిత్యకారులకైనా, ఏకాలపు కవులకైనా రాగద్వేషాలు, దృక్పథాలు, నిబద్ధతలు, మొహమాటాలు, అమాయకత్వాలు, విశ్వాసాలు ఉంటాయని పరిశోధకుడు గుర్తించాలి. ఇప్పుడు మనకు కూడా అవన్నీ ఉన్నాయని వాటికతీతులం కామని అంగీకరిస్తూ వర్తమాన సమాజగమనానికి అనువైనవేమిటి? కానివేమిటి? ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచేవి, సమానత్వాన్ని ప్రబోధించేవి ఏమిటి వాటి తీరుతెన్నులెలా ఉన్నాయన్నది పరిశోధకుడు గుర్తించి వ్యాఖ్యానించాలి. వీటిని పరిశోధకులు సత్యాన్వేషణ దృష్టితో రాయాలి.

అడవిబాపిరాజు నవలా సాహిత్యానుశీలనం మీద పరిశోధించి 1991లో నాగార్జున విశ్వవిద్యాలయం ద్వార డాక్టరేటు పొందిన శ్రీ మన్నవ సత్యనారాయణ సిద్ధాంత గ్రంథంలో అడవి బాపిరాజు రచనల్లోని లోపాలను ఎంత నిశితంగా పరిశీలించి పట్టుకున్నారో పరిశోధకులు గమనించాలి.

1. నరుడు నవలలో జెన్నిఫర్ వైద్య కళాశాలలో ప్రవేశించిన కొత్తల్లో విలియమ్స్‌ను గాఢంగా తన పెదవులను ముద్దుపెట్టుకోనిచ్చింది - అన్న వాక్యం ఉన్న తర్వాతి పుటలో అందుకనేగా ఇంతవరకు నిన్ను నా పెదవులను ముట్టనివ్వలేదు. అని కనిపిస్తుంది.
2. గోన గన్నారెడ్డి మిత్రుడు అక్కినను గురించి 'పెళ్ళయి నాలుగేళ్ళయింది' అంటూనే కానున్న భర్తగారు, 'కానున్న మొగుడు వస్తే' అనే వాక్యాలు వస్తాయి.
3. వదిన మరదంద్రయిన రుద్రమదేవి ముమ్మక్కలు తర్వాత తోడికోడళ్ళుగా కనిపిస్తారు.
4. రుద్రమదేవిని అష్టమచక్రవర్తి అని ఒకసారి నవమ చక్రవర్తి అని ఒకసారి వర్ణిస్తారు.
5. 'నరుడు'లో బాపిరాజుగారు దళితులస్థితిగతులను కళ్ళకు కట్టినట్లుగా అద్భుతంగా వర్ణించి కథాభాగాల్లో ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించి నాయికా నాయకుల ప్రణయవర్ణన వైపు వెళ్ళడంతో సంఘసంస్కరణ పరంగా ప్రారంభించిన కథలో క్రమంగా పట్టుసడలిపోయింది.

మన్నవ సత్యనారాయణగారిని పొగడడం నా ఉద్దేశంకాదిక్కడ ఆయన చదవడానికి రాయడానికి అవకాశంలేని ఒక అంధుడు. ప్రతిదానికి ఇతరుల మీద ఆధారపడవలసిన వ్యక్తి (వీరిప్పుడు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు) మరి ఒక ప్రజ్ఞాచక్షువు ఇలా దోషాలను ఉగ్గడించగలిగితే రెండుకళ్ళూ ఉన్న పరిశోధకులు తమపరిశోధనాంశాన్ని మరెంత జాగ్రత్తగాను, నిశితంగాను పరిశీలించవచ్చునో, మరెన్ని విశేషాలను పేర్కొనవచ్చునో ఆలోచించండి. పరిశోధకులకు స్ఫూర్తి, ఉత్తేజం కలగడం కోసమే ఈ ఉదంతాన్ని పేర్కొంటున్నాను.

తన సిద్ధాంతగ్రంథ రచనకు దోహదం చేసే ప్రశ్నలు వేసుకొనే నైపుణ్యం బాగా ఉండాలి. 'రచన' చదువుతూనే Between the lines అన్నట్లు అంతర్గతంగా ఉన్న అంశాన్ని పసిగట్టాలి. ఒక రచయిత జీవితం రచనల మీద చేసే విద్యార్థి ఆ రచయిత పుస్తకాలు మాత్రమే చదువుతానంటే సరిపోదు. ముఖ్యంగా ఆ రచయిత సహాధ్యాయులు, సన్నిహిత రచయితల జీవిత చరిత్రల్లో, జ్ఞాపకాల కూర్పుల్లో ఈ రచయిత వివరాలు ప్రసక్తంగా రావచ్చు. వాటన్నింటిని కూర్చుకొంటే ఎన్నో వివరాలు తెలుస్తాయి. ముఖ్యంగా సమకాలీన రచయిత అయితే అతని వాదాలను వ్యతిరేకిస్తూ వచ్చిన రచనలుంటే వాటిని కచ్చితంగా చదవాలి. ఆ వ్యతిరేకుల అభిప్రాయాలలోని సామంజస్యాలను నిగ్గుదేల్చడం పరిశోధకుని ప్రాథమిక కర్తవ్యం.

వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలు చేసేటప్పుడు మనం ఎవరి రచనలమీద పరిశోధిస్తున్నామో ఆ రచయితకు గిట్టనివారి అభిప్రాయాలను మృదువుగా ప్రస్తావించాలి. ఒక్కోసారి పరిశోధకునకు సన్నిహితుడు కావచ్చు. అతని ఇంట్లో అతిథిగా ఉండి ఈ రచయిత దగ్గరికి వచ్చినా, అతనిని గురించి గొప్పగా ప్రస్తావించినా ఈ రచయిత చిన్న బుచ్చుకోవడమో, మాట్లాడడానికి ఇష్టపడక పోవడమో జరిగే అవకాశం ఉంటుంది.

వీలైనంత వరకు ఇతర వ్యక్తుల ప్రస్తావనలు తేకపోవడమే మంచిది. మనం ఇంటర్వ్యూ చేయడానికి వెళ్ళినప్పుడు ఆ రచయిత అనుమతిని ముందుగా తీసుకొని వెళ్ళాలి. మనం ఏదో హడావుడిలో ట్రెయిన్ టైం

అవుతుందనీ, లాస్ట్‌బస్ కూడా వెళ్ళిపోతుందని, ఆకలి వేస్తుందని ఆరాటపడకుండా సావకాశంగా వెళ్ళాలి. సాధారణంగా వయస్సులో పరిశోధకుడు చిన్న వాడవుతాడు. పరిశోధ్య రచయిత పెద్ద వాడవుతాడు. మనం అడిగిన ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పే స్థితి ఉండదు. గంట గంటన్నరసేపు ఇతరేతరాంశాలు ఎన్నెన్నో ప్రస్తావించి, తనకు ప్రమోషన్ ఇవ్వకుండా తొక్కిపెట్టారనీ, తనకన్నా తక్కువ స్థాయి రచయితలకు ఎన్నో పురస్కారాలు లభించాయనీ చెప్పి అప్పుడు మనం అడిగిన విషయాలలోకి రావచ్చు. వాటన్నింటిని ఓపిగ్గా భరిస్తు ఇతరాంశాల నుండి మళ్ళిస్తూ మనం జవాబులు నేర్పుగా రాబట్టుకోవాలి.

జానపదాల క్షేత్రపర్యటన చేస్తున్నప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక రాజకీయాలతో సంబంధం పెట్టుకోరాదు. మతాచారాలను విమర్శించకూడదు. తీవ్రవాద ఉద్యమాలకు నెలవైన చోట్లకు వెళ్ళినప్పుడు మన జాగ్రత్తలో మనం ఉండాలి. స్థానికంగా ఉండే ప్రముఖులతో పరిచయాలు పెంచుకోవాలి.

మనం పరిశోధిస్తున్న అంశాన్ని, రచయితల కృతుల్ని ఆకాశానికి ఎత్తాల్సిన పనిలేదు. పాతాళానికి తొక్కాల్సిన పనిలేదు అసలు ఆకాశానికి ఎత్తడం పాతాళానికి తొక్కడం అనేది పరిశోధకుని వ్యవహారం కానేకాదు. దాన్ని విశ్లేషించి బాగోగులు చర్చించడమే పని. అందులో మనం ప్రదర్శించిన నిశితత్వానికి, వివేచనాశీలానికి అన్వయసామర్థ్యానికి ప్రశంసలు దక్కుతాయి.

# 5

# పరిశోధనాంశ నిర్ణయం

ఇక అసలైన విషయం పరిశోధనాంశ నిర్ణయం. ఇది కీలకమైన ఘట్టం. పరిశోధకుల జయాపజయాలకు, కీర్తిప్రతిష్ఠలకు దోహదం చేసేది ఈ ఘట్టమే. మంచి అంశం పరిశోధనకు స్ఫురించడం, చేయగలగడం అదృష్టవిశేషం. కొందరు సాహిత్యాభి నివేశం ఉన్న విద్యార్థులు తమ అభిరుచిమేరకు అంశాన్ని ఎన్నుకోగలరు. ఎం.ఫిల్‌లో చేరిన చాలా మంది విద్యార్థులు సొంతంగా పరిశోధనాంశం నిర్ణయించుకోలేని స్థితిలో ఉంటారు. తమ అభిరుచి, ఇష్టానిష్టాలు శక్తిసామర్థ్యాల మీద సరియైన అవగాహన వారికింకా ఏర్పడి ఉండదు. ఏమేమి పరిశోధనలు జరిగాయో చూడడానికి కూడా ఆ విద్యార్థులకు తగిన సూచికలు కూడా అందుబాటులో ఉండవు. వాటికోసం ఎంతో శ్రమపడాలి. ఇతర విశ్వవిద్యాలయాలమాట దేవుడెరుగు. కనీసం తాము చేరిన విశ్వవిద్యాలయంలో జరిగిన పరిశోధన వివరాలు సైతం విద్యార్థులకు అందుబాటులో ఉండవు. అప్పుడు విద్యార్థులు వెళ్ళి ఉపాధ్యాయులను అడుగుతారు. అధ్యాపకులెన్నో పరిశోధనాంశాలను రాసిపోసుకొని వీరికోసమే కాచుకొని కూర్చున్నట్లు విద్యార్థి భావిస్తాడు. అయితే ఎంతమంది పర్యవేక్షకుల వద్ద తమ విశ్వవిద్యాలయంలో జరిగిన పరిశోధన

వివరాలు అందుబాటులో ఉన్నాయన్నదీ ప్రశ్నార్థకమే. ఇప్పుడిప్పుడు కొన్ని విశ్వవిద్యాలయాలు పరిశోధన వివరాలతో 'కరదీపికలు' (Hand Books) ప్రకటిస్తుండడం సంతోషదాయకం. మార్గదర్శకులకు ఈ విద్యార్థి ఇష్టానిష్టాలమీద, శక్తి సామర్థ్యాలమీద దృష్టి ఒక్కోసారి ఉంటుంది. కొత్త వారయితే అది ఉండదు.

పైగా ఆ వచ్చి అడుగుతున్న విద్యార్థి **ఈజీగా అయ్యేది చెప్పండి సార్** అని ముందే కండీషన్ పెడుతున్నాడు. అలా సులభంగా అయిపోతుందన్న భ్రమ కొద్ది నవలలు, జానపదాంశాల మీద పడుతున్నారు. రెండు మూడు పరిశోధనాంశాలు అనుకొని వచ్చి ఉపాధ్యాయుని సంప్రదిస్తే వాటిలో ఉండే సాధక బాధకాలు చర్చించవచ్చు. ఏదైనా విషయం చెప్తే ఆ పరిశోధకుని ఆర్థిక **బౌద్ధిక శక్తియుక్తులకు మించింది కావచ్చు. అవసరమైన పుస్తకాలు దొరుకుతాయో** లేదో తెలియదు. ఆదర్శం కోసం పరిశోధనాంశాలు చెప్పబడవు. మీ అంతకు మీరే ఎన్నుకోవాలి- అని విద్యార్థులనంటే వారు దిక్కులేనివారవుతారు. లేదా ఏదో ఒకటి తీసుకుంటారు. ఎం.ఫిల్‌లో చేరిన విద్యార్థికి తోచకపోతే ఇతరులెవరూ చెప్పకపోతే అతడి గతి ఏమిటో ఆలోచించండి. దాదాపు ఐదువేల పరిశోధనాంశాలు వచ్చాక ఇంకా కొత్త అంశం మీద చేయాలంటే ఏముంటాయి? మళ్ళీ ఏదో ఒకటి అటూ ఇటూ చేసి ఇవ్వాల్సిందే! అందుకోసం ఇలా అడిగే విద్యార్థులకు గురువులు తమ అభిరుచిమేరకు అంశాలు చెబుతారు. ఆధునికాన్నైతే తమ గురువుల, మిత్రుల రచనలగురించి, తమ 'పార్టీ' వారిని గురించి చేయిస్తారు. ఇది తప్పని కాదు.

'ఆధునిక సాహిత్యం గురించిన పరిశోధనను మా ముందు తరం పెద్దలు నిరాకరించటం చేత మేము కాస్త ముందుకు వచ్చిన తరువాత దాన్ని అంగీకరించాం. అప్పటి నుండి ఆధునిక సాహిత్య విషయ పరిశోధన శరవేగాన్ని అందుకొని దూసుకొనిపోతున్నది. ఈ గాలివేగం ఎంతదాకా పోయినదంటే మా తరువాతి తరం వాళ్ళు వచ్చి మరి మా సాహిత్యం మీద రిసర్చి చేయించి కాస్త పుణ్యం కట్టుకోరాదా అనేదాక పోయింది. ఆ పని జరుగుతున్నది

కూడా. ఈ పని మంచిది కాదయ్యా అని చెప్పి నిలబడగల స్థితిలో కూడా మనం లేం. **తెలుగులో పుస్తకం రాస్తే చాలు దానిమీద యూనివర్సిటీలో తెలుగు డిపార్టుమెంటులో పరిశోధన చెయ్యవచ్చు - అన్న అభిప్రాయం రూఢిపడడానికి మన దోహదం ఎంత ఉన్నదో మనకు తెలుసు. ఆధునిక సాహిత్యంలో పరిశోధన అనే మాటకు అర్థం మన చేతులు దాటిపోతున్నది. మన సాహిత్యం మీద మనమే పరిశోధన కూడా చేయించుకొని కళ్లారా చూసుకొని ఆనందించిపోవటం మంచిదన్న అభిప్రాయం గల వాతావరణంలో మనమున్నాం.'**[1] అని తెలిముంగురులు సవరించుకొంటూ రెండున్నర దశాబ్దాల కిందట కేతవరపు రామకోటి శాస్త్రిగారు చెప్పిన మాటలు ఇంకా నా చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి. పరిశోధన స్థిరంగా ప్రారంభమైన 1961 నుండి 1987 దాకా ఎన్ని జరిగాయో తర్వాతి పదేళ్ళలో అన్ని జరిగాయన్నది లెక్కలే చెబుతున్నాయి. ఆ తర్వాత పదిపదిహేనేళ్ళలో మరీ రెట్టింపయ్యాయి. శాస్త్రిగారి అభిప్రాయాన్ని ఖండించగలిగే స్థితిలో లేమన్నదీ? ఏమీ చేయలేమన్నదీ అనుభవంలో ఎదురవుతున్న అంశమే. ఒక మహాకవి రచనా ధోరణుల మీద ఒక రెండు, మూడు పిహెచ్.డీలు వస్తే ఔచిత్యం. కాని ప్రతికవితా సంకలనం మీద ఎం.ఫిల్ చేయించాలని పూనుకుంటే రెండు మూడేళ్ళలోనే ఒకే కవితా సంకలనాన్ని భాగాలు చేసి ఇద్దరికి కేటాయించాల్సి వస్తుంది. భవిష్యత్తులో డాక్టరేట్ గ్రంథాలే పరిశోధ కాంశాలుగా పరిణమిస్తాయేమో! కేవలం చదివి వదిలిపెట్టాల్సిన ఔత్సాహిక కవితా సంకలనాల మీద, నవలల మీద, అతి మామూలు అంశాల మీద ఎం.ఫిల్స్, పిహెచ్.డీలు చేయించవలసిన స్థితి ఏర్పడటానికి కారణం పరిశోధకులు సులువుగా దాటిపోవాలనుకోవడం, పర్యవేక్షకులకు సీరియస్‌నెస్ లేకపోవడం, అనివార్యంగా పిహెచ్.డీలు, ఎం.ఫిల్స్ చేయించాల్సి రావడం. చేసిన వాటిమీదనే చేస్తుండడానికి సైతం ఇదే మూలం. చేయవలసిన అంశాలను

1. తెలుగు సాహిత్య పరిశోధన: దృక్పథం- విధానం - 'తెలుగు' ద్విదశాబ్ది ఉత్సవ ప్రత్యేక సంచిక (1988) తెలుగు అకాడమి.

**వదిలి పెట్టడంలోని అంతర్యం కూడా ఇదే. అట్లాగే ఒక మూడు నాలుగేళ్ళపాటు ఎం.ఫిల్., పిహెచ్.డి ప్రవేశాలకు విరామమిచ్చే స్వేచ్ఛ సంస్థలకు, శాఖలకు లేకపోవడం మరో ప్రధాన కారణం.**

కేవలం డిగ్రీ పొంది బయటపడదామనుకునే వానికీ; ఏదో ఒకటి కొత్తది చెప్పి కీర్తి ప్రతిష్ఠలు పొందాలనుకునేవాడికి; నలుగురిలో తనదైన గుర్తింపు పొందాలనుకునే వాడికీ ఎంతో అంతరముంటుంది. కీర్తి ప్రతిష్ఠలు, గుర్తింపు పొందాలనుకొనేవాడు పరిశోధనాంశ నిర్ణయం– విషయ సేకరణ–విశ్లేషణ–రచన పట్ల ఎంతో జాగురూకత, మెలుకువ వహించక తప్పదు. కొత్త దారులు తొక్కక తప్పదు. పరిశ్రమ శీలాన్ని పెంపొందించుకోక తప్పదు.

**ప్రసిద్ధ రచనలను పరిశోధనాంశాలుగా స్వీకరిస్తే వాటిమీద పూర్వ** పరిశోధకుల కన్నా కొత్తగా చెప్పేదేముండకపోవచ్చు. అటువంటప్పుడు వాటిని తీసుకోవడమే అనవసరం. అయితే పూర్వపరిశోధకుల అభిప్రాయాలను ఖండిస్తూ నూతన ప్రతిపాదనలు చేయగల అవకాశం, పునర్మూల్యాంకనం చేయగలిగే ప్రతిభ ఉంటే పరిశోధకుడు దూసుకొని పోవచ్చు. దానితో తమకు తాము పేరు తెచ్చుకోవడమే కాకుండా సాహితీ లోకానికి సరికొత్త ఆలోచనలను విశ్లేషణను అందించిన వారవుతారు.

అట్లాగే ప్రతి ఇరవై ముప్పై ఏళ్ళకు సాహిత్యాన్ని పరిశీలించే ధోరణి మారుతుంది. మనకే తెలియకుండా ఆ ధోరణి మనలో ప్రవేశిస్తుంది. సమాజంలో తలెత్తే ఉద్యమాలు, అవి అందించే నూతన భావజాలాలు, మారిన పరిస్థితులు, మారిన వాతావరణం ఈ నూతన మార్పునకు దోహదం కావచ్చు. పూర్వ పరిశోధకులు మహాభారతంలో రసం, ధ్వని, ఛందస్సు, కావ్యశిల్పం, సామాజిక కోణం, తత్త్వదర్శనం పరిశీలిస్తే నేటి పరిశోధకులు దళిత దృక్పథం, స్త్రీవాద దృక్పథం నుండి పరిశీలించవచ్చునేమో!

ప్రాచీన కావ్యాలలోని కవితాత్మకత, సాహిత్యత్వాన్ని వదిలిపెట్టి కేవలం ధార్మిక సాంఘిక, మానసిక అంశాలను మాత్రమే పేర్కొంటూ మరో పుస్తకం రాయవలసిన అవసరం ఉందేమో!

ఎవ్వరూ స్పృశించని అంశాన్ని గ్రహిస్తే తాము చెప్పిందే మొదటి మాట అవుతుంది. తర్వాత మాట్లాడేవారు విభేదించడానికైనా, ఏకీభవించడానికైనా ఇతడినే స్మరించకతప్పదు. దీని వల్ల పరిశోధకుడికి కీర్తి రావడం జరుగుతుంది. అయితే ఇన్ని సిద్ధాంత గ్రంథాలు వచ్చాక ఎవ్వరూ స్పృశించని అంశాన్ని దొరికించుకోగలగడం కష్టసాధ్యం. అలాగని అసాధ్యం మాత్రం కాదు. చేయవలసిన అంశాలు ఎన్నెన్నో ఉన్నాయి. పరిశోధన అక్షయపాత్ర అలా మంచిది లభిస్తే పరిశోధకుడి అదృష్టం.

మనకు ఒక నిశ్చితాభిప్రాయం లేకుండా ఏదో ఒకటి రెండురోజుల్లో పిహెచ్.డి ప్రకటన కాలవ్యవధి ముగుస్తుందని వారిని వీరిని అడిగి ఏదో ఒకటి రాసేస్తే సరిపోతుందనుకొంటే అది మన మెడకు చుట్టుకుంటుంది. ఇలాంటి వారి సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతుండడం శోచనీయం. ఫలానా అబ్బాయి/అమ్మాయి ఉన్నాడు/ఉంది. పెళ్ళి చేసుకోవచ్చు అని ఎవరైనా సూచిస్తే - సూచించిన పాపానికి జీవితాంతం కలిగే లాభనష్టాలకు వారే బాధ్యులు అంటే ఎలా కుదురుతుంది? పరిశోధనాంశాన్ని సూచించిన వ్యక్తియే సమాచారం అందించాలని; అసలు అతనే రాసిపెడ్తే మరీ మంచిదని భావించడం తగదు. పరిశోధకుడే తన సిద్ధాంతగ్రంథ రచన బాగోగులకు బాధ్యత వహించాలి.

పిలకా గణపతిశాస్త్రి 'విశాలనేత్రాలు' నవలను ఎం.ఫిల్‌కు సూచిస్తే ఆ విద్యార్థి అంగీకరించి పుస్తకం దొరికించుకోలేక విరమించుకున్నాడు. నిజంగా పుస్తకం దొరకలేదా? ఎలా దొరికించుకోవాలో ఆ మార్గంలో ప్రయత్నం చేయలేదా? అని ప్రశ్నించుకుంటే రెండోదే నిజమనిపిస్తుంది. 1896లో మూడు వందల ప్రతులు మాత్రమే ముద్రితమైన కేతన 'విజ్ఞానేశ్వరీయం' వరంగల్ లైబ్రరీలో పాతపుస్తకాల కట్టలో దొరికింది. జిరాక్స్, ఇంటర్‌నెట్ లాంటి సౌకర్యాలు వచ్చాక పుస్తకాలు అలభ్యం అనకూడదేమో!

పరిశోధనాంశాన్ని నిర్ణయించుకోవడంలోని సాధకబాధకాలను బేరీజువేసు కోవడానికి నెలరోజుల పాటయినా కృషిచేయాలి. ఏదో ఫోను

చేసి, మేం ఫోను చేయడమే గొప్ప. మీరు టాపిక్ చెప్పాలి అని నిర్బంధించకూడదు. అవతలి వ్యక్తి ఏ స్థితిలో ఉన్నాడు? ప్రయాణాల్లోనో, హడావుడిలోనో మరో ముఖ్యమైన పనిలో ఉండవచ్చు. సావకాశంగా కూర్చొని చర్చించుకోగలగాలి. ఒక అమ్మాయి ఫోనులో ఇలాగే అడిగితే **తెలుగుభాషపై ప్రాకృత భాషాప్రభావం** అని చెప్పాను. 'బాగుంది బాగుంది' అని మురిసిపోయింది. రెండు రోజుల తర్వాత ఆ అమ్మాయి తటస్థపడి ప్రస్తావిస్తే నేనెవరికి ఆ అంశాన్ని చెప్పానో అర్థమైంది. తెలుగుభాషపై ప్రాకృత ప్రభావం అన్నా ప్రాకృతభాషపై తెలుగు ప్రభావం అన్నా రెండూ సమానమే ఆ అమ్మాయికి. ఈ అంశం చాలా గొప్పది అవశ్యం, చేయవలసిందే. నిజానికి తెలుగుభాష పూర్తి ద్రావిడభాషాకుటుంబానికి చెందింది కాకపోవచ్చు. ఒకానొక ప్రాకృతభాష ఒకానొక ద్రావిడభాష కలిసి నేటి తెలుగుగా పరిణమించి ఉండవచ్చు.(భద్రిరాజువారు అస్తమించారు కనుక ఇంకేమయినా మాట్లాడుకోవచ్చు). ఈ అంశం మీద చేసే విద్యార్థికి మొట్టమొదట ఇంగ్లీషు రావాలి. పుస్తకాలు, విశ్లేషణలు ఇంగ్లీషులోనే లభిస్తాయి కనుక. ఆ తర్వాత సంస్కృతం రావాలి. ప్రాకృతం రావాలి. భాషాశాస్త్రంలో ప్రవేశం ఉండాలి. ప్రాచీనాంధ్ర సాహిత్యాభినివేశం ఎంతో అవసరం. పైగా ఇది మూడు నాలుగేళ్ళలో తెమలే వ్యవహారం కాదు. మరి ఈ లక్షణాలేవీ లేని విద్యార్థులు ఆ అంశానికి ఎలా న్యాయం చేకూర్చగలరు?

'అష్టాదశ పురాణాల్లో సంగీతం' అని పెట్టుకోవడం బాగుండవచ్చు. చివరికి అష్టాదశ పురాణాల్లో సంగీత ప్రస్తావన లేదు కనుక నేను సిద్ధాంత గ్రంథ రచన చేయడం లేదని తేల్చేస్తే డిగ్రీ రాదు.

'తెలుగు సాహిత్యంలో జీవపరిణామ సిద్ధాంతం' అని అంటే ఇదేదో గంభీరంగా మహత్తరంగా ఉన్నట్లనిపిస్తుంది కాని అంతా వట్టిదే. పరిశోధకుడు కాని పర్యవేక్షకుడుకాని శీర్షికావ్యామోహంలో పడిపోకూడదని హెచ్చరించడానికే ఇది చెప్తున్నది. (రాయగలిగితే దీన్ని కూడ ప్రయత్నించవచ్చునేమో, అది వేరే సంగతి)

పరిశోధనాంశ నిర్ణయంలో సాధ్యాసాధ్యాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. 'ఆంధ్రప్రదేశ్‌లో తాళపత్ర గ్రంథాలు - స్థితిగతులు' అని నిర్ణయించుకుంటే 23 జిల్లాలు తిరగగలరా? తాళపత్ర గ్రంథాలు సేకరణ సాధ్యమా? ప్రచురిత గ్రంథాలే చదవడానికి అవకాశంలేని కాలంలో ఎన్ని తాళపత్ర గ్రంథాలు చదవగలరు? వాటి మీద నోట్స్ ఎలా రాసుకోగలరు? 'భారతీయ భాషల్లో దళిత చిత్రణ పరిణామవికాసాలు' అనే అంశానికి మార్కెట్ వ్యాల్యూ ఉండవచ్చు. కానీ శక్తిసామర్థ్యాలు, కాలం, భిన్న భాషల పరిచయం వగైరాలన్ని గమనించుకోవద్దా? అట్లాగే 'బిజినేపల్లి మండలం దళిత కథారచయిత్రులు' అని శీర్షిక నిర్ణయించుకొంటే వరుసగా ప్రాంత, వర్గ, ప్రక్రియ, లింగ పరిమితులకు లోనైపోయి పరిశోధనాంశం మరీ చిన్నది కావచ్చు. అంతేగాదు చాలినంత సమాచారం లభించకపోయే ప్రమాదముంటుంది.

పరిమిత పరిధిలో సాగేది ఎం.ఫిల్. విస్తృత పరిధిలో సాగేది పిహెచ్.డి మరింత విస్తృతపరిధిలో ఇద్దరు ముగ్గురు వ్యక్తుల ప్రత్యక్ష ప్రమేయంతో సాగేది ప్రాజెక్ట్. ఈ భేదాలను పరిశోధనాంశాన్ని నిర్ణయించే వేళ పరిగణనలోకి తీసుకోవాలి.

భావజాలాల విషయంలో తీవ్రధోరణి, పట్టింపు బాగా ఉండే విద్యార్థులు తమ భావజాలాలకు అనుగుణమైన వాటిని పరిశోధనాంశాలుగా గ్రహిస్తే మంచి సిద్ధాంత గ్రంథాలు రాయగలరు. సమాజానికి మేలు చేయగలరు. అతి విప్లవకారుడైన నాస్తికుడైన విద్యార్థికి 'శ్రీనాథుని కావ్యాల్లో శాంభవీదీక్ష' 'కనపర్తి అబ్బయామాత్యుని అనిరుద్ధ చరిత్రలో శ్రీవిద్యా సంప్రదాయం' అని పరిశోధనాంశంగా కేటాయించినా, సాంప్రదాయిక మితవాద ధోరణి ఉన్న సజ్జనుడికి 'శ్రీకాకుళోద్యమసాహిత్యం' లాంటివి కేటాయించినా న్యాయం జరగదు. చేసేపని, మనస్సు, ఆలోచనలు అన్ని ఏకత్రితమైనప్పుడే ఏదైనా సఫలమవుతుంది. గైడ్ చెప్పాడు కనుక నేనప్పుడేదో రాశాను అంతే అని చెప్పుకోవాల్సిన అవసరం ఉండదు.

'ఆదివాసీల సంస్కృతి', 'దక్కలి వారి వివాహాచారాలు' లాంటి అంశాలకు బయటి వారు న్యాయం చేయలేని స్థితి ఏర్పడవచ్చు. ఆహారపుటలవాట్లు, జీవన సరళి కారణంగా వీరు వారితో కలిసి పోకపోవచ్చు. వారు వీరిని విశ్వసించకపోవచ్చు. తద్వార పరిశోధన మొక్కుబడి వ్యవహారం కానచ్చు.

అతిగా ధన వ్యయమయ్యే అంశాలు కూడా పరిశోధనను మందగింపజేస్తాయి. 'ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీల గేయాలు' అంటే నిజంగా చేసే వ్యక్తి ఎన్ని జిల్లాలు తిరగాలి? ఎన్ని గేయాలు సేకరించాలి? ఎంత ఖర్చు అవుతుంది?

మొత్తం మీద తన అభిరుచికి నచ్చింది, మరీ పెద్దది, మరీ చిన్నది కాకుండా మన ఆర్థిక బౌద్ధిక శక్తిసామర్థ్యాలకు మించనిది, మెళకువతో స్వీయ పరిశోధనకు స్వీకరించాలి. స్వీకరించిన తర్వాతి మాత్రం వెనుకంజవేయకూడదు. పానీయంబుల తాగుచున్, కుడుచుచున్, హాసలీలా నిద్రాదులలో అన్నట్లుగా పరిశోధనతో మమేకం చెందిననాడు ప్రహ్లాదకరమైన సిద్ధాంతగ్రంథం వెలువడగలదు. పరిశోధకుడికి పర్యవేక్షకుడికి, పరీక్షకుడికి, పాఠకునికి, అందరికీ సంతృప్తి కలుగుతుంది.

పట్టు పట్టరాదు పట్టివిడవరాదు
పట్టెనేని బిగియబట్టవలయు
పట్టి విడుటకన్న బరగ జచ్చుట మేలు
విశ్వదాభిరామ వినురవేమ.

# 6

# నూతన పరిశోధనాంశాలు

ఈ పుస్తకం తొలి మలి ముద్రణల్లో కొన్ని నూతనాంశాలను పేర్కొన్నాను. ఇంచుమించుగా ఈ పదేళ్ళ కాలంలో అవన్నీ ఎక్కడో ఒకచోట పరిశోధనాంశాలుగా స్వీకరించబడ్డాయి. పర్యవేక్షకులు కొందరు వ్యక్తిగత స్థాయిలో ఎన్నో పరిశోధనాంశాలు వ్రాసిపెట్టుకొని అవకాశం వచ్చినప్పుడు; తగిన విద్యార్థులు దొరికినప్పుడు చేయిస్తున్నారు కూడా. కొన్ని పరిశోధనాంశాలకు విద్యార్థులు సరియైన న్యాయం చేయగలరా లేదా అని పర్యవేక్షకులు సంశయిస్తున్నారు కూడా.

మొదటి తరం సిద్ధాంత గ్రంథాల్లో ప్రస్తావనగా చెప్పిన అంశాలను గాఢంగా అధ్యయనం చేయడానికి ప్రత్యేక పరిశోధనాంశాలుగా ఎన్నుకొనవచ్చు. బి. రామరాజు, ఎస్.వి. జోగారావు, సి. నారాయణ రెడ్డి, ఎం. కులశేఖరరావు, వి. సీతాకళ్యాణి, పల్లాదుర్గయ్య, ఎస్.వి. రామారావు, బి.వి. కుటుంబరావు, కొలకలూరి ఇనాక్‌గార్ల సిద్ధాంత గ్రంథాల్లోని అధ్యాయాలు, ఉపశీర్షికలు ప్రత్యేక సిద్ధాంత గ్రంథాలుగా రూపుదిద్దుకొన్నాయి.

ఒక అంశాన్ని చూసి మరికొన్ని అంశాలను పుట్టించవచ్చు. 'నన్నయభారతంలో ఉపమ' పరిశోధనాంశమైతే తిక్కన, శ్రీనాథ పోతన కృతుల్లో ఉపమ/రూపకం/ ఉత్ప్రేక్ష పరిశోధనాంశాలుగా గ్రహించవచ్చు.

గ్రామనామాల మీద, జానపదగేయాల మీద 'మండలాల' వారీగా ఎం.ఫిల్ వ్యాసాలు వచ్చినట్లు ఆ విభాగాలు పరిశీలిస్తే తెలుస్తుంది. అలా అయితే ఆంధ్రప్రదేశ్‌లో 1104 మండలాలు ఉన్నాయి. కనుక గ్రామనామాల మీద 1104 ఎం.ఫిల్ వ్యాసాలు, జానపద గేయాల మీద 1104 ఎంఫిల్ వ్యాసాలు వచ్చే పరిస్థితులు ఏర్పడబోతున్నాయి. అట్లాగే ఒక మండలానికి చెందిన పరిశోధన ఎం.ఫిల్ అయితే ఐదేసి మండలాలకు ఒక పిహెచ్‌డి చొ॥న అనుకొంటే గ్రామనామాల మీద మరో 221 పిహెచ్.డి సిద్ధాంత గ్రంథాలు, జానపద గేయాల సేకరణ పరిశీలన పేరుతో మరో 221 డాక్టరేట్ గ్రంథాలు వచ్చే యాభై ఏళ్ళలో వస్తాయేమో! ఇవి కొంతమందికి డిగ్రీల నివ్వడానికి తోడ్పడతాయి. అంతే! భిన్న భిన్న మండలాల, భిన్న భిన్న ప్రాంతాల జానపద గేయ పరిశీలనాత్మక సిద్ధాంత గ్రంథాల్లో సమానంగా కనిపించే జానపద గేయాలని గురించి పరిశోధించవచ్చుననీ; అవి క్షేత్ర పర్యటనల్లో లభించినవి కాక ఏ రామరాజో, ఏ నేదునూరి గంగాధరం సేకరణల్లోనో దొరికినవే అంటూ నిరూపించే మరో సిద్ధాంత గ్రంథం రాసి డాక్టరేట్ పొందమని నేను సలహా ఇవ్వడం లేదు. చేస్తామంటే వద్దనేదీ లేదు.

'జానపద సాహిత్యంలో హాస్యం' శీర్షికతో ఒక్క సిద్ధాంత గ్రంథం కూడా రాకపోవడం పరిశోధకులను నవ్వులపాలు చేసే సంగతే. అయినా చాలా గ్రంథాల్లో ఉపశీర్షికగా హాస్యం కనిపించి కొంతలో కొంత తృప్తి నిస్తుంది. 'బావామరదళ్ళపాటలు, వదిన మరదళ్ళ పాటలు, నలుగుల పాటలు, నాగవల్లి పాటలు, తలుపు దగ్గరి పాటలు వియ్యపురాలి పాటలు, అలక పాన్పు పాటలు, నీలాటి రేవులో పరాచికాల పాటలు' మొదలైన ఎన్నో హాస్యపు పాటలు దొరుకుతాయి. స్థానిక పెత్తందార్లను, దుర్మార్గులను రాజకీయ నాయకులను, దూషిస్తూ హేళన చేస్తు కూడా జానపద గేయాలు వచ్చే అవకాశం ఉంది. ఇంతవరకు వచ్చిన పరిశోధన గ్రంథాలనుండి, క్షేత్రపర్యటనల నుండి హాస్య గేయాలను సేకరిస్తే మంచి సిద్ధాంత గ్రంథం వచ్చే అవకాశం ఉంది.

ప్రాచీనాంధ్ర సాహిత్యంలోనైనా, ఆధునికాంధ్ర సాహిత్యంలోనైనా హాస్యానికి చివరిమెట్టే లభించింది. అలా కాకుండా పూర్తి హాస్యరచనలుగా పేరుపెట్టుకొని వచ్చిన గణపతి, బారిష్టర్ పార్వతీశం లాంటి నవలలు, మునిమాణిక్యం, ముళ్ళపూడి లాంటి వారి రచనలు పరిశీలనకు నోచుకున్నాయి. 'ప్రాచీన సాహిత్యం - హాస్యరసోత్పాదనం' మీద ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధన జరిగింది. ఆధునికాంధ్ర కవిత్వంలో హాస్యం, నాటకాల్లో హాస్యం, కథల్లో హాస్యం, నవలల్లో హాస్యం, (హాస్యనవలలు కావు) ఇత్యాదిగా ఎందుకు పరిశోధన చేయరో అర్థం కాదు. హాస్య రస ప్రియత్వం కొరవడిందేమో! పరిశోధనను హాస్యప్రాయం చేయడం కన్నా హాస్యం మీద పరిశోధన చేయడం మిన్నగదా!

పానుగంటి సాక్షివ్యాసాలకు పేరు ప్రఖ్యాతులు లభించాయి. ముదిగొండ వీరభద్ర శాస్త్రి గారు పానుగంటి సాహిత్య సృష్టిని ఎంతో గొప్పగా విశ్లేషించారు. మరి పానుగంటి సాక్షివ్యాసాల ప్రభావంతో వెలువడిన ఇతర రచనల మాటేమిటి? ముఖ్యంగా వప్పూరు రామాచార్యుల (జ. 8-11-1886, మ. 21-3-1972) వదరుబోతువ్యాసాలు గ్రంథరూపంలో వచ్చాయో లేదో తెలియదు. వారే సాధన, స్రవంతి, పినాకిని పత్రికలు నడిపారట. ఆయన రచనలన్నీ సేకరించడానికి పూనుకొంటే పెద్ద కష్టం కాకపోవచ్చు.

తొలితరం వ్యాసశైలీ నిర్మాతలలో నడికుదుటి వీరరాజు (1871-1937)గారొకరు. గ్రంథవిమర్శన; శాసన పరిశోధన వ్యాసాలు ఎన్నో రాశారు. శివ విష్ణు బ్రహ్మ వామనాదిపురాణాలను వచనంలో రాశారు. అవాల్మీకాలైన అద్భుతేతివృత్తాలతో 'విభ్రమతరంగిణి' పేరుతో రామకథ రాశారు. (దీనిని తన కూతుళ్లకు అంకితమివ్వడం విశేషం) చింతలపూడి ఎల్లన రాధామాధవం, విష్ణుమాయానాటకం, ఈదురుపల్లి భవానీ శంకరకవి ధర్మఖండం లాంటి కావ్యాలను నడికుదుటి వీరరాజు గారు పరిష్కరించారు. మరి ఈ మహానుభావుడి మీద పరిశోధకుల దృష్టి ఇంతవరకు ప్రసరించలేదు.

అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు చండశాసనులైన విమర్శ కాగ్రేసరులు. సంస్కృతాంధ్రాంగ్లాల్లో, తర్కమీమాంస వ్యాకరణాల్లో గొప్ప పండితులు. కథలు, నవలలు నాటకాలు రాశారు. విమర్శలు చేశారు. ఆయన భావకవిత్వాన్ని విశ్లేషించిన పద్ధతులు; పలనాటి వీరచరిత్ర కర్తృత్వ కావ్యతత్త్వ విశదీకరణ విధానాలు; షేక్స్పియర్ నాటకకథల అనువాదంలో ప్రతిబింబించిన తెనుగుదనం; 'వాఙ్మయదర్శనం' సూత్రాలు ఆలంబనగా చేసుకొని పరిశోధించవచ్చు. 'నాటికాలపు కవిత్వం' మీద ఆయన చేసిన అరోపణలు, దోషోద్ఘాటనలు, 'నేటికాలపు కవిత్వం'లో ఏమేరకు ఉన్నాయో పరిశీలించవచ్చు.

ఒకవైపు డిప్యూటీకలెక్టర్‌గా ఉద్యోగధర్మం నిర్వహిస్తూనే 1200 శాసనాలను పరిశోధించి వాటి విశేషాలను వెల్లడించిన మహనీయుడు జయంతిరామయ్యపంతులు. ఆస్థాన కవుల వాగ్వివాదాలకే తీర్పు చెప్పగలిగిన ధీశాలి. రాయవాచకం, కవిజనాశ్రయం, విప్రనారాయణ చరిత్ర లాంటి రచనలను పరిష్కరించారు. సమగ్ర నిఘంటు నిర్మాణానికి పాదులు వేశారు. గిడుగువారి వ్యావహారికభాషను వ్యతిరేకించిన గ్రాంథిక భాషావాది అని ఆయనను కొట్టి పారవేయకుండా ఒక విశ్లేషణ చేయవచ్చు. వారు గ్రాంథిక భాష అన్న దానికి ఒక స్థిరరూపం దాల్చిన ప్రమాణ భాష అని అర్థ చెప్పుకొని వారి వాదాన్ని ఇప్పటి భాషాస్థితిగతులతో పోల్చవచ్చును.

అసలు జయంతిరామయ్య పంతులు, కొక్కొండ వెంకటరత్నం ఇలాగ సమకాలీన సమాజ ధోరణులకు పూర్తిగా భిన్నంగా వ్యవహరించినవారు సంస్కర్తలుగా నీరాజనాలందుకుంటున్న వారికన్నా తక్కువ స్థాయి వారేమీ కారు. కాకుంటే కొత్త వ్యవస్థ ఏవిధంగా ఉంటుందోనని భయపడి ఉంటారు. కాలగమనం ఎవరికోసం ఆగేది కాదు. అపేదీ కాదు. 'ఆధునికత్వం స్థిరమైన' ఇన్నేళ్ళ తర్వాత భాషపట్ల వారి భయాందోళనలు, వారు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఏమేరకు ఏ ఏ రూపాలు దాల్చాయో విశ్లేషించడానికి వీలుంటుందేమో ఆలోచించండి. అంతేగాక రాబోయే నూరేళ్ళలో

స్నాతకోత్తరస్థాయి (మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్) విద్యార్థులు; పిహెచ్.డి (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) పండితులు పుట్టెడు తప్పుల తడకలతో పరీక్షా పత్రాలను; సిద్ధాంత గ్రంథాలను రాస్తారనీ; దీనికి ఎంతో ఆదర్శంతో ఉద్యమిస్తున్న గిడుగు వారి వ్యావహారిక భాషావాదమే పరోక్ష కారణమవుతుందనీ, ప్రస్తుతానికి తమను నిందించినా ఒక స్థిరమైన ప్రామాణికమైన భాష కోసం పోరాటం చేయడం కర్తవ్యమని ఆ మహానుభావులు తలపోశారేమో!

మన పూర్వ గ్రంథపరిష్కర్తలు అమేయమైన ప్రతిభాసంపన్నులు, వ్యుత్పన్నశీలురు సాహిత్యైక జీవనులు అని వారికి దండం పెడ్తూనే వాదం కోసమో, అశక్తత వల్లనో, ఆధునికకాలానికి సరిపడవనో కావ్యపరిష్కరణవేళలో చేసిన పాఠాంతరాల కూట సృష్టులను పరిశీలించవచ్చు. ప్రచురితగ్రంథాలను తంజావూరు మదరాసు గ్రంథాలయాల్లో నున్న తాళపత్రగ్రంథాలతో పోల్చి చూడవచ్చు. అయితే ఇది ఊరికే చెప్పుకోవడానికే, అసలు కావ్యాలను అధ్యయనం చేసే సంప్రదాయమే అనాగరికం, అనవసరం అనుకొంటున్న తరుణంలో ఇదంతా వృథా ప్రయాస.

1. సాహిత్యసృజనకు సృజన శీలంకన్నా సామాజిక నేపథ్యమే మూలం
2. వస్తువే రూపాన్ని నిర్ణయించుకుంటుంది.
3. సామాన్య జనులే ఉద్యమాలను నిర్మిస్తారు
4. కవియే సమాజాన్ని నడిపిస్తాడు
5. ఆకాశంలో సగం నీవు సగం నేను అంటూ తరచువాడే అర్థంలేని మాటల్ని ఆధారంగా చేసుకొని 'తెలుగు సాహిత్య విమర్శలో చిలుకపలుకులు' అని పరిశోధనాంశంగా గ్రహించి ఆసక్తికరంగా రాయగలమా?

కవిగా, విమర్శకునిగా శంఖవరం సంపత్కుమారాచార్యులను గురించి, ఆధునికాంధ్ర సాహిత్యవిమర్శలో డా॥ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి స్థానాన్ని గురించి యువకులెవరైనా పరిశోధించవచ్చు. వివేకానందవాణిని పరమ గంభీరంగా ఏడుసర్గలలో ఒక ద్విపద కావ్యాన్ని, చారిత్రకాధారాలతో వెయ్యి పద్యాలలో కొండవీటి రెడ్డి రాజ్యవైభవాన్ని ఇంకా ఎన్నో కావ్యాలను రాసిన బెళ్లూరి శ్రీనివాసమూర్తి మీద అవశ్యం చేయవచ్చు.

1. తిరుపతి వేంకటకవులు ప్రాచీన కవిత్వానికి భరతవాక్యం నవీనతకు నాందీవాక్యం పలికారు. 2. బ్రాహ్మవివాహం చదవకుండానే కన్యాశుల్కం రాశాడు గురజాడ 3. ఒక పార్సీగజల్ వినేదాక ముత్యాలసరం సృష్టించలేకపోయాడు. 4. సర్వవచన ప్రక్రియలకు కందుకూరియే ఆద్యుడు 5. విశ్వనాథ ఆధునిక నాగరికతకు వ్యతిరేకి 6. ఆధునిక తెలుగు కవిత్వం అంటే భావ, అభ్యుదయ స్త్రీ దళితకవిత్వాలేనా ఇలాంటి ఎన్నో చర్చనీయ అంశాలను గ్రహించి పునర్మూల్యాంకనం చేయవచ్చు. వచన కవిత్వంలో వచ్చిన ఆత్మ నివేదనం, భక్తితత్వం, సంప్రదాయిక భావాలను విశ్లేషించవచ్చు.

విశ్వనాథమీద ముఖ్యంగా ఆయన నవలలమీద ఉన్న అపారమైన ఇంగ్లీషు ప్రభావాన్ని రేఖామాత్రంగా విశ్లేషిస్తూ ఆలోచనాత్మకమైన వ్యాసాన్ని **పోలాప్రగడ సత్యనారాయణమూర్తిగారు 'విశ్వనాథ సాహితీ సమాలోచనం'** (పుటలు 55-56) లో రాశారు. ఆంధ్ర ఆంగ్ల భాషల్లో అభినివేశం ఉన్న విద్యార్థులు పరిశోధించాల్సిన అమూల్యమైన అంశం ఇది. ఈ అంశంపై తగిన సామర్థ్యంతో పరిశోధన చేయగలిగితే ఆ పరిశోధకుడికి అందరిలోను గుర్తింపు, తగిన కీర్తి ప్రతిష్ఠలు వస్తాయి. విశ్వనాథ రాసిన 'దమయంతి స్వయంవరం నవల చైతన్య స్రవంతి శిల్పానికి అమోఘమైన ఉదాహరణగా పరిశోధకులు విశ్లేషించుకోవచ్చు.

విక్రమదేవశర్మ (1869-1952) గారు యాభైకి పైగా రచనలు చేసినవారు. హిందీ, ఇంగ్లీషు, ఒరియా, సంస్కృతాంధ్రాలలో పండితులు. కళాపూర్ణోదయాది ప్రబంధాలను ఒరియాలోకి అనువదించారు. శ్రీనివాస కళ్యాణం, కుందమాల, బుద్ధచరిత్ర మొదలైన నాటకాలు రాశారు. తలిసెట్టి రామారావుగారు 'విక్రమదేవవర్మ రచనలు' అని ఒక సంపుటం కూడా వేశారు. ఎందరెందరో తెలుగు కవులను పోషించారు. ఆయన జీవితం సాహిత్యం మీద ఒక పరిశోధన చేయించుకోలేమా? సుమారు 20 లక్షల రూపాయిల దాకా విరాళమిచ్చి. 14 ఏళ్ళు ప్రో-ఛాన్సలర్‌గా పనిచేసి స్థిరమైన పునాదులు వేసినందుకు కృతజ్ఞతగానైన ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూనుకోవాలి.

ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ డి.లిట్. గౌరవాలతో, ఒక కళాశాలకు ఆయన పేరు పెట్టడంతో ఆయనను సత్కరించి ఉండవచ్చు. తెలుగుశాఖకు ఇదొక అవకాశం. ఆచార్య టి. దొణప్పగారు విక్రమదేవవర్మ గురించి రాసిన వ్యాసం 'తెలుగు వైతాళికులు'-3 (పుటలు 152-172)లో చూసుకోవచ్చు.

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రమని, ఐతిహాసికు లితిహాసమని, పౌరాణికులు బహు పురాణ సముచ్చయమని మహాభారతాన్ని ప్రశంసిస్తారని నన్నయగారు చెప్పిన పద్యం బహు ప్రసిద్ధం. భారతంలోని 'ధర్మస్థితి'ని గురించి విశ్లేషణలు జరిగాయి. సంస్కృత భారతం 'ఐతిహాసికత' కలిగింది కావచ్చు. తెలుగు భారతం మాత్రం కావ్యధర్మంతో కూడిందే. బహుపురాణ సముచ్చయమేరీతిగా భారతమైందో సాధికారికంగా చెప్పిన గ్రంథం, వ్యాసం నా దృష్టిలోకి రాలేదు. (నా అజ్ఞానాన్ని మన్నించండి). భారతంలో ప్రసిద్ధమైన ధర్మవ్యాధోపాఖ్యానం పద్మపురాణంలో వస్తుంది. పద్మ, మార్కండేయ, వాయు, కూర్మ, వామన, లింగ, భవిష్య, బ్రహ్మవైవర్త పురాణాదుల్లోను జైమిని భారాతం, భాగవతం, హరివంశాదుల్లో భారత కథ ప్రస్తావితమవుతుంది. సంస్కృతంలో పురాణాలు ముందా? భారతం ముందా? అన్న చర్చ, భేదాభిప్రాయాలుండవచ్చు. కాని తెలుగులో మాత్రం సంస్కృత అష్టాదశ పురాణాల ఆవిర్భావం తర్వాతే భారతం వచ్చింది. కనుక ఆ వివాదం లేదు. తెలుగులో అర్థతాత్పర్యాలతో విషయసూచికలలో సంస్కృత పురాణాలన్నీ దొరుకుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం భారతం, అర్థ తాత్పర్యాలతో విషయ సూచికలతో లభిస్తుంది. రెండింటి విషయసూచికలను పోల్చుకుంటూ చదువుకొంటూ పోతే చాలు సిద్ధాంత గ్రంథ రచనకు దారి ఏర్పడుతుంది.

ఒకప్పుడు రచయిత్రుల సాంఘినవలలు ఒక వెలుగు వెలిగాయి. సినిమాలకోసమే నవలలు రాశారన్నంతగా అపప్రథ పొందాయి. 'తెలుగు నవలల్లో సినిమాల ప్రస్తావన' లేదా 'తెలుగు నవల: తెలుగు సినిమా' అని సిద్ధాంత గ్రంథం రాయవచ్చునేమో! 1931లో హెచ్.ఎం. రెడ్డి తీసిన 'భక్త

ప్రహ్లాద' తొలి తెలుగు టాకీచిత్రం. 1933లో వచ్చిన విశ్వనాథ 'వేయిపడగలు'లో చలనచిత్రాల తీరుతెన్నులను గురించిన విపుల చర్చ ఉంది. తెలుగు నవలల్లో సినిమాల ప్రస్తావన చేసిన మొదటి రచయిత విశ్వనాథ సత్యనారాయణ. విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు, చెలియలికట్ట మొదలైన వాటిల్లోను ప్రస్తావన ఉంది. అడవిబాపిరాజు, బుచ్చిబాబు, గోపీచంద్ మొ. వారి నవలలను పరిశీలిస్తే సినిమాల ప్రస్తావనలు దొరకవచ్చునేమో! యద్దనపూడి సులోచనారాణి జీవనతరంగాలు, మీనా, సెక్రటరీ, కోడూరి కౌసల్యాదేవి డా॥ చక్రవర్తి, చక్రభ్రమణం, ప్రేమనగర్, దాశరథీ రంగాచార్యుల చిల్లర దేవుళ్ళు, రంగనాయకమ్మ 'బలిపీఠం' మొదలైన నవలలు, ద్వివేదుల విశాలాక్షి, యండమూరి వీరేంద్రనాథ్, ఆదివిష్ణు మొదలైన వారి నవలలు చలనచిత్రాలుగా రూపాంతరం చెందాయి. శ్రవ్యమాధ్యమానికి చెందిన నవలలను దృశ్యమాధ్యమానికి పరివర్తనం చేసేటప్పుడు ఆకర్షణ నిమిత్తంగానీ, ఆర్థిక ప్రయోజనం కోసంకానీ సంఘటనల కూర్పులో, సంవాదాల కూర్పులో, స్క్రీన్‌ప్లేలో, దేశీయతా కల్పనలో సాంకేతిక అంశాలలో, స్థల కాల నిర్వహణ కథా కథనంలో పాత్ర చిత్రీకరణలో చేసిన మార్పులు కూర్పులు దాని వల్ల మూలనవలకు మంచి జరిగిందిదా? సినిమాకు మంచి జరిగిందా? రెండింటికి నష్టం జరిగిందా? సరిపోల్చి విశ్లేషిస్తూ సిద్ధాంత గ్రంథం రాయవచ్చు.

'ఏక వీర కథన కౌశలం' పేరుతో ఈ మధ్య డా॥ వై. కామేశ్వరి గారు చక్కని పుస్తకం రాశారు. అందులో ఏకవీర నవలాకారుని హృదయం సినిమా నిర్మాతలకెలా చిక్కలేదో సోదాహరణంగా నిరూపించారు. చదవండి.

ఎక్కిరాల కృష్ణమాచార్యుల (1926-84) పురుషమేధం, మంత్రజాలం నవలల మీద ఎం.ఫిల్స్ వచ్చాయి. కాని కావ్యాల మాట ఏమిటి? వారి యౌగిక ఆధ్యాత్మిక సేవా దృక్పథాల మాటేమిటి? ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగా వారు పనిచేశారు. భారతీయ సాహిత్య పారమార్థికతను సమన్వయ దృష్టిని ప్రచారం చేసి దేశ విదేశాల్లో ఎందరినో 'మనుషులు'గా తీర్చిదిద్దిన ఈ మహనీయుని గురించి పరిశోధించడానికి మనుషులు కరువయ్యారా?

స్వాతంత్ర్య సమరయోధులైన తిలక్, సుబాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, మంగళ్ పాండే, నెహ్రూలాంటి వారి జీవితాలు తెలుగులో కావ్యరూపమెత్తాయి. వాటన్నింటినీ కలుపుకొని పరిశోధించవచ్చు. గాంధీజీ సాహిత్యం మీద అంకయ్య, మొదలి నాగభూషణ శర్మ మొదలైన వారి గ్రంథాలు ఎన్నో వచ్చాయి. అందుకే గాంధిని మినహాయిస్తున్నాను.

అల్లసాని పెద్దన, నందితిమ్మనల అవతారికలు, కుమార ధూర్జటి 'కృష్ణరాయ విజయం, రాయవాచకం మొదలుకొని ఆదిపూడి వెంకటరావు, చిట్టారామకృష్ణారావు, భూతపురి సుబ్రహ్మణ్య శర్మ శ్రీకృష్ణభారతం, ఇటీవలి గెడ్డాపుసత్యం 'జైత్ర యాత్ర' కావ్యం, బిర్నీడి ప్రసన్న 'తుఖారా' లాంటి కావ్యాలు, ప్రసాద్ 'అప్పాజి మొదలైన నవలలు, నేలటూరి వెంకటరమణయ్య 'ఛత్రగ్రాహి' 'మధుమావతి' లాంటికథలు. పోతుకూచి సుబ్బయ్య, మద్దూరి శ్రీరామమూర్తి, భారతాల మార్కండేయ శర్మ మొదలైనవారి నాటకాలు అన్నీ కలగలుపుకొని 'తెలుగు సాహిత్యంలో శ్రీకృష్ణదేవరాయలు' అనే అంశంపై ఉదాత్తరీతిలో పరిశోధన గ్రంథం రాయవచ్చు.

సంప్రదాయం, విశ్వాసాలు, దైవం, మతం లాంటి భావాలను సమూలంగా పెరికివేసి సరికొత్త సమాజనిర్మాణం చేయాలన్న భావాలతో నాస్తికవాదాన్ని ప్రచారంచేస్తూ 'హిరణ్య కశిపుడు' (1936) నాటకం, తాండ్ర పాపారాయని ప్రతీకారాన్ని చిత్రిస్తూ 'మల్లమ్మదేవి ఉసురు (1938), గయోపాఖ్యానాన్ని ఆధునికీకరించి అనాలోచితంగా ఇష్టారాజ్యంగా వాగ్దానాలు చేస్తే తలెత్తే పరిణామాలను చిత్రిస్తూ 'మాట పట్టింపు' (1936) ఇంకా 'అపరాధి' (1950) 'విశ్వంతర' మొదలైన నాటకాలు రాసిన ఆమంచర్ల గోపాలరావు (జ. 26.9.1907) మీద పరిశోధన చేసే అవకాశం ఉంది.

అడ్లూరి అయోధ్యరామకవి ఖమ్మంజిల్లా ఇల్లెందులో 1922లో జన్మించారు. 'నైజాం ప్రజావిజయం' పేరుతో బుర్రకథ రాసి ప్రజల్లో ఉత్తేజాన్ని నింపారు. ఆంధ్ర కేసరి, ఘంటారావం, దీపావళి, రుద్రమదేవి మరికొన్ని రచనలు చేసినట్లు తెలుస్తుంది. సమాచారం దొరికించుకోగలిగితే ఉపయోగించుకోవచ్చు.

నల్గొండజిల్లా భువనగిరికి చెందిన శేషభట్టరు వేంకటరామానుజాచార్యులు (1900-1944) బహుభాషావేత్తలు. సంఘసంస్కర్తగా, తీవ్రవాదిగా, పత్రికారచయితగా; భిన్న భాషల్లో సాహిత్య సృజనం చేసిన వ్యక్తిగా ప్రసిద్ధులట. తమ పేరుతో, 'లోకజ్ఞు'డను కలంపేరుతో రచనలు చేశారు. నిగార్, హుమాయూన్ లాంటి ఉర్దు పత్రికల్లో, నీలగిరి, సుజాత లాంటి తెలుగు పత్రికల్లో కవితలు, వ్యాసాలు, విమర్శలు వారివి వచ్చాయి. అఖిలభారత తస్కర మహాసభ, ఆంధ్ర నామసంగ్రహం, పొడుపుపద్యాలులాంటి అధిక్షేప పద్యాలు, రచనలు చేశారని. తెలుగు విజ్ఞాన సర్వస్వం (4-12) చెప్తుంది. ఎవరైన పూనుకొంటే మంచి ఎం.ఫిల్ వ్యాసం తయారు కావచ్చు.

తెలంగాణాలో మరింగంటికవులు ఆరేడుతరాలపాటు కవితాసృజనం చేశారు. శ్రీరంగాచార్యుల వారు 'మరింగంటి కవుల సాహిత్యసేవ' మీద విస్తారంగా కృషిచేసి డాక్టరేటు పొందారు. క్షత్రబంధూపాఖ్యానం, తాలాంకనందినీ పరిణయం లాంటి మరింగంటి కవుల కృతులను శ్రీరంగాచార్యులవారు పరిష్కరించి ప్రచురించారు. వాటిమీద పరిశోధించి డాక్టరేటు పొందిన వారు శ్రీ రంగాచార్యులు చెప్పని కొత్త విషయాలను ఎన్ని చెప్పారో! కానీ ఇంకా రామానుజాభ్యుదయాది ప్రశస్త ప్రబంధాలు మరింగంటి వారివి వెలుగులోకి తేవలసే ఉంది.

గడ్డం రామదాసు అనే పద్మశాలీయకవి (1878-1931) సిద్ధిపేటలో ఉండేవారు క్రమేపి ఆయన యోగిగా పరిణమించారు. కుచేలోపాఖ్యానం, కాళీయమర్దనం, ప్రభావతి ప్రద్యుమ్నం, విప్రనారాయణచరిత్ర, సత్యవర్మచరిత్ర, దుర్యోధన గర్వాపహరణం, ఇంద్రసభ, ద్రౌపదీ వస్త్రాపహరణం లాంటి రచనలు చేసినట్లు గోల్కొండకవుల సంచిక చెప్తుంది. కాని ఇవేవీ దొరుకుతాయన్న గ్యారంటీ లేదు. తెలంగాణా ప్రాంత సాహిత్యానికి ఇదో పెద్దశాపం. పెద్దమందడి పూదత్తు వెంకటకృష్ణకవి 12000 పద్యాల్లో నిర్వచన భక్తవిజయం రాశారు.

'తెలుగులో నదీకావ్యాల' మీద పరిశోధన జరిగింది. కాని గోదావరి, కృష్ణానదుల మీద ప్రత్యేకించి జరగలేదు. కృష్ణానది మీద బోలెడు సాహిత్యం

ఉంద ఆనాటి పాల్కురికి సోమననుండి నేటి దాక ఎందరెందరో కృష్ణానదిని ప్రాసంగికంగాను, ప్రత్యేకంగాను ప్రస్తుతించారు. శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణుడు, కొప్పరపు కవులు, నాదెళ్ళ పురుషోత్తమకవి, తిరుపతి వెంకటకవులు, విశ్వనాథ, వేటూరి ప్రభాకరశాస్త్రి, నోరి నరసింహశాస్త్రి, నండూరి రామకృష్ణమాచార్యులు, సి. నారాయణ రెడ్డి, పోలవరపు కోటేశ్వరరావు, జె. బాపురెడ్డి మొదలైన వారెందరో కృష్ణానదిని గానం చేశారు. పుష్కరాల వేళ ప్రత్యేక సంచికలు వచ్చాయి. వాటన్నింటిని క్రోడీకరించుకొని ఒక మంచి సిద్ధాంత గ్రంథం రాయవచ్చు.

'గోదావరి' నది మాత్రం తక్కువ తిన్నదా? ప్రాచీన సంస్కృత, ఆంధ్ర సాహిత్యాల్లో గోదావరి ప్రాశస్త్యాన్ని క్రోడీకరించుకోవచ్చు. 1902లో వచ్చిన కొక్కొండ వెంకటరత్నం గోదావరి వర్ణన కావ్యం, విశ్వపతి 'గోదావరి మాహత్మ్యం,' పేరి కాశీనాథ శాస్త్రి 'గోదావరి లహరి', కె. సూర్యప్రసాదరావు 'గోదావరి ప్రభావం' (1908) ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రి 'గోదావరి పుష్కర మాహాత్మ్యం' (1908 & 1920) లతో మొదలుకొని మధ్యమధ్యలో గోదావరి పుష్కరాల సమయంలో వచ్చిన పుస్తకాలను కలుపుకొంటూ ఇటీవలికాలంలో వచ్చిన బేతవోలు రామబ్రహ్మం 'కొత్తగోదావరి', ఆసూరి మరింగంటి పురుషోత్తమాచార్యుల 'గోదావరి', జొన్నలగడ్డ మృత్యుంజయశాస్త్రి, 'కావ్య గౌతమి'దాక వచ్చిన రచనలను పరిశీలించి డాక్టరేట్ పొందవచ్చు.

కవిపోషకుడు, పత్రికా నిర్వాహకుడు, సాహిత్య చరిత్ర నిర్మాత అయిన మంత్రి ప్రెగడ భుజంగరావు (జ. 14.4.1876–మ. 28.4.1941) గారి మీద తెలుగు పరిశోధకలోకం దృష్టి సోకకపోవడం విచిత్రంగా ఉంది. ఏ తూమాటి దొణప్ప, జోగారావు గార్ల పర్యవేక్షణలోనో 1975 నాటికి రావలసి ఉండేది. భుజంగరావు మంజువాణి పత్రిక నిర్వహించారు. ఆంగ్లంలో తెలుగు సాహిత్యచరిత్ర రాసి తెలుగేతరులకు అందించారు. విక్టోరియా మహారాణి జీవిత చిత్రణను మూడు ఆశ్వాసాల కావ్యంగా 'వసంతోదయం'

(1907) పేరుతో రచించారు. కూతురు హైమవతి పరిణయవేళ 232 మంది విద్వత్కవుల ఆశీఃపద్యాలతో 'ఆధునిక కవిజీవితములు అను హైమవతీ పరిణయం' (1916) ప్రకటించారు. ద్వైత అద్వైత విశిష్టాద్వైత చైతన్య గౌతమబుద్ధాది మత ప్రవక్తల బోధనలను సమన్వయిస్తూ 'తత్త్వమీమాంస'కావ్యాన్ని 854 పద్యాలలో రాశారు. ప్రసన్నరాఘవ అభిజ్ఞాన శాకుంతల ఉత్తర రామచరిత్రాది నాటకాలను తెనిగించారు. షేక్స్పియర్ రచనలను కొన్నింటిని, బైబిలులోని కొన్ని భావాలను అనువదించారు. (మరిన్ని వివరాలకు చూడుదు: తెలుగు అకాడమి వారి ఆధునిక సాహిత్యకోశం, పుట 617). మరి ఇంతటి వ్యక్తి పరిశోధనకు అనర్హుడయ్యాడా? లేక పరిశోధకు లనర్హులయ్యారా?

తూమాటి దొణప్ప 'ఆంధ్రసంస్థానాలు – సాహిత్య సేవ' గ్రంథంలోని ఒక్కో అధ్యాయం మీద ఒక్కో సిద్ధాంత గ్రంథం రావాలి గదా!

టేకుమళ్ళ రాజగోపాలరావు (జ. 9.7.1876) టేకుమళ్ళ అచ్యుతరావు (జ. 18.4.1880) టేకుమళ్ళ కామేశ్వరరావు (22.3.1907) ముగ్గురు గొప్పగా రచనలు చేసినవారు. 'విహంగయానం' తొలివైజ్ఞానికనవల, త్రివిక్రమవిలాసం, లలిత మొదలైన నవలలు రాసిన వారు రాజగోపాలరావుగారు. ఆంధ్ర పదములు, పాటలు (1924). ఆంధ్ర నాటకములు – రంగస్థలము (1926) విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్ర వాఙ్మయ చరిత్రము (రెండు భాగాలు 1933,39) కళాపూర్ణోదయం మీద ఆంగ్లాంధ్రాల్లో చేసిన విమర్శనాత్మక రచన, ప్రబంధాల గురించి ఎన్నో వ్యాసాలు రాసిన మహనీయులు టేకుమళ్ళ అచ్యుతరావు. 'నా వాఙ్మయ మిత్రులు' పేరుతో ఎందరెందరి జీవిత వివరాలకు అందించినవారు కామేశ్వరరావు గారు. మరి వీరిని గురించి పరిశోధనాంశాలుగా గ్రహించాలని మరి మనవారికి బుద్ధిపుట్టడం లేదేం?

స్వాతంత్ర్య పూర్వం వెలువడిన రచయిత్రుల నవలల్లో మహిళాభ్యుదయ భావాలు అని ఎవరైనా గ్రహించవచ్చు. జయంతి సూరమ్మ సుదక్షిణా చరిత్ర (1906) ఎస్. స్వర్ణమ్మ ఇందిర (1915) సీరం సుభద్రా...

జాగిలము (1918) కనుపర్తి వరలక్ష్మమ్మ వసుమతి (1925) మొదలైన 58 నవలలున్నట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే వాటిలో ఎన్ని దొరుకుతాయన్నది పరిశోధకుని శ్రమశీలానికి పరీక్ష. ఇవి దొరకడం లేదు కూడ. జిరాక్స్‌లు చేసుకోవడానికి వెనుకంజ వేయకపోతే ఎన్ని గొప్ప పనులైన చేసి చూపవచ్చు.

చారిత్రక నవలలు రావడం మొదలు పెట్టి వంద ఏళ్ళుదాటాయి. ఈ చారిత్రక నవలల్లో ఉన్న చారిత్రకతను, ఆభాసచారిత్రకతను అవి అందించే స్ఫూర్తి స్వరూపాన్ని సరిగ్గా అంచనా కట్టవలసి ఉంది.

యండమూరి, మల్లాది లాంటి పాపులర్ రచయితల నవలలు ఆకర్షింప బడటానికి సీరియస్ నవలలు అంతగా ఆకర్షించి చదివింపజేసుకోకపోవడానికి గల హేతువులను శాస్త్రీయంగా విశ్లేషించుకోవడానికి వీలుందా? పాపులర్ నవలలు ఇంగ్లీషు నవలలకు కాపీలని ప్రసక్తంగా ఎందరో అంటుంటారు. ఏ తులనాత్మక అధ్యయన కేంద్రం వారైనా, మరెవరైనా పనిగట్టుకొని ఏఏ ఇంగ్లీషు నవలల నుండి ఏఏ తీరులుగా ఏఏ తెలుగు నవలలు వచ్చాయో పరిశ్రమింపచేయవచ్చు.

జిల్లాలవారీగా, ప్రాంతాలవారీగా సాహిత్య చరిత్రలు – కరీంనగర్, జంట నగరాలు, కడప, కర్నూల్, గుత్తి మండలం, మహబూబ్‌నగరం (శతకం, సాహిత్య వికాసం, కవులు, వచన వికాసం) సాహిత్య చరిత్రలు ఇప్పటికే వచ్చాయి. ఆయా విశ్వవిద్యాలయాల పరిధిలో ఉన్న జిల్లాల కవి పండితుల చరిత్రలను సేకరించవచ్చు. పరిశోధనపరిధిలో కాకుండా వైద్యం వేంకటేశ్వరాచార్యులు కర్నూలు జిల్లా; కోవెల సంపత్కుమార వరంగల్ జిల్లా; శ్రీ రంగాచార్య నల్గొండ జిల్లా, కవిపండితుల జీవిత పరిచయాలు చేశారు. అయితే వీటిల్లో విషయ సేకరణ, పరిచయాత్మకతకే ఎక్కువ స్థానం లభించింది. కాని వీటి ఆలంబనగా విస్తృతపరిశోధనకు ముందడుగు వేయవచ్చు.

'తెలుగు సాహిత్యానికి చాత్తాదశ్రీవైష్ణవుల సేవ' అనే పేరుతో మంచి పరిశోధన గ్రంథం రాయవచ్చు. తంజనగరం తేవప్పెరు మాళ్ళయ్య, తంజనగరం దేవరాజసుధీమణి లాంటి మహావ్యాఖ్యాతలు, వైద్యం

వేంకటేశ్వరాచార్యుల లాంటి పండిత పరిశోధకులు, ఎలనాగ లాంటి మహాకవులు, అమ్మంగి వేణుగోపాల్ లాంటి సాత్త్విక విమర్శకులు, జయధీర్ తిరుమలరావు లాంటి సామాజిక పరిణామ చింతకులు ఎందరో చాత్తాద శ్రీ వైష్ణవ వంశాన్ని సుసంపన్నం చేశారు. తెలంగాణాకు చెందిన కొలనుపాక వాస్తవ్యుడైన తిరువాయి పాటి వేంకటకవి అనే చాత్తాదవైష్ణవుడు రాసిన యాదగిరి నృసింహశతకాన్ని 1900లో వావిళ్ళవారు ప్రచురించారు. ఒ.వై. దొరసామయ్య అనే చాత్తాదవైష్ణవుడు 1899లో బంకించంద్రుని 'కపాలకుండల' నవలను, 1904లో ఆనందమఠాన్ని తెనిగించాడు. తంజనగరం తేవప్పెరు మాళ్ళయ్య వసుచరిత్ర వ్యాఖ్యాన రీతి, వైద్యం వేంకటేశ్వరాచార్యుల పరిశోధన తత్పరత ఇలా ఒక్కొక్కరి మీదే చేయవచ్చు కూడా. అట్లాగే తెలుగు సాహిత్యానికి విశ్వబ్రాహ్మణ / పద్మశాలీల సేవలు పరిశోధనాంశాలుగా ఉపకరించవచ్చు. ఇటీవలె రాపాక ఏకాంబరాచార్యులు 'విశ్వబ్రాహ్మణ సర్వస్వం' ప్రటించారు. దాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఓ పది అంశాలయినా దొరకవచ్చు.

'తెలుగు సాహిత్యంలో రుద్రమదేవి' పేరుతో కాళ్ళకూరి నారాయణ రావు ప్రతాపరుద్రమదేవి కావ్యం, మధునాపంతుల ఆంధ్ర పురాణంలోని రుద్రమదేవి ఖండం; ఏటుకూరి వెంకటనరసయ్య రుద్రమదేవి కావ్యం; శేషాద్రి రమణకవులు ఓరుగల్లు కోటకావ్యం; వేటూరి వాసుదేవశాస్త్రి ఓరుగల్లు సామ్రాజ్యం నవల, ఓగేటి ఇందిరాదేవి 'ఆనందధార' నవల మొదలైనవన్నీ కలుపుకొని సిద్ధాంతగ్రంథం రాయవచ్చు. చాలదనుకొంటే 'తెలుగు సాహిత్యంలో కాకతీయతేజం' అని అందరిని కలుపుకొని నవల కథ, కావ్యం, ఖండకావ్యం మొదలైన అన్ని సృజనాత్మక ప్రక్రియలలో వెలువడిన కాకతీయ సాహిత్యాన్ని సమీక్షించవచ్చు.

ఈ రోజు బాగా గిరాకి ఉన్న దేవుళ్ళలో షిర్డీ సాయిబాబా ఒకరు. పత్తి నారాయణ రావు, కుంటముక్కల లక్ష్మి నారాయణ శర్మ, విమలాశర్మ, ఎక్కిరాల భరద్వాజ లాంటి రాసిన వారు సాయి జీవిత చరిత్రలు; లీలావిభూతి పేరుతో తుమ్మపూడి కోటేశ్వరరావుగారు రాసిన ఒక కావ్యం, శ్రీ సాయి

సచ్చరిత్ర ముక్తావళి పేరుతో అమరేశం రాజేశ్వరశర్మ గారు రాసిన ఒక గేయప్రబంధం నాతలపుల్లో అప్రయత్నంగా మెదలు తున్నాయి. పరిశోధకులు పూనికతో యత్నిస్తే మరికొన్ని దొరకవచ్చు.

కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, నాగపూడి కుప్పుసామయ్య, చిలుకూరు పాపయ్యశాస్త్రి, జనమంచి శేషాద్రిశర్మ, మల్లంపల్లి సోమశేఖర శర్మ ఇలాగా కొన్ని వందల మంది జీవిత సాహిత్య విశేషాలను పరిశోధనాంశాలుగా గ్రహించవచ్చు. ఇలా చెప్పడం సులభం కావచ్చు. పరిశోధనాంశంగా స్వీకరించాక చాలినంత సమాచారం దొరకడంలో మాత్రం ఎవరూ పూచీపడలేరు. లైబ్రరీలు పరిశోధన దాహాన్ని సరిగా తీర్చడం లేదు. యాభై అరవై ఏళ్ళక్రితం వచ్చిన పుస్తకం, పది పన్నెండేళ్ళ క్రితం వచ్చిన వ్యాసం కావాలన్న దొరికించుకోలేని స్థితి దాపురించింది. ఇది చాలావిచిత్రం. మధునాపంతుల వారి 'ఆంధ్ర రచయితలు', టేకుమళ్ళ కామేశ్వరరావు గారి 'నా వాఙ్మయమిత్రులు,' కురుగంటి సీతారామయ్యగారి, 'నవ్యాంధ్ర సాహిత్య వీధులు', తెలుగు అకాడమీ ప్రచురించిన 'తెలుగు సాహిత్య కోశం' రెండు సంపుటాలు ఆరుద్ర 'సమగ్ర ఆంధ్రసాహిత్యం' తిప్పేస్తే ఎన్నో మంచి మంచి అంశాలు దొరుకుతాయి. ఇప్పుడిప్పుడే పైకి వస్తున్న వర్ధమాన, వర్తమాన కవి పండిత రచయితల మీద; ఆధునికధోరణుల మీద ఎం.ఫిల్,పిహెచ్.డి లు చేసి చేతులు దులిపేసుకోవడం తగదు. వీరిని గురించి భవిష్యత్తులో ఎట్లాగుచేస్తారు. తెలుగు జాతి సాహిత్య సామాజిక అభ్యుదయాలకు నిస్వార్థంగా తమ జీవితాలను ధారపోసిన మహనీయుల జీవిత రచనావిశేషాలను 'పనిగట్టుకొని' రికార్డ్ చేయకపోతే భవిష్యత్తులో అసలేమీ దొరకవు. మన తరానికి కృతఘ్నుతా దోషం అంటుకుంటుంది. వారిమీద పరిశోధన చేస్తే సమాజానికి ఏం ఉపయోగం అన్న వెర్రి ప్రశ్న వేయవచ్చు. ఇప్పుడు చేస్తున్న అన్ని పరిశోధనలు సమాజ స్వరూపాన్ని ఏదో మార్చేస్తున్నట్లు.

ఇలా చెప్తూ పోతుంటే మరెన్నో నూతనాంశాలు, అనన్వేషితాంశాలు నామనసులోకి తోసుకొని వస్తున్నాయి. కేవలం ఈ అంశంమీద ఒక ప్రత్యేక గ్రంథం రాయడం లేదు. ఆలోచనలను రేకెత్తించడం కోసం మాత్రమే మచ్చుకు పేర్కొంటున్నాను.

# 7

# సంప్రదించాల్సిన గ్రంథాలు

పరిశోధకవిద్యార్థి ఎదుర్కొంటున్న ప్రధానసమస్య వ్యుత్పన్నతా రాహిత్యం. పరిశోధకుడు తన పరిశోధనాంశానికి సంబంధించిన గ్రంథాలు సేకరించుకోవడం, చదువుకోవడం ప్రధానాంశం. పరిశోధనాంశం ఏదైనా కావచ్చు. పరిశోధకుడిగా కొన్ని పుస్తకాలతో పరిచయం సంపాదించుకోవాలి. దాని వల్ల తన పరిశోధనాంశానికి కాని ఇతరత్ర అవసరాలకు కాని అవి ఎంతో ఉపకరిస్తాయి. గ్రంథాలయంలో పుస్తకాలసెక్షన్ ఒకటి ఉంటుంది. ప్రత్యేకంగా 'రిఫరెన్సు సెక్షన్' ఒకటి ఉంటుంది. ఈ రిఫరెన్సు సెక్షన్‌కు తెలుగు పరిశోధన విద్యార్థులు తక్కువగా వెళ్తున్నారేమో ననిపిస్తుంది. ఈ రిఫరెన్సు సెక్షన్‌లో సూచికలు, కోశాలు, విజ్ఞాన సర్వస్వాలు ఇత్యాదిగ్రంథాలు ఉంటాయి. వీటిని ఆకరగ్రంథాలు, ఆచూకీ గ్రంథాలు, పరామర్శ గ్రంథాలు, సంప్రదింపు గ్రంథాలు, సోర్స్‌బుక్స్, రిఫరెన్స్ బుక్స్ అని పిలుస్తారు. ఒక రంగానికి లేదా ఒక ఉద్దిష్ట అంశానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని సూచనామాత్రంగా, పరిచయాత్మకంగా అందిస్తూ భవిష్యద్విస్తార కృషికి ప్రేరకంగా ఇవి తోడ్పడుతాయి. ఈ గ్రంథాలు కావ్యాలు, నవలల్లాగా మొదటి నుండి చివరి దాక చదవడానికి ఉద్దేశించినవి కావు. జిజ్ఞాసువు తనకు అవసరం వచ్చిన అంశాన్ని గురించి, ఆమాత్రం సమాచారం కోసం చదివేవి.

ఈ నూట ఏబైఏళ్ళల్లో తెలుగులో లక్షలాది పుస్తకాలు వచ్చాయి. ఎన్ని పత్రికల్లోనో అసంఖ్యాక వ్యాసాలు వచ్చాయి. ఎందరెందరో ఎన్నెన్నో అంశాలమీద రాశారు. వాటినెలా తెలుసుకోవాలి? ఇక కవిత్వంలో అయితే ఎంతో పదప్రయోగం, భాషా వినియోగం జరిగింది. దానినెలా తెలుసుకోవాలి? వాటన్నింటిని ఏ ఒక్కవ్యక్తి చెప్పలేడు. మనం లైబ్రరీల్లో ఎన్నేళ్ళు శ్రమించినా దొరకకపోవచ్చు. వృథాకాలహరణాన్ని నివారించి, అవసరమైన సమాచారాన్ని చిటికెలో ఈ రిఫరెన్సు పుస్తకాలు అందిస్తాయి. వాటి ఆధారంగా మరింత అదనపు సమాచారం దొరికించుకొనే మార్గం సుగమం అవుతుంది. అటువంటివి కొన్ని స్థూలంగా పేర్కొంటాను.

తెలుగులో రామాయణాలు, తెలుగులో శాకుంతలనాటకాలు, తెలుగులో హరిశ్చంద్రుని కథ, తెలుగులో చారిత్రక నవలలు, తెలుగులో సాహిత్య విమర్శ లాంటి అంశాలు పరిశోధనకు తీసుకొంటే మీరు ముందు ఉద్దిష్టప్రక్రియల్లో ఎప్పుడెప్పుడు ఏమేమి పుస్తకాలు వెలువడ్డాయో పట్టిక చేసుకోవలసి ఉంటుంది. ఎవరిని అడిగినా ఒకటో రెండో పేర్లు చెబుతారు. లేదా ఆ గ్రంథాలయం, ఈ గ్రంథాలయం తిరిగితే పదో, ఇరవయో గ్రంథాలు దొరుకుతాయి. కాని గ్రంథాల పట్టిక మీ చేతిలో ఉంటే అన్వేషణ సులువవుతుంది. **ఆంధ్ర వాఙ్మయ సూచిక ముద్రితాముద్రిత గ్రంథములపట్టిక కాశీనాథుని నాగేశ్వరరావు నేతృత్వంతో లో ప్రచురితమైంది. ఈ అపూర్వ గ్రంథాన్ని ప్రాచీ పబ్లికేషన్స్ వారు 1993/94లో పునర్ముద్రించి అందుబాటులోకి తెచ్చారు. లభ్యముద్రిత తెలుగు పుస్తకాలలో మొదటిదైన శబ్దమంజరి (1827)** మొదలుకొని 1927 వరకు వచ్చిన 12,800 గ్రంథాల వివరాలు దీనిలో సంకలితమయ్యాయి. గ్రంథం, గ్రంథకర్త, సంవత్సరం, ప్రచురణకర్త, వచనం, పద్యం, విమర్శ, ప్రహసనం, నాటకం, లా, హాస్యం, వైద్యం, లక్షణం, జ్యోతిషం, కావ్యం, చరిత్ర, యక్షగానం, శృంగారం, నవల, భూగోళం, హరికథ, మతం, ఇత్యాద్యనేకవివరాలతో గ్రంథ రచయితల, ప్రక్రియల పరంగా అకారాది క్రమంలో వచ్చిన అపూర్వగ్రంథం ఇది. ఈ మాత్రం వివరాలు దొరికితే చాలు గదా అసలు పుస్తకాలు సంపాదించడానికి మార్గం సుగమం కావడానికి.

మార్గం సుగమం కావడానికి. ఈ మార్గంలోనే పరిమితస్థాయిలో వెలగా వెంకటప్పయ్యగారు ఒక గ్రంథసూచికను తెలుగు అకాడెమి తరపున వేశారు. కాశీనాథుని వారు ఒకవ్యక్తిగా ఆ పుస్తకం తీసుకొనిరాగలిగారు. మరి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గ్రంథాలయ శాఖ దీనిని కొనసాగించి ప్రతి ఐదేళ్ళకో సంపుటం చొ॥న ప్రచురించే పనికి పూనుకోలేక పోయింది. ఏ మాత్రం ఆదాయ వనరులు లేని అనామక శాఖ ఇది. కనుక ఎవరూ దీనిని పట్టించుకోరు. ప్రచురితమైన ప్రతిపుస్తకం రాష్ట్రప్రభుత్వ గ్రంథాలయశాఖలో నమోదు చేయబడి సాధారణ జాబితా, నిర్బంధజాబితా కిందసైటేషన్ నంబర్ పొందుతుంది. ప్రతి సంవత్సరం మూడువేల పుస్తకాలవరకు రాష్ట్ర ప్రభుత్వం సైటేషన్ నంబరు ఇస్తారు. వాటిని సంపుటాలుగా మార్చి, కనీసం వారి ఆధీనంలోనే గ్రంథా లయాలు నడిచేవి కనుక వాటికి అమ్మేసి ఖర్చులు రాబట్టుకోవచ్చు. ఇలాంటి ఆలోచనలు ఆ శాఖ వారికెందుకు రావో నాలాంటి వాడికెందుకొస్తాయో నాకు అర్థం కాదు. కాశీనాథుని ఆంధ్ర వాఙ్మయసూచిక ప్రచురితమైన 1928 తర్వాతి పుస్తకాల వివరాలు కావాలని కోరుకునే పరిశోధకుని ఆరాటాన్ని ఎవరు తీర్చాలో నాకు బోధపడడం లేదు. 'ఇది ఇంతే' కనుక నేను కూడా బాధపడడం లేదు.

తంజావూరు మదరాసు హైదరాబాదు ప్రాచ్యలిఖిత భాండాగారాలు వారి గ్రంథాలయాల్లో నున్న గ్రంథాల సూచికలు వేశాయి. అక్కడికి వెళ్ళేముందు ఈ పుస్తకాలను చూసుకొని వెళ్తే పని సులువవుతుంది.

అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి **వ్యాసరచనల సూచి** (1977) ప్రచురించింది. 1875-1972 సంవత్సరాల మధ్య వచ్చిన 94 తెలుగు పత్రికల్లోని 26, 880 వ్యాసాలను, కవితలను విషయాత్మకంగా వర్గీకరిస్తూ ప్రచురించింది. అర్థశాస్త్రం- భాష- ఛందస్సు, యుద్ధం - వైద్యం- సాహిత్యం - రాజకీయం- ఇత్యాది 72 వర్గీకరణల కింద వ్యాసం, రచయిత, పత్రిక, నెల, సంవత్సరం, పేజీలు మొదలైన వివరాలనిచ్చింది. పరిశోధక విద్యార్థికి ఈ పుస్తకం చూడవలసిన అవసరం పడదా? ఇది ఉందని తెలియకపోతే ఎట్లా?

మరో అపూర్వ గ్రంథాన్ని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమివారు 1984లో ప్రచురించారు. దాని పేరు **తెలుగు రచయితలు-రచనలు.** ఇది పైన పేర్కొన్న వ్యాసరచనలసూచినే రచయితలపరంగా మార్చింది. వ్యాసరచనల సూచిని చాలామంది చూశారు. కాని ఈ పుస్తకానికి ఎందుకో పేరు రాలేదు. 1875-1980ల మధ్య వివిధ పత్రికలలో రాసిన ఆరువేల మంది రచయితల పరంగా వచ్చింది. ఫలానా రచయిత రాసిన వ్యాసం, కవిత కావాలనుకొంటే ఈ పుస్తకం చూస్తే తెలిసిపోతుంది. 'పరిశోధన వ్యాసంగాన్ని, అధ్యయన శీలతను పెంపొందించే లక్ష్యంతో' ప్రచురించినవి ఈ గ్రంథాలు. ఈ రెండు గ్రంథాలనే తమ సంతానంగా భావించి తయారు చేసిన మహనీయులు నేలనూతల శ్రీకృష్ణమూర్తి (1910-1996)గారు. పరిశోధన ప్రవృత్తి ఉన్న ప్రతి రచయిత ఎప్పుడో ఒకప్పుడు వారిని కలిసినవారే. సంప్రదించినవారే-పేరైన విని ఉంటారు. అతివాదం, మౌఢ్యంలేని వారి ఋజుప్రవర్తన, నిరాడంబర జీవితం వివరాలకు 20వ శతాబ్ది తెలుగు వెలుగులు రెండవభాగం పుట 845 చదవండి.

అట్లాగే సాహిత్యఅకాడమి వేసిన నన్నయ, తిక్కన, నన్నెచోడ, శ్రీనాథుల పదప్రయోగ సూచికలు అవసరం ఉన్నవారు తిప్పేస్తే వారికి కావలసిన పదాలు దొరుకుతాయి. అయితే వారు సంస్కృత పదాలను చేర్చక తెలుగు శబ్దాలకే సూచిక తయారు చేశారని గమనించాలి. ఏఏ సందర్భాల్లో, ఏఏ అర్థాల్లో, ఏఏ అర్థచ్ఛాయల్లో ఆ పద ప్రయోగం జరిగిందో, తర్వాతి కాలంలో ఆ పదానికి స్వరూపంలో, అర్థంలో వచ్చిన పరిణామ మేమిటో గుర్తించడానికి, అదే పదం ఇతర ప్రాంతాల్లో భిన్నార్థంలో వాడబడేదా? సమానార్థకంలోనే వాడబడేదా నిర్ణయించుకోవడానికి ఇలాంటి పద ప్రయోగ సూచికలు పెద్ద ఎత్తున రావాలి.

శబ్ద రత్నాకరం, శబ్దార్థ చంద్రిక, సూర్యారాయాంధ్ర నిఘంటువు, ఆంధ్ర మహాభారత నిఘంటువు, పర్యాయపదకోశాలు, తెలుగు వ్యుత్పత్తికోశం, చేనేత, కుమ్మర, వ్యవసాయం, మేదర, మత్స్యకార, పదకోశాలు, తెలుగుకు ఆంగ్లం, కన్నడ, తమిళ, సంస్కృత, మరాఠి, ఉర్దూ, హిందీ, ఒరియా రష్యన్

భాషలకు వచ్చిన నిఘంటువులు, (అటూ ఇటూ కూడ) ద్విభాషా త్రిభాషా నిఘంటువులు, భౌతిక, రసాయన వైద్య, పరిపాలన న్యాయ శాస్త్ర నిఘంటువుల, జాతీయాలను, పదబంధాలను అర్థవివరణలతో పరిణామాలతో తెలిపే పదబంధ పారిజాతం (2 సంపుటాలు) సంకేత పదకోశాలు, వ్యాకరణ, ఛందఃపదకోశాలు, తాళ్ళపాక పలుకుబడులు గమనించాలి. ఇవన్నీ చదువుకుంటూ కూర్చోవాలని కాదు. ఇవి ఉన్నాయి. అవసరం పడినప్పుడు ఉపయోగించుకొని ప్రయోజనం పొందాలని చెప్పడమే నా ఉద్దేశం.

పౌరాణిక కథలను, పాత్రలను తెలిపే గ్రంథాలు పూర్వగాథాలహరి, పురాణ నామకోశం, పురాణ నామచంద్రికలు ఉన్నాయి. పాఠాలు చెప్పే అధ్యాపకులకు పురాణ కథలకు సంబంధించిన సందేహాలను నివారించుకోవడానికి ఇవి ఎంతగానో ఉపకరిస్తాయి.

మనకు చాలామంది రచయితలపేర్లు, రచనల పేర్లు తెలియవచ్చు. వారి జన్మ స్థలాలు, పుట్టిన గిట్టిన తేదీలు, ఉద్యోగాదుల వివరాలు తెలియకపోవచ్చు. మనకు సన్నిహితులైన రచయితలే చనిపోయి అయిదారునెలలు దాటితే వారు మరణించిన తేదీలు మరిచిపోయే అవకాశం ఉంటుంది. 1901 నుండి 2005 వరకు జీవించిన 1600 ప్రముఖుల జీవన వివరాలతో, రచనల వివరాలతో, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**'20వ శతాబ్ది తెలుగు వెలుగులు'** పేరుతో రెండు సంపుటాలను ప్రచురించింది. దానికి సంపాదకత్వం వహించిన వారు వెలగా వెంకటప్పయ్య గారు. మూడవ సంపుటం మాత్రం మూలుగుతుంది. అదెప్పుడు వస్తుందో!

తెలుగు అకాడమివారు తెలుగు సాహిత్యకోశం-ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం పేర్లతో రెండు బృహత్సంపుటాలను పునర్ముద్రించి అందుబాటులోకి తెచ్చింది. ఎన్నెన్నో పుస్తకాల, ఎందరెందరో వ్యక్తుల వివరాలు దీనిలో లభిస్తున్నాయి.

తెలుగు విశ్వవిద్యాలయం వారి 16 విజ్ఞాన సర్వస్వ సంపుటాలు - అందులో భారతీయ సాహిత్యాన్ని తెలిపే భారతభారతి, విశ్వసాహిత్యాన్ని తెలిపే విశ్వసాహితి సంపుటాలు కారుచౌకగా ప్రచురించారు.

ఖగోళాంశాలు, భూగోళాంశాలు, వాయుమండలాలు, నదీనదాలు,ద్వీపాలు, పట్టణాలు, రాజవంశానుక్రమణిక, అస్త్రాలు, శస్త్రాలు, వర్ణ వ్యవస్థకు సంబంధించిన రకరకాల అంశాలు, స్త్రీ పురుషుల బాల వృద్ధుల, రాజుల మంత్రుల సేవకుల వేషధారణలు, మాంసభక్షణలో విధినిషేధాలు, వాస్తు శాస్త్ర విశేషాలు, భిన్న భిన్న విద్యలు, భిన్న భిన్న వైద్యాలు, నాట్య సంగీతాదులు ఇలా ఎన్నో చిత్ర విచిత్ర ఆశ్చర్య జనక అంశాలు కొన్ని వందల గ్రంథాల నుండి సేకరించి వేయి ఆరోపాలతో నాళం కృష్ణారావు గారు **'శ్రీ కృష్ణరాయాంధ్ర విజ్ఞాన సర్వస్వం'** నిర్మించారు.

దాసరి లక్ష్మణస్వామి **'వర్ణన రత్నాకరం'** సాహిత్యంలో కవులు చేసిన వర్ణనలను ఒకచోటికి చేర్చి సంకలనం చేసింది.

ఖండవల్లి లక్ష్మీరంజనం నేతృత్వంలో తయారయిన **సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం** ఎనిమిది సంపుటాలు, కుందూరి ఈశ్వరదత్ సారథ్యంలో 3 సంపుటాల్లో వచ్చిన ఆంధ్రదేశ చరిత్ర భూగోళ సర్వస్వం. బియన్‌శాస్త్రిగారి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఆదిలాబాదు జిల్లా సర్వస్వాలు, ఇదేమార్గంలో వచ్చిన మెదక్, గుంటూరు, విక్రమసింహపురి సర్వస్వాలు, బ్రాహ్మణ, రెడ్డి రాజ్య సర్వస్వాలు, ఆంధ్ర క్షత్రియ రత్నాకరం మొదలైనవెన్నో ఉన్నాయి.

స్వామి కణ్ణపిళ్ళ ఐ.ఎ.ఎస్. తయారుచేసిన ఎఫిమరీస్ విక్రమశకం, శాలివాహనశకం, ఫసలీ, హిజ్రీ, క్రీస్తు శకాలకు సరియైన తేదీలను, వారాలను, తిథులను తెలిపేది. రాజుల, కవుల కాలనిర్ణయానికి ఈ గ్రంథం కామధేనువు పూర్వ పరిశోధకులందరు వాడుకొన్న గ్రంథమిది. (ఇప్పుడు కంప్యూటర్లో కాల నిర్ణయం సరి చూసుకొనే అవకాశముంది) ప్రభుత్వాల గెజిటీర్స్, నివేదికలు, వార్షిక సంచికలు కూడ అవసరం పడినప్పుడు ఉపయోగించుకో గలగాలి.

ఇలాంటి సంప్రదింపు/పరామర్శ/ ఆకర గ్రంథాలతో సన్నిహిత పరిచయం ఉంటే పరిశోధకునికి వృథాకాలహరణం జరగదు. మరి ఈ పుస్తకాలు పరిశోధకులకెంతమందికి తెలుసునో!

# 8

# వదులుకోవాల్సిన జాడ్యాలు

గతానుగతికంగా, అప్రయోజనకరంగా తెలుగు సిద్ధాంతగ్రంథాల్లో కొన్ని అలవాట్లు, జాడ్యాలు, బలహీనతలు చోటుచేసుకున్నాయి. సృజనాత్మకత లుప్తమైన ఒక మూసకట్టుధోరణి ప్రవేశించింది. వాటిని ఇకనైనా వదిలించుకొని కొత్తదారి తొక్కితే బాగుంటుంది. నా దృష్టికి వచ్చిన కొన్నింటిని మచ్చుకు పేర్కొంటాను.

**1.** తెలుగులో పిహెచ్.డి గ్రంథం అనగానే రెండు చేతులలో మోయలేనిది. ఇల్లు, కళాశాల దాటి బయటికి తీసుకొని పోలేనిదన్న రూఢి ఏర్పడింది. 1970కి ముందు సిద్ధాంత గ్రంథాలు వెయ్యి, రెండు వేల పుటల మధ్యలో ఉండేది. చేతిరాత తప్ప తెలుగు టైపింగ్ అదుబాటులో లేని కాలం అది. తర్వాత జబ్బుపుష్టి, పాండిత్యపుష్టి క్రమేపి తగ్గడంతో వెయ్యికిలోపు; ఆ తర్వాత ఇప్పుడు 500 పుటలకు లోపు సమర్పిస్తున్నారు. కొన్ని విశ్వవిద్యాలయాలు 275 పుటలకు దాటవద్దని కూడ శాసిస్తున్నాయి. అది కూడా రాయలేక పెద్ద పెద్ద అక్షరాలతో పంక్తుల మధ్య ఎక్కువ విరామంతో పేజికి 15 పంక్తులతో రాస్తున్నారు. (అందరు కాదు సుమా!)

**2.** మొదటి తరం సిద్ధాంత గ్రంథాలు చాలా వరకు ప్రక్రియావికాస చరిత్రలు. అందువల్ల ఆ ప్రక్రియ పుట్టుపూర్వోత్తరాలు, స్వరూప స్వభావాలు, తొలిమలిరచనలు ఇత్యాది సర్వాంశాలు పొందుపరచబడ్డాయి. అవన్నీ

ముద్రితమై ఇంచుమించు పాఠ్య గ్రంథాలుగా ఉపయోగంలోకి వచ్చాయి. ఇన్నేళ్ళ తరువాత కూడా సూటిగా విషయంలోకి వెళ్ళిపోకుండా పరిణామ వికాసాలు చెప్పడం ఒకరకమైన పౌరాణిక సంప్రదాయానికి అనుస్మృతి కాబోలు! డి. కామేశ్వరి రాసిన నవలలను విశ్లేషిస్తున్న గ్రంథంలో మొదటి నవల రాజశేఖరచరిత్రనా? రంగరాయ చరిత్రనా అని చర్చించడం; సలీం కథలను విశ్లేషిస్తూ తొలికథారచయిత గురజాడనా? భండారు అచ్చమాంబనా? అనీ; 'ఈనాడు' సంపాదకీయాలను విశ్లేషించే వ్యక్తి లండన్‌లో ఇండియాలో తెలుగులో తొలి దినపత్రికలను ప్రస్తావించడం - ఇలాంటివె. తెలుగు సిద్ధాంత గ్రంథాల్లో అసలు విషయం మూడవ అధ్యాయంలో ఉంటుందన్న విమర్శ ఇందువల్లనే వచ్చిందేమో!

ఈ పరిణామం చెప్పడం వల్ల గ్రంథానికి ఒక రకమైన నిండుదనం సిద్ధిస్తుందన్న భావం ఉన్నట్లుంది. నిర్ధారిత సత్యాలుగా అందరికీ అందివచ్చి మామూలు విషయాలై పోయిన వాటిని తన అంశానికి సంబంధం లేకపోయినా రాయడం పేజీలు పెంచడానికి తప్ప ప్రయోజనం శూన్యం.

**3**. జిల్లాలకు, ప్రాంతాలకు సంబంధించిన సిద్ధాంతగ్రంథాలు ఈ మధ్య కాలంలో తెగ వచ్చాయి. కర్నూలు/ మెదక్/ మహబూబ్‌నగర్/ నల్గొండ/శ్రీకాకుళం/ జిల్లా రచయితలు. కథా రచయితలు - వచన రచయితలు, పద్యకవిత్వం, వచన కవిత్వం, జానపద విజ్ఞానం - మత్స్య కార విజ్ఞానం ఇలాగ చేసే వారందరూ ఆయా జిల్లాల అక్షాంశ రేఖాంశాలు, మండలాలు, జనాభా, యాత్రాస్థలాలు, గనులు, అడవులు, నియోజకవర్గాలు, పంటలు లాంటి అన్ని విషయాలతో 35 నుండి 70 దాక పేజీలు నింపుతున్నారు. ఇవన్నీ కూడా ఆయా జిల్లాల విజ్ఞానసర్వస్వాలనుండి చాలా మటుకు ఎత్తిరాయక తప్పదు. కాని అసలు ఈ పరిశోధనాంశానికి ఈ జిల్లా వివరాలు ఏ మాత్రం దోహదం చేస్తాయని ప్రశ్నిస్తే సమాధానం శూన్యం. జిల్లాను రెండు మూడు పుటల్లో పరిచయం చేసి ముందుకు వెళ్ళవచ్చు.

**4.** ఇక జానపద సిద్ధాంత గ్రంథాల్లో 'ఆదిమమానవుడి' దగ్గరకు వెళ్ళడం గమనించవచ్చు. 'ఆదిమ మానవుడు చేసిన తొలికేక కవిత్వమయిందనీ,

తొక్కిన చిందులు నాట్యమయిందనీ, మాటకన్నా పాట ముందు పుట్టిందనీ ఇప్పటికీ రాస్తున్నారు. పుస్తకాల్లో అచ్చువేస్తున్నారు. ఆదిమమానవుడెట్లా ఉంటాడో మనకు తెలీదర్రా, తప్పో ఒప్పో ఎప్పటికీ రుజువు చెయ్యలేని ఊహలు చెయ్యటం వల్ల ప్రయోజనం లేదర్రా అని ఎంత చెప్పినా పరిశోధకుల చెవికెక్కటం లేదు.[1] అని చేకూరి రామారావుగారొకచోట రాశారు.

**5.** జానపదులు అమాయకులు నిష్కల్మషులు, కోమల మనస్కులు నిరుపేదలు, సత్యవ్రతులు, ధర్మపరులు అనే విశేషణాలు విరివిగా పరిశోధకులు వాడు తుంటారు. వారిలో కూడా కుటిలురు, దుర్మార్గులు, హంతకులు, ధనికులు ఉంటారు. జానపదం మీద పరిశోధన గదా అని స్తోత్రపాఠాలు చేయాల్సిన పనిలేదు.

జిల్లా, మండల జానపద గేయాల పరిశోధనలు జరిగాయి. ఇవన్ని చాలా మటుకు వర్ణనాత్మకంగా ఉంటాయి. జానపదుల సంస్కృతి, జానపదుల జీవన విధానం, జానపదుల విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు అంతరించిపోతున్నాయని అవి ఉండాలనీ, ఉంచడానికి అందరూ కృషి చేయాలని రాసేస్తున్నారు. ఇది అమాయకత్వం. ఆ జీవన విధానం ఉన్నప్పుడు మాత్రమే అని సాధ్యం. వారిని అలా ఉండాలని మనం కోరుతున్నామంటే వారిని వెనుకబడి ఉండాలని కోరుతున్నట్లు; ఆధునిక అభివృద్ధి ఫలాలను వారికి నిరాకరిస్తున్నట్లు భావం. ఒక సరికొత్త భావ ప్రవాహం, నాగరికతా తరంగం ఎగిసి ముంచెత్తుతున్నప్పుడు 'పాత'లోని చెడు అనుకొనే దానితో పాటు మంచి కూడా పోకతప్పదు. అది అనివార్యస్థితి. అందువల్ల ఆధునిక నాగరికతకు, ప్రగతికి, సమసమాజ నిర్మాణ భావనకు జానపదుల జీవన విధానాలు విరుద్ధమే అయినా అందులోని తార్కికతను, శాస్త్రీయతను విశ్లేషించడం వరకే చేయాలి.

**6.** సిద్ధాంత గ్రంథాల్లో కొన్నిసార్లు అతిసాధారణాంశాల అప్రయోజనకర విస్తరణ, అవసర విషయాలలో అతిక్లుప్తత కనిపిస్తుంది. దీనికి కారణం, చెప్పవలసిన విషయాల మీద స్పష్టత, నైపుణ్యం లేకపోవడం;

1. డా॥ జి. చెన్నకేశవరెడ్డి, ఆధునికాంధ్రగేయకవిత్వం (1988)కు రాసిన పీఠికలో

మొహమాటలు, భయాలు తోడు కావడం. దాని వల్ల మరేదో రాసేయడం జరుగుతుంది. ఈ 'పులుముడు' 'అయోమయాల' జాడ్యం వదిలించుకోవాలి.

**7.** ఇతరుల భావాలను, అభిప్రాయాలను తమవిగా ప్రకటించుకోవడం చాలా ఎక్కువవుతుంది. భావకవిత్వాన్ని ప్రణయ, దేశభక్తి, ప్రకృతి, సంఘ సంస్కరణ, భక్తి, స్మృతి అని ఆరుశాఖలుగా విభజించవచ్చు. డా॥సి.నారాయణరెడ్డిగారు కూడా ఇలాగే విభజించారు - అని నూనూగు మీసాల పరిశోధక విద్యార్థి రాస్తున్నాడు. ఈ పరిశోధక విద్యార్థి కాదు, ఇతని తండ్రి నడక నేరుస్తున్న కాలంలో సి. నారాయణరెడ్డి గారు ఆ విభజన చేశారు. అది నిత్యం పఠన పాఠనాదుల్లో నలుగుతుంది. (నారాయణరెడ్డి గారు చేసిన వర్గీకరణలో దేశభక్తి కవిత్వాన్ని సంఘ సంస్కరణకవిత్వాన్ని భావకవిత్వ శాఖలుగా ఇప్పటివారు అంగీకరించడం లేదన్న సంగతి ఈ పరిశోధక విద్యార్థికి తెలియదు)

**8.** ఉపయుక్తగ్రంథసూచిక ప్రయోజనమేమిటో తెలియకుండా 'ఉండాలికదా' అని ఉంచుతున్నారు. పూర్వం పండిత గోష్ఠుల్లో వాదాల్లో తాము ఏ భావజాలానికి చెందినవారమో, తమ ప్రామాణిక గ్రంథాలేవో చెప్పి వాదం ఆరంభించేవారట. అలాగే తమ పరిశోధనకు ఆధారసామాగ్రి ఇది, మరిన్ని వివరాలకూ, ప్రతిపాదితాంశాలను సరిచూసుకొని నిర్ధారించుకోవడానికీ ఈ పుస్తకాలను చూడవలసిందని అభ్యర్థించడం ఉపయుక్తగ్రంథసూచిక ప్రయోజనం. అంతే తప్ప చేతికందిన పుస్తకాలు, తన పరిశోధనాంశానికి ఏ మాత్రం సంబంధించనివి పర్యవేక్షకుని పుస్తకాలు పొందుపర్చడం కాదు.

సీనియర్ జూనియర్ తేడా లేకుండా చాలా మంది పరిశోధకులకు ప్రింటర్‌కు, పబ్లిషర్‌కు తేడా తెలియకపోవడం ఆశ్చర్యకరం. చేతికందిన ఓ నాలుగు సిద్ధాంత గ్రంథాలు తీసుకొని ఉపయుక్త గ్రంథసూచిక చూడండి - ఈ దోషం కనిపిస్తుంది.

**9.** సిద్ధాంత గ్రంథాల్లో గ్రంథచౌర్యాలు పెరిగిపోతున్నాయి. పేజీలకు పేజీలు ఎత్తిపోతల పథకాలు అవుతున్నాయి. ఇది నైతికంగాను,

చట్టరీత్యా నేరం. చాలామంది పట్టించుకోవడం లేదు. మనసులో తిట్టుకొని ఊరుకుంటున్నారు. కనుక బతికి పోతున్నారు. లేకపోతే జైలు పాలవుతారు. ఉద్యోగాలు కోల్పోతారు.

ఎవరి సిద్ధాంతగ్రంథాన్ని యథాతథంగా తనది చేసుకొని 'డాక్టర్' అయ్యాడో ఆ విద్యార్థి ప్రమోషన్‌కు మూలపరిశోధకుడు ఎక్స్‌పర్ట్‌గా రావడం, పట్టుబడడం, ప్రమోషన్ కోల్పోవడం, పర్యవేక్షకుడు గైడ్ షిప్ కోల్పోవడం ఓ విశ్వవిద్యాలయంలో జరిగింది. అప్పుడప్పుడు పత్రికల్లో గ్రంథచౌర్యాల వ్యాసాలు, వార్తలు చూస్తున్నాం. రచయితల మేధాపరమైన హక్కుల పరిరక్షణకు బ్రిటిష్ వారున్నప్పుడే 1847లో కాపీరైట్ చట్టం వచ్చింది. 1957లో ఆ చట్టంలో మార్పులు చేర్పులు చేశారు. రచనకు వస్తువు ఒకటే అయి వాడుకునే విధానం వేరయితే ఈ చట్టపరిధిలోకి రాదు. కాని యథాతథంగా అచ్చుతప్పులతో సహా ఎత్తి రాస్తే ఆరునెలల నుండి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష అంతేగాక యాభై వేల నుండి రెండు లక్షల వరకు జరిమానా ఉంటుంది.[1]

**10.** ఈనాటి పరిశోధకులు ఎక్కువగా సెకండరీసోర్సుల (ద్వితీయ శ్రేణి ఆధారాలు) మీద ఆధారపడుతున్నారు. ఈ జాడ్యం వదలాలి ప్రైమరీసోర్సు (మూల గ్రంథాల)ల్లోకి వెళ్ళి ఆధారాలు సేకరించుకొని సత్యాసత్యాలను, అభిప్రాయాలను బేరీజు వేసుకోవాలి. ఎవరో తమ ప్రయోజనం కోసం ముందు సగం తీసేసి, వెనక సగం తీసేసి ఇచ్చిన ఉల్లేఖనాలను వాడుకొంటే ఒక్కోసారి అర్థవైపరీత్యం, భావవైరుధ్యం రావచ్చు. అంతేగాక. తప్పుడుగా అన్వయిస్తే, పేర్కొంటే ఆ తప్పుడు మాటలే ప్రమాణమైపోయి చలామణిలోకి వచ్చే ప్రమాదముంది.

వేమనకు సంబంధించిన ఒక పుస్తకంలో సర్ విలియంజోన్స్ వేమనను భారతదేశపు ప్లేటో అని సిపిబ్రౌన్ అభివర్ణించినట్లు ఉంటుంది. వేమనను మొట్టమొదట ప్రస్తావించిన వ్యక్తి అబెదుబాయ్ (1765-1848). ప్రస్తావించిన సం॥రం 1812, మరి 1794లోనే మరణించిన విలియం జోన్స్ వేమన గురించి ఎలా మాట్లాడాడు? ఆయనకు తెలియనే తెలియదు. మరి సి.పి.బ్రౌన్ ఏ ఆధారంతో ఈ మాట చెప్పాడు? అసలు బ్రౌన్ మహాశయుడు ఏం రాశాడో చూద్దాం.

Vemana was evidently, in philosophy, of the vedanta School, a disciple of Vyasa, Whom sir William Jones has (in the Asiatic researches, Vol I, Page 362) entitled the Plato of India.[2]

'సర్ విలియం జోన్స్ భారతదేశపు ప్లేటో అని అభివర్ణించిన వ్యాసునికి వేదాంతమార్గంలో వేమన శిష్యుడు' - అని దీని భావం. ఇక్కడ విలియం జోన్స్ భారతదేశపు ప్లేటో అని అభివర్ణించింది వేదవ్యాసుని తప్ప వేమనను కాదు. (ఈ విషయాన్ని గుర్తించి చెప్పింది నార్ల వేంకటేశ్వరరావుగారు) మొదట రాసిన వ్యక్తి అన్వయించుకోవడంలో తబ్బిబ్బు పడితే అతన్ని నమ్మి మరికొందరు ముందుకెళ్ళారు.

**11.** దేనికి అర్థం చెప్పినా మూలాతిక్రమణం కూడదు. మూలకర్త భావానికి, ఆంతర్యానికి విరుద్ధంగా, చెప్పడానికి వీల్లేదు. శ్రీనాథుడు 'అభిప్రాయంబు గుర్తించియు' అనువదించాలని చెప్పింది ఇటువంటి వాటిని గురించే. 'నా మూలం లిఖ్యతే కించిన్నానపేక్షిత ముచ్యతే!' (మూలంలో లేనిది అవసరం లేనిది రాయను) అని మల్లనాథ సూరి చెప్పిన పంక్తులు మరచిపోకూడదు)

సంగీత ప్రాశస్త్యాన్ని అభివర్ణించే ప్రతిసందర్భంలో ఈ శ్లోకాన్ని చాలామంది ప్రస్తావిస్తారు.

**శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణి**
**కో వేత్తి కవితాతత్త్వం శివో జానాతి వా న వా**

ఇక్కడ మూలకర్త కవిత్వ మహత్వాన్ని ఉగ్గడించడం కోసం సంగీతానికి న్యూనత నాపాదించాడు. బుద్ధి వికసించని శిశువులు, బుద్ధి లేని పశువులు, పాములు సంగీతం విని తలలూపవచ్చు. కాని కవిత్వం గొప్పతనం ఏ ఒకరిద్దరికో, ఆ భగవంతునికో మాత్రమే తెలుస్తుంది. ఇది అసలు భావం. అయితే అసలు భావమున్న కింది రెండు పంక్తులు మాయమై పోయాయి.

---

1. తెలుగు ముద్రణ ప్రచురణ వికాసం (2012) డా॥ వెలగా వెంకటప్పయ్య పుట 179.
2. Verses of Vemana C.P. Brown 23.11.1824 రాసిన పీఠిక

మీది రెండు పంక్తులు శ్లోకకర్త హృదయం భగ్నమయ్యేలా ప్రచారమైపోయాయి. (సంగీతమే గొప్పది. ఎవరికైనా అర్థం కాగలదు. కవిత్వం దండగ. అది భగవంతునికే అర్థంగావాలి అంటూ సంగీతాన్నే గొప్ప చేశాడు ఈ శ్లోకకర్త అని వాదిస్తారేమో!

**12.** నవలలమీద, కథల మీద చేసే పరిశోధకులు పేజీలకొద్ది కథాసారాంశాలు రాసేస్తున్నారు. ఓ రచయిత 20 నవలలు రాస్తే, వాటి సారాంశాలు ఒక్కోటి ఆరేడు పేజీలు రాస్తే 120 పుటలు తయారవుతాయి మళ్ళీ పాత్రపోషణల పేరుతో, సన్నివేశకల్పనపేరుతో, ఉప శీర్షికల కింద ఇంకో రూపంలో తిరిగి అదే ప్రత్యక్షమవుతుంది. ఒకటి రెండు పుటల్లో సారాంశం చెప్పేసి, పునరుక్తులు రాకుండా జాగ్రత్త పడాలి. గ్రామనామాలమీద, భాషాశాస్త్రాంశాల మీద ఇటీవల జరిగిన కొన్ని ఎం.ఫిల్., పిహెచ్.డి గ్రంథాల్లో పేజీలకొద్ది పట్టికలకు పట్టికలు దర్శనమిస్తున్నాయి. ఒక జిల్లా గ్రామనామాల సిద్ధాంత గ్రంథంలో 50 పుటలదాకా నిలువుగా గ్రామనామాల జాబితా ప్రధానాధ్యాయం కింద చోటు చేసుకొంది. పత్రికాభాషాపదాలు, అన్యదేశ్యాలు లాంటి అంశాలకు సంబంధించిన గ్రంథాల్లో ఈ పట్టికల జాడ్యం మితిమీరి ఎబ్బెట్టనిపిస్తుంది.

ఒక ఆత్మావలోకనం చేసుకొని మరింత సుష్ఠుప్రణాళికలతో, సృజనశీలంతో విలక్షణరీతిలో, స్పష్టప్రతిపాదనలతో, ఔచితీమంతంగా సిద్ధాంత గ్రంథాలను తీర్చిదిద్దు కోవాలన్నదే ఆంతర్యం.

# 9

# పరిశోధన గ్రంథ రచన

తెలుగు సిద్ధాంత గ్రంథాల్లో పరిశోధకులకు 'రచనాభ్యాసం లేమి' కొట్టవచ్చినట్లు కనబడుతుంది. అనన్వయవాక్యాలు, గర్భివాక్యాలు, గ్రాంధిక వ్యావహారిక మిశ్రమం, అకస్మాత్తుగ మొదలుపెట్టడం లాంటి ఎన్నో దోషాలు కనిపిస్తున్నాయి.

'విజ్ఞులు మన్నింతురేని నేటి పరిశోధన గ్రంథములను పరిశీలించినచో వైరి సమాసములు, యడాగమదోషములు, అన్వయక్లిష్టతలు, ధర్మ - ధర్మి వాచక నిర్ణయా సమర్థతలు - భావార్థక తద్ధితములపై 'త'కార ప్రయోగములు సంధిదోషములు, సంబంధార్థక తద్ధితముల స్థానమున అపత్యార్థక తద్ధిత ప్రయోగములు కొల్లలుగా గోచరించుచున్నవి. వీనిని సరిదిద్దవలసిన ఆచార్యులే, తమ గ్రంథములందు 'జయంతోత్సవములు', 'షష్ఠి పూర్త్యుత్సవవేడుకలు' వంటి రూపములను ప్రయోగించు చున్నారనగా నవి ప్రమాదభరితములని తలచుట యెట్లు? ఇది నేను ఎవ్వరిని విమర్శింప వలయునను దృష్టితో వ్రాసినది కాదు. వేదనతో మాతృభాషకు జరుగుతున్న అపచారమునకు క్రుంగి కృశించిన హృదయముతో వ్రాయుచుంటిని. ఒక వేళ నేనిట్లుశంకించుట దోషముగా పరిగణింతురేని క్షమించవలసినదిగా చేతులెత్తి నమస్కరింతును. మనపూర్వులు సాహితీ శేముషీదురంధరులు కీ॥శే॥ వేటూరి వారు. కీ॥శే॥ పింగళి వారు, కీ॥శే॥ చాగంటి వారు, కీ॥శే॥ నిడుదవోలు వారు, కీ॥శే॥ రాళ్ళ పల్లి వారెందరో, యీ విమర్శక వాఙ్మయమునకు పాదులు

తీసి ఆరోగ్యప్రదమైన బాటలు వేసిరి. అవి బీటలు వారుచున్నవన్న హృదయావేదనయే నాచేనిట్లు పలికించినది;' అని ప్రముఖ కవులు, విద్వాంసులు మొవ్వ వృషాద్రిపతిగారు ఒక పీఠికలో విచారించిన వైనం ప్రస్తుత సిద్ధాంత గ్రంథాల భాషతీరును ప్రతిఫలిస్తుంది.

ఏది రాసిన కర్త కర్మ క్రియ వాటికి వేస్తున్న విశేషణాలు లింగ వచన విభక్తులు వీటి మీద దృష్టి పెట్టి రాస్తే చాలవరకు సరిపోతుంది. చిన్న చిన్న వాక్యాలు రాసే అలవాటు చేసుకొంటే దోషాలు దొర్లవు. చాంతాడంత వాక్యం రాస్తే తప్పులు దొర్లే అవకాశం ఉంటుంది. మన దృష్టికి అది త్వరగా రాదు. భాషా పటాటోపం, సుదీర్ఘ సమాసరచనం అసహజం. 'జరుగుడు' వాక్యాలు మితిమీరితే వెగటు కలిగిస్తాయి. చెప్పడం జరిగింది. వెళ్ళడం జరిగింది. రాయడం జరిగింది. గమనించడం జరిగింది. ఇది కర్తృత్వాన్ని ఆరోపించుకోవడం కూడదని కర్మప్రాధాన్యంతో చెప్పాలన్న దుగ్ధకొద్ది చేసేపని. సులువుగా చెప్పనైంది. (చెప్పాను) వెళ్ళనైంది (వెళ్ళాను) రాయనైంది (రాశాను) గమనించనైంది. (గమనించాను) అని రెండు తీరుల రాసే అలవాటు చేసుకోవచ్చు.

మనం చదువుకొన్నది గ్రాంథికభాష, రాస్తున్నది వ్యావహారిక భాష, మాట్లాడేది మాండలిక భాష, ఆపైన పత్రికా భాషాప్రభావం. మాటల్లో ఆంగ్ల పద బాహుళ్యం ఇలా ఉండడం మూలాన భాషలో గ్రాంథిక వ్యావహారిక మిశ్రమం అనివార్యం. కాని కాస్త దృష్టి పెట్టుకొని ఒక ఏకరూపత (Uniformity) తెచ్చుకోగలగాలి. అది అసాధ్యమైన విషయం కాదు. కొద్దిపాటి రచనాభ్యాసంతోనే సాధించుకోవచ్చు. నామవాచకాలలో అన్యదేశ్యాలు (కంప్యూటర్, రైలు లాంటివి) యథేచ్ఛగా వాడుకోవచ్చు. కాని క్రియల దగ్గర మాత్రం దేశ్యపదాలనే వాడాలి. భిన్న గ్రంథాలను అధ్యయనం చేయడం. వాక్య నిర్మాణ విశేషాలను పరిశీలించడం, వాటిని మనం ప్రయోగించుకొని సొంతం చేసుకోవడం నిరంతర అభ్యాసంగా చేస్తే వస్తుంది. రచనా వ్యాసంగాన్ని వ్యసనంగా పెట్టుకోవాలి. మనకు ఎక్కడ ఒక కొత్త పదం కనిపించినా ఒక

కొత్త భావం కనిపించినా దాన్ని ఎక్కడో ఒక చోట మన వ్యాసాల్లో ఇరికించాలి. దాని వల్ల దేశాన్ని ఉద్ధరిస్తున్నామని కాదు. మనం అభ్యాసం చేసే అవకాశం పొందుతున్నామని భావించాలి.

అన్యార్థస్ఫూర్తి, సందిగ్ధతలకు తావు లేకుండా అతి వ్యాప్తి, అవ్యాప్తి దోషం లేకుండా నిసర్గసుందరంగా సరళంగా క్లుప్తంగా విషయనివేదనాత్మకంగా రాయడమే వాక్య ప్రయోజనం. అలాంటి వాక్యాల పరంపర పారాగ్రాఫులుగా, అధ్యాయాలుగా, గ్రంథాలుగా పరిణమిస్తాయి. కనుక వాక్యాలమధ్య ఏకరూపత (Uniformity) అనే ప్రధాన గుణాన్ని పనిగట్టుకొని సాధించుకోవాలి. 'పోస్టల్ కోచింగ్‌లో కారు డ్రైవింగ్' నేర్చుకోవడం సాధ్యం కానట్లే ఇలా ఆరు ఏడు పుటల సూచనామాత్రమైన అధ్యాయంతో వాక్య నిర్మాణాల మెళుకువలు తెలియవు. నిరంతర అభ్యాసం, పరిశీలనమే గమ్యంగా మన పెన్నుకు, మన మనసుకు మంచి వాక్య రచన అలవాటు పడిపోవాలి. అష్టావధాని గణాలు సరిగా పడుతున్నాయా? యతిప్రాసలు పడుతున్నాయా అని ఆలోచించడు. అటోమేటిగ్గా పడిపోతాయి అంతే. గణాలు యతుల మీద దృష్టి ఉంటే పద్యం చెప్పలేడు. తన భావాన్ని పొదిగించలేడు. అట్లాగే సిద్ధాంత గ్రంథ రచన నాటికి సహజ సిద్ధంగా అలవాటు పడిపోవాలి.

దీనిని సాధన ద్వార సాధించుకోవలసిందే. ఇంకోటి ప్రధానంగా జరిగేదోషం సాభిప్రాయపదప్రయోగం చేయలేకపోవడం. అధ్యాయాలు రాశాక ఓ నెల రెండు నెలలు విరామమిచ్చి చదువుకొంటే అందులోని దోషాలు మనకు తెలిసివస్తాయి. అట్లాగే టైపింగ్ చేశాక ఓ రెండుసార్లు అక్షర దోషాలు సరిచూశాక పక్కకు పెట్టేయాలి. ఓ నెల రోజుల తర్వాత చదివితే అక్షర దోషాలు కనిపిస్తాయి. అదే పనిగా రాసినా, అక్షర దోషాలు దిద్దినా మనస్సు పనిచేయడం మానేస్తుంది. దోషాలు దృష్టిలో పడవు. 'రచన' చేసిన వ్యక్తికి విషయం తెలిసిఉండడంవల్ల అక్షరదోషాలు కొన్ని తప్పిపోయే అవకాశం ఉంటుంది. అదే విషయం తెలియని వ్యక్తి అయితే అక్షర దోషాలన్ని జల్లెడ పట్టగలడు. మిత్రులు, సహాధ్యాయులు పరస్పరం సహకరించుకొని

దిద్దుకోవాలి. టైపింగ్ తర్వాత ప్రూఫ్ రీడింగ్ ఘట్టం ఒకటి ఉంటుందనీ దానికి కనీసం ఒక నెల రోజుల కాలం పడుతుందన్న సంగతి నూటికి తొంభై శాతం పరిశోధకులకు తెలియడం లేదన్న సంగతి పరీక్షకునిగా నాకు తెలిసిన సంగతి.

సీనియర్ ఆచార్యులు, ప్రముఖ విమర్శకులు, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, హెచ్.ఎస్. బ్రహ్మానందగారల హితోక్తిని కాస్త చెవులు పెట్టి వినండి. 'ఇప్పుడు తెలుగు సిద్ధాంత గ్రంథాలు విమర్శకు గురౌతుండడానికి ప్రధాన కారణం మొదట రాసిన చిత్తుప్రతే సిద్ధాంత గ్రంథ రూపం ధరించడం అనిపిస్తుంది. ఇది అందరిలో కాకపోయినా కొంతమందిలోనైనా కనిపిస్తుంది. ఒకసారి చిత్తుప్రతి రాసేస్తే తర్వాత గురువు చూసుకుంటాడులే అని పరిశోధకుడు భావించకూడదు. కనీసం మూడు సార్లయినా తిరిగి రాస్తే సిద్ధాంత గ్రంథంలోని లోపాలు తొలగిపోతాయి. పూర్వాపరసమన్వయం, లేకపోవడం, అనవసరవిస్తృతి, పునరుక్తులు, వికృతమైన శైలి మొదలైన లోపాలకన్నింటికీ కారణం పరిశోధకులు తిరిగి రాయడానికి బద్ధకించడం, పర్యవేక్షకులు వాటిని గట్టిగా పట్టించుకోకపోవడం. ఈ లోపాలకు ఇక్కడ ఇద్దరినీ బాధ్యులుగా చెయ్యాలి. సిద్ధాంత గ్రంథాన్ని రెండు మూడు సార్లు రాస్తే విషయంలో చిక్కదనం వస్తుంది. భాష సంస్కరింపబడుతుంది. అనవసరవిషయాలను తొలగించుకోవచ్చు. వెలితిని పూడ్చుకోవచ్చును అయితే ఇవాళ గురుశిష్యులిద్దరూ వేగం, తీరికలేమిలలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడవలసిన అవసరం ఉంది. అప్పుడే సిద్ధాంత గ్రంథం ఆరోగ్యకరంగా ఉంటుంది.'[1]

సిద్ధాంత వ్యాసం రాసేటప్పుడు విద్యార్థులు సత్యాన్వేషణ దృష్టితో అకడమిక్ తాటస్థ్యంతో రాయాలే కాని సంచలనాలు సృష్టించడానికీ రాగద్వేషాలు విపరీతంగా వ్యక్తీకరించడానికి యత్నించకూడదు. రచనలో భాషలో, భావంలో సర్వత్ర సంయమనం, క్లుప్తత, సూటిదనం ప్రదర్శించాలి. కుడి ఎడమల పక్షాల ఉద్యమకారులు, ఇంకా అనేక వాదాలవారు తమ

1. సాహిత్య పరిశోధన (2010) పుట 18

ఉనికికోసం, తమ ఉద్యమ లక్ష్యాల కోసం తమ సిద్ధాంతాల కనుగుణంగా విషయాలను చెబుతుంటారు. వక్రీకరిస్తుంటారు. సగం సగం దాచిపెడ్తారు. పరిశోధన ఎవరిమెప్పు కోసమో ఎవరి ఆనందం కోసమో చేయడం కాదు. పరిశోధనలో దాపరికాలు, అర్ధసత్యాలు ఉండకూడదు. ఎలాంటి సంచలనాత్మక వాఖ్యలు లేకుండా ఆధారసహితంగా సంయమనంతో రాసేవి కావడం వల్ల సిద్ధాంత గ్రంథాలు చప్పగా అనిపించవచ్చు. పత్రికల వారికి విషయపరిజ్ఞానం కన్నా వాడి వేడి చర్చలతో, వాదోపవాదాలతో ఆకర్షించడం; తమ రేటింగ్ పెంచుకోవడం లక్ష్యాలు. ఈ లక్ష్యాలు అకడమిక్ వ్యాసాలవల్ల నెరవేరవు. అంటే డాక్టరేట్ గ్రంథం రాసినంత మాత్రాన పరిశోధకుడు తన రాజకీయ సామాజిక విశ్వాసాలను అణచివేసుకోవాలని కాదు. పత్రికల్లో స్వేచ్ఛగా తన దృక్పథానికనుగుణంగా ఆవేశపూరితంగా రాసుకోవచ్చు.

ఎంత ప్రసిద్ధ రచయిత అభిప్రాయాన్నైనా పరిశోధకుడు స్వేచ్ఛగా మొహమాటం లేకుండా విభేదించవచ్చు. నిజానికి అలా విభేదిస్తేనే పరిశోధకుని సత్తా తెలిసేది. కాని దానిని సగౌరవంగా విభేదిస్తూ చర్చించాలి. తప్ప ఆధిక్షేపాలు, దూకుడు, వెటకారాలు దూషణలు, కులప్రస్తావనలు పనికిరావు.

1. బ్రౌన్ తెలుగుభాషకు ఎంతో సేవచేశాడు, 2. అనితరసాధ్యమైన సేవ చేసిన మహనీయుడు సి.పి.బ్రౌన్ 3. బ్రౌన్ సాహిత్య సేవ స్తవనీయం. అది మనకెంతో ఆదర్శప్రాయం – ఇలా ఎన్ని తీరులయినా ఒకే భావాన్ని రాయవచ్చు.

'నాలుగు యూనివర్సిటీలు, పద్నాలుగు అకాడమీలు, సవాలక్ష సమితులు, ఘనత వహించిన ఐరావతం వంటి ప్రభుత్వం ఈ అరవై ఏడేళ్ళలో చేయలేని పనిని బ్రౌన్ ఒక్కడే ఇరవై ఐదేళ్ళలో చేసిపెట్టిపోయాడు. మొరటుగా అనిపిస్తే అనిపించనీగాక మనసులో ఉన్నమాట అనేయాలనిపిస్తుంది. ఇప్పుడు మన మధ్య మసలుతూ యూనివర్సిటీల ప్రాపుతో, అకాడమీల ఛత్రఛాయల్లో ప్రభుత్వ ఆసరాతో తెలుగు పండితుల మని ప్రొఫెసర్లమని విర్రవీగుతూ రాజ్యాలేలుకుంటున్న వారినందరినీ కట్టగట్టి తూచినా బ్రౌన్ కాలికొనగోటికి సరిరారు అనిపిస్తుంది.' అని బంగోరె (బండిగోపాలరెడ్డి) ఆవేశపూరితంగా

రాస్తాడు. ఆ అసహనం దూకుడు బంగోరెకు అందం తెచ్చింది. ఈ రోజు బంగోరె అంటే తెలియని తరం వచ్చియుండవచ్చు. బంగారం లాంటి కృషి చేశాడు. కాని ఇలాంటి రాతలు అప్రయోజనకరాలు. ముఖ్యంగా సిద్ధాంత గ్రంథాల్లో నిషిద్ధాలు అని పరిశోధకులు ఎప్పుడు గుర్తించాలి.

ఒకే అంశంమీద ఇద్దరు పండితులు ప్రతిస్పందించిన తీరు సరిపోల్చి చూస్తే శైలుల మధ్య ఉండే అంతరాలు, మనస్తత్వాల తీరు తేటతెల్లమవుతాయి. దోషాలు వేరు, అభిప్రాయభేదాలువేరు. రచయితలు అభిప్రాయభేదం ప్రకటించేటప్పుడు అందునా దిగ్దంతులయిన మేధావులతో విభేదించవలసి వచ్చినప్పుడు సంయమనంతో రాయాలి. 'శ్రీనాథుడు సీసపద్యాలను చెడగొట్టాడు' అని వేయిపడగలు నవలలో ధర్మారావు వాదిస్తాడు. ఇది ఒక నవలలో ప్రసక్తంగా ఒక పాత్ర నోటి గుండా వచ్చిన మాట. ఒక పాత్ర అభిప్రాయమే తప్ప విశ్వనాథ అభిప్రాయం అని నిర్ధారణగా చెప్పడానికి వీలుపడదు. సృజనాత్మక రచనల్లో కథాపరంగా, సన్నివేశపరంగా, పాత్రల పరంగా వెలువడే అభిప్రాయాలన్నింటిని రచయిత స్వీయాలుగా చెప్పజాలం. ప్రసాదరాయకులపతి గారు దీనిని వ్యతిరేకించిన విధం గమనించండి. 'ఈ వాదమును ప్రతిపాదించిన వారు సామాన్యులు కారు, కవి సమ్రాట్ విశ్వనాథ వారు, ప్రత్యేకముగా నాకు అత్యంత భక్తి గౌరవ స్థానమైన వారు. వారి మీద భక్తివేరు. ఈ విషయం వేరు. శ్రీనాథుని సీసపద్య రచనను గూర్చి వారి వాదము వారిది. దానిని నేనే కాదు. ఎవరును అంగీకరింపజాలరు. అయినను వారి దొక వాదము. సీసపద్యమునకు ఒయ్యారము కూర్చిన శ్రీనాథుని మనోహరరీతికి ఇంత మాత్రమున నష్టము లేదు.'[1] అలాగే మరుపూరి కోదండరామిరెడ్డి గారు వ్యతిరేకించిన పద్ధతి పరిశీలించండి. 'ఎవరో పెదబుద్ధులు శ్రీనాథుడు సీసములు చెడగొట్టినాడనిన చంద్రునిపై ఉమిసిన వాడివలె వెంగళప్ప యగును.'[2] 'శ్రీనాథుని రసప్రసిద్ధ ధారధుని' అని ప్రస్తుతించిన కవితా శిల్ప మర్మజ్ఞుడయిన విశ్వనాథ పెదబుద్ధి, వెంగళప్ప అన్న మాట. ఇలాంటివి కూడదు.

---

1, 2 శ్రీనాథ కవితా వైజయంతి (1986), డా॥ పి. సుమతీ నరేంద్ర సం॥ పుట. 253, 14

# 10

# పర్యవేక్షకులు

ఈ వ్యవస్థలో పర్యవేక్షకుని పాత్ర తప్పనిసరి. ఒక్క శ్రీవేంకటేశ్వర, మద్రాసు విశ్వవిద్యాలయాల్లో మాత్రం వయసులోను, అనుభవంలోను పెద్దవారు పరిశోధనకు పూనుకొంటే పర్యవేక్షకుడు లేకుండా స్వతంత్రంగా పరిశోధించడానికి కొన్నిసార్లు అనుమతించారు. సాధారణంగా పర్యవేక్షకుడు ఉండక తప్పదు. తీసుకొన్న అంశాన్ని గురించి విద్యార్థి పరిశ్రమిస్తాడు. తేనెటీగ పూవు పూవు తిరిగి మధువును సేకరించిన తీరుగా పరిశోధకుడు సమాచారాన్ని సేకరిస్తాడు. రాస్తాడు. పర్యవేక్షకుడు తన అనుభవం ద్వారా దాని నంతా ఒక ప్రత్యేక పద్ధతిలో వచ్చేలా సూచనలు చేస్తూ స్పష్టతకోసం సవరణలు చేస్తు తీర్చిదిద్దుతాడు. పరిశోధక విద్యార్థి పరిశ్రమ, పర్యవేక్షకుని అనుభవం ఏకీకృతమై ఒక చక్కని గ్రంథం వెలువడాలని ఈ నిబంధన ఆంతర్యం. విద్యార్థికి ఒక అంశంపై నిర్దుష్టమైన అభిప్రాయాలు ఉంటే వాటిని పర్యవేక్షకునితో చెప్పి ఒప్పించగలగాలి. పర్యవేక్షకుడు కూడా ఆ అభిప్రాయాలను కావాలని మార్చాలను కోకుండా వాటిని మరింత నిశితంగా వ్యక్తీకరించేలా తోడ్పడాలి. సమాచారం తెచ్చుకోవడం దానికై తిరగడం, మార్చడం, రాయడం వగైరా అంతా పరిశోధకుని పనే తప్ప పర్యవేక్షకునిది కాదు. పర్యవేక్షకుడు టార్చిలైటు లాంటివాడు. ఆ వెలుగులో వెళ్ళాల్సింది విద్యార్థియే. పరిశ్రమ చేసేది అంతా విద్యార్థే కనుక విద్యార్థి స్వతంత్రంగా ఎదగాలి. అంతేకాని పర్యవేక్షకుని మీద పూర్తిగా ఆధారపడకూడదు. పర్యవేక్షకుని దైనందిన

కార్యభారం అందుకు సమ్మతించదు. **పర్యవేక్షకత్వం ఎప్పుడూ కపి కిశోర న్యాయమే తప్ప మార్జాలకిశోర న్యాయం కాదు.**

విద్యార్థులు పర్యవేక్షకుని మీద ఎంతో విశ్వాసంతో ఉంటారు. వారి విశ్వాసాన్ని వమ్ము చేయకుండా బాధ్యతతో పర్యవేక్షకులు వ్యవహరించాలి. విడివిడి అధ్యాయాల మీదనే కాకుండా సిద్ధాంతగ్రంథం సమగ్రస్వరూపం మీద కూడా ఎప్పుడూ పర్యవేక్షకుడు దృష్టిపెట్టి ఉంచాలి. తెలుగు సిద్ధాంత గ్రంథాలు కొన్నింటిల్లో ఉండే పునరుక్తులు, స్వవచోవ్యాఘాతాలు, పూర్వాపర సమన్వయ రాహిత్యం, అనవసరమైన దైర్ఘ్యం వీటన్నింటికి కారణం పర్యవేక్షకుల ఔదార్యం, శిష్యవాత్సల్యం, ఓపికలేనితనమే హేతువు. పర్యవేక్షకుడు ఆ సబ్జెక్టుకు కొత్తవాడు కావచ్చు. అయినప్పటికీ విషయావగాహన పరిశోధకుని కన్నా పర్యవేక్షకునికే త్వరగా కలుగుతుందనడం నిస్సందేహం. ఆ పరిశోధనాంశానికి తాను పర్యవేక్షకుడు కావడంవల్లనే తెలుసుకొనే అవకాశం సిద్ధించిందనుకొని ఓపికతో చదివి మార్గదర్శనం చేయాలి. అలా చేస్తేనే విద్యార్థి మీద శ్రద్ధ, పరిశోధనాంశం మీద ఆసక్తి, సముచిత పరిజ్ఞానం పర్యవేక్షకునకు ఉన్నాయన్న భావం విద్యార్థిలో కలుగుతుంది. ఆ అంశం మీద ఉన్న కొత్త సమాచారాన్ని సూచించగలగాలి. ఆ ప్రత్యేక రంగంలో పనిచేసిన విమర్శకులను తాను సంప్రదించాలి. విద్యార్థికి వారిని పరిచయం చేయాలి. సెమినార్లలో ఆ అంశంపై మాట్లాడే అవకాశాన్ని విద్యార్థికి కలిగించాలి. అప్పుడు జరిగే చర్చలు విద్యార్థికి మరింత ఉపయోగకరం కావచ్చు. పరిశోధకుడు తనకు సరిగ్గా అర్థంకాని విషయాలను, సమన్వయం కుదరని అంశాలను స్పష్టంగా గుర్తుపెట్టుకొని, వాటిని ప్రత్యేకించి పర్యవేక్షకుని వద్ద చర్చిస్తే ఇరువురికీ సుకరమవుతుంది.

పరిశోధక విద్యార్థి తన పరిశోధనకు సంబంధించి ఎందరెందరినో కలవాల్సి వస్తుంది. విశ్వవిద్యాలయంలో ఎం.ఏ చేస్తున్న కాలంలో ఆ శాఖలోని అందరికీ విద్యార్థి. పరిశోధన కాలంలో ఒక్కరికే విద్యార్థి. ఒక్కోసారి విద్యార్థి ప్రవర్తన అనుభవరాహిత్యంతో ఉండవచ్చు. అది అనాలోచితంగానే పర్యవేక్షకునిలో తనను ధిక్కరిస్తున్నాడన్న భావం కలగడానికి దోహదం చేయవచ్చు. అలాంటి భావాలు, పొరపొచ్చాలు తలెత్తకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి.

పరిశోధకులు తమ పర్యవేక్షకునికి అందుబాటులో ఉంటూ తరచు కలుస్తు ఉంటే త్వరగా పూర్తిచేయాలన్న కాంక్ష ఇద్దరిలోను కలుగుతోంది. విద్యార్థికి ప్రోత్సాహం పర్యవేక్షకునికి జ్ఞాపకం ఉంటాయి. అసలు పర్యవేక్షకుడు ఎదురుపడితే గుర్తుపట్టలేని పరిశోధకుడు ఒకసారి నాకు తటస్థపడ్డాడు. విద్యార్థిలోని ఉత్సాహం, ఆసక్తి పర్యవేక్షకుని త్వరపెడతాయి. చాలామంది పరిశోధకులు ఇచ్చిన టైంకు రాకపోవడం, మరో రోజు రావడం, పర్యవేక్షకులు ఇతర వ్యాపకాల్లో ఉండడం, కొందరు వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లాంటి ఉన్నత స్థానాల్లో ఉండడంవల్ల టైం కేటాయించలేకపోవడం లాంటి ఇబ్బందులు కలుగుతాయి. కొంతమంది పరిశోధకులు ఏళ్ళూ పూళ్లూ గడిచినా పర్యవేక్షకుని కలువరు. వారు పరిశోధన చేస్తున్నారో, మానేశారో కూడా తెలియదు. అటువంటప్పుడు వార్షిక నివేదికలు పంపేటప్పుడో, అధికారులు అడిగినప్పుడో పరిశోధన కొనసాగుతుంది అని అబద్ధం రాయాల్సి వస్తుంది. అందరూ అలా రాయాలని లేదు. పరిశోధన రద్దు చేయమని కూడా రాయవచ్చు. గృహసమస్యలు, అరోగ్యసమస్యలు, నిరుద్యోగసమస్యలు నిజంగా ఉంటే పర్యవేక్షకుని కలిసి చెప్పుకోవడం సముచితం. మర్యాదపూర్వకంగానైనా కలవడానికి థీసీస్ రాయడానికీ సంబంధం లేదు కదా!

పరిశోధకుడు అధ్యాయాలు రాసి తెస్తున్నప్పుడల్లా ఏదో కొత్త సమాచారం, కొత్త ఆలోచనలు తెచ్చి ఆశ్చర్యపరచాలని పర్యవేక్షకుడు భావిస్తాడు. పరిశోధక పర్యవేక్షక సంబంధం పరిశోధనలో చేరిన నాటి నుండి మౌఖిక పరీక్ష దాకా దాదాపు మూడు నాలుగేళ్ళపాటు ఉంటుంది. ఏ పర్యవేక్షకుడు కూడా తన దగ్గర పరిశోధిస్తున్న వ్యక్తి మధ్యలో వదిలేసి వెళ్ళిపోవాలని కోరుకోడు. ఏ మాత్రం పొరపొచ్చాలు వచ్చినా మనస్తాపాలు ఆందోళనలు కలుగుతాయి.

ఎలాంటి ప్రశ్నలు వేసుకుని ఎలా సమాధానాలు రాబట్టుకోవాలో ఎలా తీర్చిదిద్దుకోవాలో విద్యార్థి పర్యవేక్షకుని నుండి నేర్చుకొంటాడు. తన అనుభవాన్ని విద్యార్థికి పంచి ఆ ప్రత్యేక అంశానికి సంబంధించిన విజ్ఞానాన్ని పర్యవేక్షకుడు తన విద్యార్థి నుండి అందుకొంటాడు.

పర్యవేక్షకులు తమ దగ్గర ఇన్ని పిహెచ్.డిలు ఇన్ని ఎం.ఫిల్స్ వచ్చాయని సగర్వంగా చెప్పుకొంటారు. కొన్నిసార్లు పదోన్నతిలో ఈ సంఖ్య

కూడా పాత్ర వహిస్తుంటారు. అదెంతవరకు వాస్తవమో చెప్పలేం. కాని పర్యవేక్షకునికి సంఖ్య పట్ల సంతృప్తి కలగడం నిజం.

మొదట్లో ఉమ్మడి పర్యవేక్షకత్వం ఉండేది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జియన్‌రెడ్డిగారు పింగళి లక్ష్మీకాంతంగారితో, భూపతి లక్ష్మీనారాయణరావుతో, కోరాడమహాదేవశాస్త్రిగారితో కలిసి పర్యవేక్షకత్వం వహించారు. పర్యవేక్షకుల సంఖ్య క్రమంగా పెరగడంతో ఉమ్మడి పర్యవేక్షకత్వానికి స్వస్తిచెప్పారు. తులనాత్మక అధ్యయన కేంద్రాల్లో రెండు భిన్న భాషల గ్రంథాలను పోల్చి పరిశీలిస్తున్నప్పుడు ఆ భిన్న భాషలకు చెందినవారు పర్యవేక్షకులుగా నియుక్తులవు తున్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో నున్న తులనాత్మక అధ్యయన కేంద్రంలో ఉమ్మడి పర్యవేక్షకత్వాన్ని గమనించవచ్చు. వీటివల్ల ఫరిశోధన రాటుదేలు తుంది. అది హర్షించదగిందే. అయితే ఒక్కోసారి ఒకరిమీద ఒకరు తోసేసుకొని పర్యవేక్ష కులిద్దరూ లాంఛనప్రాయంగానే మిగిలిపోవచ్చు. ఒక పర్యవేక్షకుని సలహా మరో పర్యవేక్షకుడు కొట్టేయడంతో పరిశోధకుడు దేనిని అనుసరించాలో అర్థంగాక అయోమయంలో పడవచ్చు. పర్యవేక్షకులిరువురు పరస్పరం పడనివారైతే పరిశోధకుడు అనుభవించే మానసికాందోళనకు అంతే ఉండదు. ఒకరిచేతి మీదుగా నడిచినప్పుడు వచ్చినంత సమగ్రస్వరూపం ఇద్దరి చేతుల్లో రావడం కష్టం. అవగాహన కుదరదు. వీలైనంతవరకు ఉమ్మడి పర్యవేక్షకత్వం ఉండకపోవడమే మేలేమో! భిన్న భాషలకు చెందినప్పుడు ఆ భాషకు సంబంధించిన వ్యక్తిని అనధికారికంగా సంప్రదించడమే సముచితమేమో!

పర్యవేక్షక వ్యవస్థకు సంబంధించి సీనియర్ ఆచార్యులు కేతవరపు రామకోటి శాస్త్రి గారి ఆలోచనలను గమనించడం అప్రస్తుతం కాదు.

'మనం పర్యవేక్షకులుగా గుర్తింపుకార్డు పొందిన తరువాత పరిశోధన చెయ్యటానికి వచ్చేవారి మీద మనకు చాలా చిన్న చిన్న అభిప్రాయాలు కలుగుతున్నాయి. అభిరుచి లేనివాళ్ళూ, చేయటానికి ఏ పనీ దొరకని వాళ్ళూ, అర్హతలేని వాళ్ళూ, పరిశోధన చెయ్యటం ఇష్టంకూడా లేని వాళ్ళూ రకరకాల కారణాల చేత పరిశోధన చేస్తామని చేరుతున్నారని మనం అనుకొంటాం.

నిజమే మనం మన ప్రమోషన్లకోసం పరిశోధనలు చేస్తున్నాం. పరిశోధనలను పర్యవేక్షణ చేస్తున్నాం. మన స్వార్థం మన కున్నది. ఉండటం తప్పుకాదు. అది ఇతరులకు అంటే పరిశోధన చెయ్యటానికి వచ్చేవాళ్ళ కుండరాదనటమే తప్పు. మనకు పరిశోధనలో అభిరుచి ఉండాలి. అభినివేశం ఉండాలి. సత్యదృష్టి ఉండాలి. సామాజిక ప్రయోజన దృష్టి ఉండాలి. నిరంతర పరిశ్రమ ఉండాలి. పరిశోధన చేస్తామని వచ్చేవాళ్ళకు మార్గదర్శకంగా ఉండగల శక్తిసామర్థ్యాలుండాలి. భాషా సాహిత్య ఆచార్యులమైన మనం మనరంగాల్లో పరిశోధించి వెలుగులోకి తీసుకొని రావలసిన అంశాలు ఏమున్నాయో అందుకు తగిన మార్గాలేమిటో ముందుగా తెలుసుకొని ఉంటే కదా వచ్చిన వాళ్ళకు ఇది సమస్య ఇది మార్గం ఇది ఇట్లా చెయ్యాలి. ఇందుకు కావలసిన శక్తి ఇదీ అని చెప్పగలం.

ఎం.ఏ. పాసై వచ్చిన విద్యార్థి నుండి మనం కోరకూడని ప్రమాణాలను కోరకూడదు. కోరుతున్నామంటే అర్థం పరిశోధన రంగంలోకి వాళ్ళ ప్రవేశాన్ని అదుపు చెయ్యటానికి చూస్తున్నామన్న మాట. పరిశోధన డిగ్రీలతో వాళ్ళ బ్రతుకు తెరువులకు ముడి ఉన్నదని తెలిసి తెలిసి వాళ్ళ ప్రవేశాన్ని అదుపు చేయచూస్తున్నామంటే అర్థం ఏమిటి? అక్షరాలు రానివాళ్ళంతా పరిశోధనకు ఎగబడుతున్నారంటే ఎలా? వాళ్ళనలా తయారు చేసింది మనమే కదా! అధ్యాపనాన్ని వృత్తిగా పెట్టుకొన్న మనం ఆ పనిని ఎప్పుడూ చెయ్యమంటే ఎలా? కనీసం పరిశోధన చేస్తామని వచ్చిన వాళ్ళనయినా రానిచ్చి వాళ్ళకైనా చేయవలసిన సహాయం చేద్దాం. అక్షరాలు నేర్పవలసి వస్తే నేర్పుదాం. మనం ఎంత పరిశోధకులమో వాళ్ళకు తెలుసు? వాళ్ళు మనలను చూచి నేర్చుకుంటారు. ఆ అవకాశమైనా వాళ్ళకియ్యటం మంచిది. కొత్త సామాజిక జీవిత పరిస్థితులేర్పడుతున్న కాలంలో పాతాలోచనలు పనికి రావు. పరిశోధన పనికి వచ్చే పనిగా ఉండాలి. అందుకు పరిశోధన పర్యవేక్షకులమైన మనం బాధ్యత వహించాలి' - ఇలా ఎన్ని చెప్పుకొన్నా పరిశోధనలో పరిశోధకునిదే ప్రధాన బాధ్యత, పర్యవేక్షకుడు సహాయకారి అని గుర్తించక తప్పదు.

# 11

# పరీక్షకులు

సిద్ధాంత గ్రంథరచనం ముగిసి విశ్వవిద్యాలయానికి సమర్పించాక ఈ పర్వం మొదలవుతుంది. పర్యవేక్షకుడు కొంతమంది పేర్లు సూచిస్తాడు. ఎం.ఫిల్ అయితే ఒకరికి పిహెచ్.డి అయితే ముగ్గురికి పంపిస్తారు. గతంలో పరీక్షకులు తాము గ్రంథాన్ని చదివి నివేదిక రాసుకొని విశ్వవిద్యాలయానికి వచ్చి స్వయంగా విద్యార్థిని పరీక్షించేవారు. కొన్ని విషయాలు నివేదికలో పొందుపరచకుండా వ్యక్తిగతంగా చెప్పేవారు. విద్యార్థులు సవరించుకొనేవారు. సాధారణంగా తిరస్కరించడం అనేది ఉండదు. ఈ తిరస్కరించడ మనేదే లేనప్పుడు పరీక్షకులకు దారిభత్యాలు ఇచ్చి రప్పించడమెందుకు అని చాలా విశ్వవిద్యాలయాలు ఈ పద్ధతిని మానుకొన్నాయి. ఈ మధ్య మళ్ళీ కొన్ని విశ్వవిద్యా లయాలు 'వైవా'లకు బయటి వారిని పిలవడం మొదలు పెట్టాయి.

'సిద్ధాంత నిబంధనలకు పరీక్షకులుగా వ్యవహరించే పెద్దలు మొగమాటాలను విడిచిపెట్టాలి. ప్రమాణాల విషయంలో ఉన్నతస్థాయి విషయంలో రాజీపడడం మానుకోవాలి. ఈనాడు చాలా విశ్వవిద్యాలయాలు మౌఖిక పరీక్షలను ఎత్తివేసాయి. దీనికి వారు చూపుతున్న కారణం చూస్తే అది మనకు గౌరవ ప్రదమయినది కానేకాదు. ఈ దుర్దశను తక్షణ తొలగించుకోవాలి. మేధావి వర్గంలో నిజాయితీ నిద్రలేవాలి. లేకపోతే పరిశోధన అంతా వట్టిబూటకం అని యావత్ప్రజానము తిరస్కరించే రోజు

త్వరలోనే వస్తుంది. ఈ ప్రమాదాన్ని వారించి ఉన్నత ప్రమాణాల పరిరక్షణకు మనం పునరంకితం కావాలి.' అని రాజీ ఎరుగని పరిశోధకులు ఆచార్య టి. దొణప్ప గారు తమ షష్టిపూర్తి సభలో హెచ్చరించారు.

పిహెచ్.డి. మౌఖిక పరీక్షల కోసం రావడం మూలానా మొదటితరం ఆచార్యులు అందరికీ తెలిశారు. తెలుగుశాఖ పరిశోధనల్లో పునరుక్తులు నివారింపబడక పోయినా ఒకరకమైన సయోధ్య ఏర్పడింది. ఇప్పుడు రాకపోకలు తగ్గిపోవడంతో ఏ విశ్వవిద్యాలయంలో ఎవరున్నారో, వారి అభిరుచులు, వారి పరిశోధనలేమిటో తెలియనిస్థితి ఏర్పడింది. అసలు సీనియర్ ప్రొఫెసర్సే తెలియనప్పుడు ఇక తక్కినవారి సంగతి చెప్పాలా?

స్వయంగా వచ్చే పద్ధతి ఎత్తేయడంతో ఇప్పుడు ఇతర విశ్వవిద్యాలయాల వారు కేవలం నివేదిక పంపిస్తారు. మౌఖిక పరీక్షలో కొన్ని ప్రశ్నలడగమని సూచిస్తారు. స్థానిక విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ అధ్యక్షుడు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఇంకా ఇద్దరు సభ్యులు కలిసి ఒక కమిటీగా ఏర్పడి ఈ మౌఖిక పరీక్ష తంతు నిర్వహిస్తారు. ఆ సమావేశంలో కూర్చొనేదాకా సభ్యులకు ఒక్కోసారి పరిశోధకుడు, పరిశోధనాంశం తెలియనిస్థితి ఉంటుంది. అంటే చదివినవారు అడిగినా, అడిగేవారు చదివినా విద్యార్థి చిక్కుల్లో పడతాడన్న భావం ఏదైనా ఉందా అని లీలగా అనిపించకమానదు. ప్రశ్నలడిగే కమిటీ సభ్యులు తిరస్కరిస్తే డిగ్రీ ఆపేశక్తి ఈ కమిటీకి ఉందా లేదా అన్నది చర్చనీయాంశం.

ఇక పరీక్షకులు తాము పరీక్షిస్తున్న గ్రంథానికి సంబంధించిన ఇతర పుస్తకాలను ఒక గంటసేపైనా తిప్పేస్తారా? అన్నది కూడా సంశయమే. సాధారణంగా రెండు పుటల నివేదిక రాస్తారు. పావుపేజి సిద్ధాంత గ్రంథం పేరు, పర్యవేక్షక పరిశోధక విశ్వ విద్యాలయనామత్రయం ఆక్రమిస్తుంది. తర్వాత అధ్యాలయాలపేర్లనద్దంగా రాయదం కొన్ని అక్షర దోషాలను, మరికొన్ని వాక్యనిర్మాణ దోషాలను, ఇంకో రెండు మూడు ఇతర అంశాలను పేర్కొని పరిశోధకునికి పర్యవేక్షకునికి అభినందనలు తెల్పడంతో ముగుస్తుంది. ఇది

పరీక్షకులను తక్కువ చేయడం కాదు. ఇంకా సీరియస్‌నెస్ రావాలన్నదే. ఈ వేగమయజీవితంలో ఎప్పుడూ రకరకాల పనుల్లో తలమునకలుగా ఉండే పరీక్షకులు తమకు అవసరంలేని ఒక సిద్ధాంత గ్రంథాన్ని నాలుగయిదు గంటలపాటు ఎందుకోసం చదవాలి అని ప్రశ్న కూడా ఉత్పన్నం కాకమానదు. నిజమే. పరీక్షించడం ఒక గౌరవ ప్రదమైన అవకాశంగా భావిస్తున్నారే తప్పిస్తే అన్యం కాదు. విద్యార్థికి మరింతలోతుగా నిశితంగా పరిశీలించి నివేదిక రాస్తే శ్రేయోదాయకం, ఉత్తేజదాయకం. పరీక్షకులకు పర్యవేక్షకులకు మధ్యనున్న స్నేహబంధాల వలన, మొహమాటాల వలన చాలా పరిశోధనలు గట్టెక్కుతున్నాయి. పరీక్షకులు వ్యక్తిగత చర్చల్లో తమ అసంతృప్తిని స్పష్టంగా వెల్లడిస్తుంటారు కూడా.

డిగ్రీ ఇస్తూనే ఎంతో కష్టపడి వివరంగా సూచనలు పొందుపరిస్తే వాటిని విద్యార్థికి చూపకుండా, విద్యార్థి జిరాక్స్ చేసుకోనీయకుండా 'కాన్ఫిడెన్షియల్' అనే పేర దాచేస్తున్నారు. దానివల్ల దిద్దుకోవలసిన విద్యార్థికి అవకాశం లేకుండా పోతుంది. పర్యవేక్షకులు, ఆంతర్గత పరీక్షకులు ఒక సెకండు పాటు వాటిని చూసి. కనుబొమ లెగరేసి పక్కకు పెట్టేస్తారు.

డిగ్రీపరీక్షపేపర్లకు కోడ్‌నెంబరు ఉంటుంది. ఎం.ఏ పేపర్లకు కోడ్ నెంబర్ ఉంటుంది. పత్రికలు నిర్వహించే కథా నవలారచనల పోటీలలో రచయిత పేరు, చిరునామ వాటి మీద ఎక్కడా రాయకుండా విడిగా రాయాలని నిర్దేశముంటుంది. కాని ఎం.ఫిల్, పిహెచ్.డి గ్రంథాలమీద మాత్రం పరిశోధకుడు పర్యవేక్షకుడు విశ్వవిద్యాలయం పేరు పెద్ద పెద్ద అక్షరాలతో ఉంటుంది. ఈ సంప్రదాయ మెందు కొచ్చిందో అర్థం కాదు. భాషలకు, మానవీయ శాస్త్రాలకు, వైజ్ఞానిక శాస్త్రాలకు విడిగా అకాడమీలుండి లేదా ఒకే అకాడమీలో విడివిడిగా విభాగాలుండి కానీ సమన్వయం చేయాలి. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల పిహెచ్.డి గ్రంథాలు ఆ అకాడమీకి సమర్పించాలి. వారు పరిశోధకుడు, పర్యవేక్షకుడు, విశ్వవిద్యాలయం పేరు లేకుండా పరీక్షకులకు పంపించి నివేదికలు తెప్పించి విశ్వవిద్యాలయానికి పంపించే వ్యవస్థ ఏర్పడాలి. దాంతో కొంతలో కొంతయినా బాగుపడుతుందేమో!

పరీక్షకులు పంపిన నివేదికలన్నీ పరీక్షల విభాగంలో బూజుకొట్టుకొని పోతుంటాయి. 'కాన్ఫిడెన్షియల్' అని వాటిని దాచాల్సిన అవసరమేమిలేదు. విద్యార్థులకు ప్రయోజనం సిద్ధించింది. ప్రతి తెలుగు శాఖలో ఓ రెండు వందల పిహెచ్.డిలు మరో రెండు వందల ఎం.ఫిల్ వ్యాసాలు వచ్చాయి. ఈ నివేదికలన్నింటిని కలిపి చక్కగా బైండింగ్ చేయించి తెలుగు శాఖల్లో భద్రపరచడం మంచిది. ఔత్సాహికులకు విశ్లేషించే అవకాశం కలుగుతుంది.

ఇంకా ఏమేమో రాయాలన్న ఉబలాటం ఉంది. కాని ఇప్పటికే సుదీర్ఘమై పోయింది. ఏది ఏమైనా బలహీనతలని తొలగించుకుంటూ తెలుగు పరిశోధన ప్రగతి పథంలో సాగాలని అభిలషించడం మన ధర్మం. అందుకు కొంతలో కొంతైనా పాటు పడడం మన కర్తవ్యం.

**తమసోమా జ్యోతిర్గమయ!**

Blank Page

Blank Page

పట్టు పట్టరాదు పట్టివిడవరాదు
పట్టెనేని బిగియబట్టవలయు
పట్టి విడుటకన్న బరగ జచ్చుట మేలు
విశ్వదాభిరామ వినురవేమ.

(వేమన శతకం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతికశాఖ, సాంస్కృతిక మండలి

ప్రచురణ, ముద్రణ & పంపిణీ
తెలుగు అకాడమి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా సంస్థ
హిమాయత్‌నగర్, హైదరాబాదు

email : info@teluguacademy.net
web : www.teluguacademy.net